ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ తదియ ఉ.11.42 వరకు అనంతరం చవితి; నక్షత్రం: ధనిష్ఠ రా.12.55 వరకు అనంతర శతభిష్టం; అమృతకాలం: రా.1.05 నుండి 2.55 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:265 • బుధవారం 9 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

ఈబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



సబ్‌కాసాత్-సబ్‌కా వికాస్‌లో భాగమే

అన్ని మతాల్లోని పేదలకు 10% రిజర్వేషన్లు

కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్

బిల్లు జేపీసీకి పంపాలని కాంగ్రెస్ డిమాండ్

ముస్లింలకు రిజర్వేషన్లు ఎందుకివ్వలేదు: ఒవైసీ

నేడు రాజ్యసభకు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: చారిత్రాత్మక 124వ రాజ్యాంగసవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన ఈ బిల్లుకు 323 మంది సభ్యులు అనుకూలంగా, ముగ్గురు సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. మూడింట రెండొంతుల సభ్యులకు పైగా మద్దతు పలకడంతో బిల్లు పాసైనట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. మంగళవారం ఈ బిల్లుపై లోక్‌సభ సుదీర్ఘంగా చర్చించింది. ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఆర్థిక వెనుకబడిన తరగతులకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 124వ రాజ్యాంగ సవరణ బిల్లు కేంద్ర సామాజికన్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 15, 16కు సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లు తెచ్చామని కేంద్ర సామాజికన్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ తెలిపారు. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగ సంస్థల్లో పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అనే విధానంలో భాగంగానే బిల్లు తెచ్చామని లోక్‌సభలో వివరించారు. రాజ్యాంగసవరణ ద్వారా ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నందువల్ల దీనిని సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకునే అవకాశం లేదని ➪ 3వ పేజీలో...



ముస్లింలకు 12% 10% గిరిజనులకు

రిజర్వేషన్ల పెంపుపై ఆశలు

- పార్లమెంట్ వేదికగా తెరాస ఎంపీలు పోరు
- పట్టువీడొద్దంటూ అధినేత కేసీఆర్ ఆదేశం
- రాజ్యాంగ సవరణ బిల్లులో ఈ అంశాలు పొందుపరచాలని ఎంపీల డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రకులాల్లోని పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై ఆశలు చిగురిస్తున్నాయి. ఆ దిశగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఈ అంశంపై మంగళవారం ఉదయాన్నే తన పార్టీకి చెందిన ఎంపీలతో మాట్లాడి మార్గనిర్దేశం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై ప్రజలకిచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ఇదే సరైన సమయమన్న విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఎంపీలు వ్యూహాత్మకంగా డిమాండ్‌ను పరిష్కరించుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో అసెంబ్లీలో తీర్మాణించి పంపిన ప్రతిపాదనలను కూడా చేర్చాలన్న అంశాన్ని తెరపైకి తెచ్చారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా తెంాకు చెందిన ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ కూడా తనకున్న పరిచయాలతో పలువురు ప్రాంతీయ పార్టీల నేతలతో చర్చించి సభలో తాము ప్రతిపాదించిన అంశాలకు మద్దతు తెలుపాలని కూడా విజ్ఞప్తి చేశారు. గడిచిన రెండేళ్ళ ➪ 3వ పేజీలో...

సీతారామాకు క్లియర్

పర్యావరణ అనుమతులు ఇచ్చిన కేంద్ర సర్కార్

ఫలించిన కేసీఆర్ దౌత్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీతారామా ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతిని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ మంజూరుచేసింది. ఈమేరకు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కర్కెట్ట నుండి ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ వి.సుధాకర్‌కు మంగళ వారం లేఖ అందింది. గత సంవత్సరం నవంబర్ 27న జరిగిన ఈఏసి సమావేశంలో సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి మంజూరు చేయమని సిఫారసు చేసిన విషయం విదితమే. వారి సిఫార్సుల మేరకు పర్యావరణ మంత్రిత్వశాఖ తుది అనుమతిని జారీచేసింది. తాజాగా ఢిల్లీవెళ్ళిన సందర్భంలోనూ ముఖ్య మంత్రి కేసీఆర్ ➪ 2వ పేజీలో...



డిజిటల్ పేమెంట్ కమిటీ ఛైర్మన్‌గా నందన్ నీలేకని

6లో



సీబీఐ బాస్ ఈజ్ బ్యాక్

అలోక్ వర్మ సెలవుపై పంపిస్తూ కేంద్రం ఉత్తర్వులు

చెల్లవని సుప్రీం తీర్పు

10లో



ఐఎంఎఫ్ తొలి మహిళా చీఫ్ ఎకనామిస్టుగా గీతా గోపీనాథ్

గీత మైసూర్ అమ్మాయి

8లో

సంక్రాంతి వేళ... పదవులు



సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి నియామకం

- సిద్దిపేటతోనే బోణీ.. పండుగలోగా మరికొందరికి పదవులు
- కేటీఆర్ సహా పార్టీ ముఖ్యులతో సీఎం కేసీఆర్ కసరత్తు
- మళ్లీ అవకాశం ఇవ్వాలని రాజీనామా చేసిన నేతల వినతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెరాస నాయకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న పదవుల పందేరం మొదలైంది. తన సొంత జిల్లాలోని సిద్దిపేటకు చెందిన నేతకు సీఎం కేసీఆర్ తొలి నజరానా అందించారు. పట్టణానికి చెందిన పార్టీ నేత, ముఖ్యమంత్రికి సన్నిహితుడు అయిన మారెడ్డి శ్రీనివాసరెడ్డిని పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రెండోసారి కొలువుదీరాక తొలి నియామకం శ్రీనివాసరెడ్డితోనే మొదలు కావడం విశేషం. వాస్తవానికి మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఆశించినప్పటికీ ప్రస్తుత సామాజిక సమీకరణాల రీత్యా స్థానం కల్పించడానికి ఇబ్బందులున్న నేపథ్యంలో ముందుగా కీలకమైన పౌరసరఫరాల సంస్థను అప్పగించారు. నియామక ఉత్తర్వులు వెలువడిన శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రమంత్రివర్గం, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, స్పీకర్, విప్‌లు ఇలా అన్నిపదవులకు వివిధ సమీకరణాలను ➪ 2వ పేజీలో...

కేబినెట్ జాప్యం?!

- 18న మంత్రివర్గ కూర్పు అనుమానమే
- ఒక మంత్రితోనే అసెంబ్లీ సమావేశాలు
- ప్రభుత్వ సలహాదారులుగా పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం
- బడ్జెట్ సమావేశాల్లో ఆర్డినెన్స్?
- శాసనసభ స్పీకర్‌గా పోచారం?



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త మంత్రులు లేకుండానే శాసనసభ సమావేశాలను నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారా? కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఇంకా సమయం తీసుకోనున్నారా? ఏకైక మంత్రి మహమూద్ అలీతోనే మరికొంత కాలం ప్రభుత్వాన్ని నడపనున్నారా? అవుననే అంటున్నాయి తెరాస వర్గాలు. ఈనెల 17 నుంచి నాలుగు రోజులపాటు శాసనసభ సమావేశాలు జరపాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నోటిఫికేషన్‌ను కూడా జారీచేశారు. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా 18న మంత్రిమండలిని విస్తరిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... 18న మంత్రివర్గంలోకి కొత్త మంత్రులను తీసుకోకపోతే ఫిబ్రవరి 7వ తేదీన ఈ ప్రక్రియ జరగవచ్చని పార్టీలో సీనియర్లు అంచనా వేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఫిబ్రవరి 7వ తేదీన మంచి ముహూర్తం ఉందని పండితులు చెప్పడంతో సీఎం కేసీఆర్ కూడా ఆ తేదీనే కొత్త మంత్రులచేత ప్రమాణ స్వీకారం చేయించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. తెలంగాణలో సాధారణంగా సంక్రాంతి పండుగను అంత వైభవోపేతంగా నిర్వహించరు. ఈ పండుగకు ముందు, ఆ తర్వాత రోజులను పీడ రోజులుగా భావిస్తారు. దీంతో 18న మంత్రివర్గ విస్తరణ ఉండకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే శాసనసభాధిపతి, ఉపసభాపతి, పార్లమెంటరీ కార్యదర్శుల నియామకానికి సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ పూర్తిస్థాయిలో కసరత్తు చేసే పనిలో నిమగ్నమై ఉనట్టు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటైన ములుగు, నారాయణపేట జిల్లాలతో ➪ 2వ పేజీలో...

క్యూనెట్ కుచ్చు టోపీ

3 వేల కోట్లు హాంఫట్



- ఐటీ ఉద్యోగులకు సాఫ్ట్‌గా మల్టీలెవల్ మోసం
- బాధితులంతా ఐటీ నిపుణులే.. హాంకాంగ్ నుంచి ఆపరేషన్.. 58 మంది అరెస్ట్
- రూ.2.7కోట్లు సొమ్ము.. అకౌంట్లు సీజ్
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ సంస్థ ప్రారంభిస్తున్న సరికొత్త పథకంలో పెట్టుబడి పెడితే ఆకర్షణీయ లాభాలు, అందులో మంచి వాటా ఇస్తామని వలవేసి, ఆ తరువాత ఫీజుపేరిట డబ్బులు గుంజిన క్యూనెట్ సంస్థ సభ్యుల మోసాల గుట్టు రట్టయింది. వ్యాపార వాణిజ్యాల్లో మెళకువలు చెబుతామని, ఆకర్షణీయ పథకాల్లో పెట్టుబడులు పెడితే మల్టీ లెవల్ మార్కెటింగ్‌తో పెద్దఎత్తున డబ్బు సంపాదించవచ్చంటూ డబ్బు వసూలు చేసి వేలాదిమందిని మోసగించి వేలకోట్లు స్వాహా చేసిన క్యూనెట్ సంస్థకు చెందిన ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. హాంకాంగ్ వేదికగా జరిగిన ఈ మోసంలో బాధితులు, నిందితులు ఐటీ నిపుణులే ➪ 9వ పేజీలో...

80 దళిత కుటుంబాలు బహిష్కరణ

నిజామాబాద్ జిల్లా మారంపల్లిలో ఘటన

నందిపేట్, ప్రభన్యూస్ : నిజామాబాద్ జిల్లా, మారంపల్లి గ్రామంలో 80 దళిత కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ బహిష్కరించింది. వివాదాస్పదంగా మారిన బహిష్కరణ ఇంకా కొనసాగుతునే ఉన్నది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు గ్రామాన్ని సందర్శించి దళితులతో మాట్లాడారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో చర్చించారు. అయినా ఇంకా గ్రామ పెద్దలు పట్టు వీడటం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మారంపల్లి గ్రామంలో శిఖం భూమిలో అంబేద్కర్ భవాన్ని నిర్మించడానికి దళిత సంఘాలు పూనుకున్నాయి. అయితే ఆ భూమిలో ➪ 9వ పేజీలో...

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క?

రాహుల్ మొగ్గు.. ఎంపిక లాంఛనమే..

తెరాస ఆకర్ష్‌కు కాంగ్రెస్ చెక్ యత్నం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఖమ్మం జిల్లా మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్కను పార్టీ అధినాయకత్వం ఎంపిక చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో భట్టినే సీఎల్పీ నేతగా నియమించడం శ్రేయస్కరమన్న భావనతో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉన్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో మెజార్టీ సభ్యులను తమవైపు తిప్పుకోవాలని తెరాస అధినేత కేసీఆర్ భావిస్తున్న సమయంలో వారిని నియంత్రించడానికి భట్టి విక్రమార్క వంటి నేత సరిపోతారని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తున్నట్టు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల వరకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించాలని ఇప్పటికే రాహుల్‌గాంధీ నిర్ణయించారు. ఇప్పటికిప్పుడు ➪ 9వ పేజీలో...



10లో

ఏకగ్రీవాలపై ఈసీ నిఘా

వేలం వేస్తే ఏడాది జైలు.. ఆరేళ్ల అనర్హత

ఔరా..!



సంక్రాంతి వేళ... పదవులు

కేటీఆర్ సహా పార్టీ ముఖ్యులతో సీఎం కేసీఆర్ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముండడంతో కేసీఆర్ అన్నింటిపైనా ఒకేసారి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రసమితి ఘనవిజయం సాధించి రెండోసారి అధికారంలోకి రాగా, పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలకు పదవుల బొనాంజా లభించనుంది. ఓవైపు ఎమ్మెల్సీ పదవులకు కొందరు నేతల పేర్లు పరిశీలిస్తుండగా, ఇక తమకు ఎమ్మెల్సీరాదన్న నిర్ధారణకు వచ్చిన పలువురు నేతలు కీలక కార్పొరేషన్లపై గురిపెట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గతంలో కొన్ని సర్దుబాట్ల కారణంగా, స్థానిక సమీకరణాల కారణంగా పదవుల భర్తీలో అవకాశం దక్కని నేతలకు, ఆదినుండీ పార్టీనే నమ్ముకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 90కు పైగా కార్పొరేషన్లు ఉండగా, ఇందులో 35 కార్పొరేషన్లకు ప్రస్తుతం ఛైర్మన్లు ఉన్నారు. ఈ 35మందిలో కూడా 20 మంది ఛైర్మన్ల పదవీకాలం త్వరలో ముగియనుంది. ఈ నేపథ్యంలో గతంలో ఇచ్చిన హామీలు, జిల్లాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా ఛైర్మన్ పదవులను భర్తీ చేయాలని అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు యోచిస్తున్నారు. ఇక సోమవారం నామినేటెడ్ ఎమ్మెల్యే నియామకాన్ని ప్రకటించిన సీఎం కేసీఆర్, మంగళవారం పౌరసరఫరాల సంస్థతో కార్పొరేషన్లకూ శ్రీకారం చుట్టారు.

కేటీఆర్‌కు ప్రగతిభవన్ పిలుపు



పదవుల పందారంపై ముఖ్య మంత్రి మంగళవారం కసరత్తు జరిపిన నేపథ్యంలో పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ను మధ్యాహ్నం ఫోన్ చేసి ఆహ్వానించినట్లు తెలిసింది. ప్రగతిభవన్ నుండి సీఎం పిలుపు నేపథ్యంలో మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్‌కు రావాల్సిన కేటీఆర్ రాలేకపోయారని తెలంగాణభవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఈదఫా ఎన్నికల సందర్భంగా సిట్టింగ్‌లకే సీట్లు ఇవ్వడంతో గతంలో అక్కడ పోటీచేసిన కొందరు నేతలు, పోటీ ఆశతో పార్టీలోకి వచ్చిన కొందరు నేతలు అవకాశం కోల్పోయారు. కొందరికి కేటీఆర్ స్వయంగా పదవుల హామీనిచ్చారు. మళ్ళీ అధికారంలోకి వస్తున్నాం.. అభ్యర్థి ఎలాంటి వారయినా కేసీఆర్ కోసం పనిచేయండి.. గెలిపించండి మీ భవిష్యత్తు నేను చూసుకుంటా అని హామీనిచ్చారు. అలాంటి నేతలు ఇప్పటికే కేటీఆర్‌కు శుభాకాంక్షల పేరుతో కలిసి తమపై ఆశీస్సులు ఉంచాలంటూ ఇచ్చిన హామీలు గుర్తుచేయగా, సిన్సియర్‌గా పనిచేసిన నేతలకు న్యాయం చేసే ఆలోచనలో అధినేతలు ఉన్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో ఎవరు పనిచేశారు.. ఎవరు పనిచేయలేదు అన్న అంశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉండగా, సీఎం కేసీఆర్‌కు కూడా ఇన్‌ఛార్జిలుగా వెళ్ళిన నేతలు పలు నివేదికలు అందించారు. ఈనేపథ్యంలో ఎవరికి హామీలు ఇచ్చారు.. ఎవరిని ఏస్థాయి పదవులకు పరిగణనలోకి తీసుకోవొచ్చు.. తక్షణం ఇవ్వాల్సిన వారెవరు? అన్న అంశాలపై సీఎం కేసీఆర్ చర్చించినట్లు సమాచారం.

సంక్రాంతిలోగా మరో 10మందికి చాన్స్?

కార్పొరేషన్ ఛైర్మన్లకు సంబంధించి పదవుల పందారానికి శ్రీకారం చుట్టిన సీఎం సంక్రాంతిలోగా మరో పదిమందికి అవకాశం ఇవ్వవచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇక రైతుసమన్వయసమితి అధ్యక్షునిగా మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డిని నియమిస్తామని ఎన్నికల సందర్భంగా కేసీఆర్ స్వయంగా ప్రకటించగా, పార్లమెంట్ ఎన్నికల తర్వాతే ఈ నియామకం ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఇక పార్టీ ఆవిర్భావం నుండీ కేసీఆర్ విజయమే తమ విజయంగా భావించి ప్రాణంపెట్టి పనిచేసిన నేతలు అనేకమంది ఉన్నారు. తమ అవకాశాలు వదులుకుని, టీఆర్ఎస్‌ను పరిపుష్టం చేయడంలో, విజయాలు అందించడంలో తమ సేవలు అందించిన కొత్తతరం నేతలూ ఉన్నారు. మొత్తంగా నేతలు పదవుల గుర్తింపు కోరుకుంటున్నారు. గతంలో ఇచ్చినట్లుగా కేవలం ఛైర్మన్లు మాత్రమే కాకుండా ఈసారి ఒక్కో కార్పొరేషన్‌కు ఆరుగురు డైరెక్టర్లను నియమించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈలెక్కన 90మంది కార్పొరేషన్ ఛైర్మన్లు, 500మందికి పైగా డైరెక్టర్ పదవులు పార్టీ క్యాడర్‌కు, ముఖ్యనేతలకు దక్కనున్నాయి. కొందరు కార్పొరేషన్ ఛైర్మన్‌లు పదోన్నతులు కోరుకుంటుండగా, మరికొందరు కార్పొరేషన్ ప్రయత్నాలలో నిమగ్నమై ఉన్నారు. తాజాగా కార్పొరేషన్ పదవులకు రావుల శ్రవణ్‌రెడ్డి, తెలంగాణభవన్ ఇన్‌ఛార్జి నాయినేని రాజేశ్వరరావు, మాలోత్ కవిత, దిండిగల రాజేందర్, కిషన్‌రెడ్డి, బొమ్మర రామ్మూర్తి, ఎంసి కోటిరెడ్డి, శశిధర్‌రెడ్డి తదితరుల పేర్లు వినబడుతున్నాయి. రానున్నరోజుల్లో సహకారసంఘం ఎన్నికలు జరగనుండగా వీటికి డీసీసీబీ ఛైర్మన్లు, డీసీఎంఎస్ ఛైర్మన్లు రానున్నారు. ఇక కొత్తజిల్లాల వారీగా జడ్పీ ఎన్నికలు జరగనుండగా, 32జిల్లాలకు జడ్పీ ఛైర్మన్లు రానున్నారు.

ఈ పదవులు, ఎన్నికలను కూడా పదవుల భర్తీ సమయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. అందుకే ఆ పదవుల చట్రంలోకి రాని, తప్పకుండా న్యాయం జరగాల్సి ఉన్న నేతలకు కొందరికి తొలివిడతలో పదవులు దక్కుతాయని భావిస్తున్నారు. ఈ ఎన్నికలు పూర్తయ్యేలోగా సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఇక తాజాగా అనేకమంది నేతలు తమతమ సేవలు ఏకరువుపెడుతూ ముఖ్యనేతలను కలుస్తున్నారు. పార్టీపరంగా ఇన్‌ఛార్జిలుగా వెళ్ళి, వివిధ సమీకరణాల రీత్యా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేనివారిని తొలివిడతలోనే ముఖ్య కార్పొరేషన్లలో నియమించవచ్చని చెబుతున్నారు. అందుకు అనుగుణం గానే మంగళవారం తొలి ఉత్తర్వు విడుదలైంది.



విధేయతకు పట్టం...

సీఎం కేసీఆర్‌తో తనకు మూడుదశాబ్దాల అనుబంధం ఉందని, సీఎం రవాణాశాఖా మంత్రిగా ఉన్నపుడు తనను సిద్దిపేట మార్కెట్ కమిటీఛైర్మన్‌గా నియమించారని, మూడుసార్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశానని మారెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా నియమించబడ్డ ఆయన మంగళవారం రాత్రి ఆంధ్రప్రభతో మాట్లాడారు. సిద్దిపేట మండలం ఇర్కోడ సర్పంచ్‌గా తన ప్రస్థానం ప్రారంభమైందన్నారు. సీఎం కేసీఆర్‌కు తానెపుడూ రుణపడి ఉంటానన్నారు.

మారెడ్డిని అభినందించిన ప్రభుత్వవిప్ పల్లా,ఎమ్మెల్యేలు

రాష్ట్రపౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారెడ్డి శ్రీనివాసరెడ్డికి అభినందనల జల్లుకురుస్తోంది. సిద్దిపేట మండలం ఇర్కోడు గ్రామానికి చెందిన ఆయన సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలపగా, ప్రగతిభవన్‌లోనే ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు పలువురునేతలు అభినందించారు. సిద్దిపేట వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మూడుపర్యాయాలు పనిచేసిన శ్రీనివాసరెడ్డి టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్నారు. పదవి వరించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలెయాదయ్య, కోనేరుకోనప్ప, దివాకర్ రావు. టిఎస్ ఐఐసి ఛైర్మన్ బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్‌రావు, టిఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

మాజీల మాటేమిటో...

ఇక ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్ష పదవికి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్‌ఛైర్మన్ పదవికి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ పదవికి సోమారపు సత్యనారాయణ, సాంస్కృతిక సారథి ఛైర్మన్ పదవికి రసమయి బాలకిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి పిడమర్తి రవి, ట్రైకార్ ఛైర్మన్ పదవికి తాటి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పదవికి పెద్ది సుదర్శన్‌రెడ్డి, మూసీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవికి ప్రేమ్‌సింగ్ రాథోడ్, సెట్విన్ ఛైర్మన్ పదవికి ఇనాయత్ ఆలీ బాక్రీ రాజీనామా చేశారు. ఈ తొమ్మిది మంది కాకుండా రహదారుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవికి నర్సారెడ్డి, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పదవికి బుడాన్ బేగ్‌లు పార్టీమారుతూ తమ పదవులకు రాజీనామాలు చేశారు. రాజీనామాలు చేసిన వారిలో సగంమందికి పైగా ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగా, మంత్రి పదవులకు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వినబడుతోంది. ఇక ఓటమిపాలైన కొందరు నేతలు తమకు రాజీనామా చేసిన పదవులు తిరిగి కొనసాగేలా ఉత్వర్వులు ఇవ్వమని వేడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక పదవులు లేని మాజీ ఎమ్మెల్యేలు కొందరు కూడా తమకు కార్పొరేషన్ ఛైర్మన్లు ఇవ్వమంటూ ప్రయత్నాలు కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఖాళీ అయిన కార్పొరేషన్లలో పౌరసరఫరాల సంస్థను మంగళవారం భర్తీ చేశారు. గత కొద్దిరోజులుగా తెలంగాణభవన్‌కు వచ్చి అనేకమంది నేతలు తమ ఆశలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందు వ్యక్తపరిచారు.



ఢిల్లీలో తెరాస భవనానికి రూ.5లక్షల విరాళం

హైదరాబాద్, మియాపూర్, ప్రభ న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రసమితి (టీఆర్ఎస్) భవనం నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా తెరాస ఉపాధ్యక్షుడు వాశిలి చంద్రశేఖర్‌ప్రసాద్ ముందుకువచ్చి రూ.5లక్షల విరాళం ఇచ్చారు. మంగళవారం ప్రగతిభవన్‌లో వాశిలి చంద్రశేఖర్‌ప్రసాద్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి తెరాస రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు రూ.5లక్షల చెక్కును అందజేశారు. వీరితోపాటు కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ ఉన్నారు.

కేసీఆర్‌కు మన్మోహన్ అభినందనలు



మన్మోహన్‌తో ఎంపీ సంతోష్ కుమార్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అభినందనలు తెలిపారు. తెరాస రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్, బండ ప్రకాష్, లింగయ్య యాదవ్‌లు శీతాకాల సమావేశాల చివరి రోజైన మంగళవారం పార్లమెంట్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించినందుకు ఎంపీ సంతోష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల జరిగిన తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కూ మన్మోహన్ అభినందనలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడుతున్నారని మన్మోహన్ సింగ్ ప్రశంసించారని ఎంపీ సంతోష్ కుమార్ వెల్లడించారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- సాయికృష్ణ కుటుంబ సభ్యులకు కేటీఆర్ భరోసా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికాలో దుండగులచేతిలో కాల్పులసంఘటనలో గాయపడి చికిత్సపొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణకు అండగా ఉంటామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు అభయమిచ్చారు. మంగళవారం కేటీఆర్‌ను సాయికృష్ణ కుటుంబ సభ్యులు క్యాంపు కార్యాలయంలో కలిశారు. తమ కుమారునికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తిచేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సాయికృష్ణ తల్లి తండ్రులు వెంటనే అమెరికా వెళ్ళేందుకు అన్నిరకాల సహాయసహకారాలు అందిస్తామన్నారు. అవసరమైతే మరింత సాయం కోసం కేంద్ర విదేశాంగమంత్రిని సంప్రదిస్తా మన్నారు. మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ కూడా కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌ను దీనిపై కలిశారన్నారు. కుటుంబసభ్యులు అమెరికా వెళ్ళేందుకు అవసరమైన ఆర్థికసాయం వెంటనే ఇప్పించాలని సీఎం కార్యదర్శి రాజశేఖరరెడ్డిని కోరారు. సాయికృష్ణ కుటుంబసభ్యులు అమెరికా వెళ్ళేందుకు వీసాలు మంజూరుచేయాలని అమెరికా కాన్సులేట్ జనరల్‌తోనూ కేటీఆర్ మాట్లాడారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన కేటీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి సాయికృష్ణ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీతారామాకు క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

ఈ అనుమతికి సంబంధించి ఆరాతీయడంతో పాటు స్వయంగా కేంద్ర పర్యావరణమంత్రి హర్షవర్ధన్‌ను కలిసి త్వరగా అనుమతి మంజూరుచేయమని కోరారు. సీఎం విజ్ఞప్తికి స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి త్వరగా ప్రక్రియ పూర్తిచేయమని ఆదేశించారు. ఆ దౌత్యం ఫలించి పర్యావరణ ప్రభావ నోటిఫికేషన్ 2006కు లోబడి మంత్రిత్వశాఖ అనుమతి మంజూరుచేస్తూ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు లేఖరాసింది.

గోదావరి గలగలలు

దుమ్ముగూడెం ఆనకట్ట వద్దనుండి గోదావరి నీటిని తరలించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో 1,33,085హెక్టార్ల కొత్త ఆయకట్టుకు, 1,39,836హెక్టార్ల స్థిరీకరణకు సీతారామా ప్రాజెక్టు ద్వారా నీటిసరఫరా జరుగుతుంది. మొత్తం 2,72,921హెక్టార్లభూమికి సాగునీరు అందుతుంది. పైమూడు జిల్లాల్లో దాదాపు 180గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు దారిపొడుగునా చిన్ననీటివనరులను నింపడం , పూర్తి అయిన ప్రాజెక్టులకు నీటిసరఫరా చేస్తారు. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి పొందడానికి గత సంవత్సరం ఆగస్టునెలలో మూడుజిల్లాల్లో ప్రజాభిప్రాయసేకరణ కూడా జరిగింది. ప్రాజెక్టులో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఒక హెడ్ రెగ్యులేటర్‌ను, 372కిమీ కాల్వతవ్వకం, 4పంప్‌హౌజ్‌ల నిర్మాణం, డెలివరీ సిస్టర్న్ నిర్మాణం, 9కిమీ పైప్‌లైన్, వాగులపై క్రాస్ డ్రైనేజ్ స్ట్రక్చర్, టన్నెల్, కాల్వలపై క్రాస్ రెగ్యులేటర్‌లు, తూముల నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 8,476హెక్టార్ల భూమి అవసరం ఉండగా అందులో 1531హెక్టార్ల అటవీభూమి ఉంది. ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.13,384కోట్లు కాగా, మూడేళ్ళలో ప్రాజెక్టు పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం మేరకు శ్యాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలోని రిటైర్డ్ ఇంజనీర్లబృందం సీతారామా ప్రాజెక్టు నిర్మాణ పనులను, హెడ్‌వర్క్సును ఒకటి, రెండు, మూడు ప్యాకేజీల పనులను పరిశీలించింది. వచ్చే ఏడాది జూన్ నాటికి దీనిద్వారా తొలివిడత ఫలం తీసుకోవొచ్చని అంచనావేసింది. నిధుల సమస్య కూడా లేదని స్వయంగా సీఎం ప్రకటించడంతో త్వరలోనే ఖమ్మం జిల్లా బీళ్ళల్లో గోదావరి గలగలా పరుగెత్తనుంది.

విధుల్లో నిర్లక్ష్యం.. అటవీ అధికారిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలడంతో నిర్మల్ జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పెంబి హాఫీజుద్దీన్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇచ్చోడలో చిరుత పులిని వేటాడి చంపి చర్మాన్ని విక్రయిస్తున్న నిందితుని ఇంట్లోనే నీల్గాయిని హతమార్చారని, పది కిలోల మాంసాన్ని నిందితుడి ఇంటివద్దనే ఉంచుకున్న విషయం తెలిసినా పై అధికారులకు రేంజ్ ఆఫీసర్ తెలపలేదు. దీంతో పెంబిని విధుల నుంచి సస్పెండ్ చేసి, క్రిమినల్ చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఇచ్చోడలో సదరు చిరుతపులి చర్మాన్ని తరలిస్తూ నిందితులు అధి కారులకు చిక్కిన సంగతి తెలిసిందే.

కేబినెట్ జాప్యం?!

(మొదటిపేజీ తరువాయి)

కలిపి 33 జిల్లాల్లో పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న కేసీఆర్ ఈ జిల్లాలకు పూర్తిస్థాయిలో ప్రాతినిధ్యం లభించేలా మంత్రివర్గాన్ని విస్తరింపజేయాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో మంత్రులుగా పని చేసిన వారిలో కొంతమందికే ఈ దఫా మంత్రులుగా అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. కొత్తగా శాసనసభకు ఎన్నికైన వారిలో ఎక్కువ మందిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారం గత రెండు రోజులుగా సాగుతోంది. దీంతో తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలు మంత్రులుగా తమ పేర్లను పరిశీలించాలని కేసీఆర్, కేటీఆర్‌ను కలుస్తూ కోరుతున్నట్టు సమాచారం.

ముఖ్యంగా వెనుకబడిన తరగతుల్లో ఎక్కువ జనాభా ఉన్న సామాజిక వర్గాల ఎమ్మెల్యేలను మంత్రులుగా ఎంపిక చేయాలన్నది కేసీఆర్ ఆలోచనగా తెలుస్తోంది. యాదవ, గౌడ్, ముదిరాజ్, మున్నూరుకాపు వంటి సామాజిక వర్గాల నుంచి కనీసం మంత్రివర్గంలో ఒకరికైనా చోటు కల్పించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటిదాకా మంత్రివర్గంలో చోటు దక్కని బీసీల్లోనూ చిన్న కులాల వారికి సైతం స్థానం కల్పించేందుకు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే మంత్రివర్గంలోకి మహమూద్ అలీకి అవకాశం కల్పించడంతో మరో పదహారు మందికి చోటు దక్కనుంది. ఈ విడత ఎనిమిది మందిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్నది సీఎం కేసీఆర్ ఆలోచన. అలా చేస్తే ఎవరెవరికి మంత్రులుగా అవకాశం దక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. సభాపతిగా ఆరుగురి పేర్లు పరిశీలనలో ఉన్నప్పటికీ మాజీ వ్యవసాయ శాఖామంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వైపు కేసీఆర్ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. పోచారం తెదేపా అధికారంలో ఉన్న సమయంలో పంచాయితీరాజ్ శాఖామంత్రిగా పని చేసిన అనుభవముంది. ఎమ్మెల్యేల్లో



సీనియర్ కావడంతో ఆయనను సభాపతి స్థానంలో కూర్చోబెట్టాలని కేసీఆర్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఉపసభాపతిగా పద్మా దేవేందర్‌ను కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు కూడా ఆమె ఇదే పదవిని చేపట్టిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 7వ తేదీన చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో అన్ని సామాజిక వర్గాల వారిని తీసుకునే అవకాశం ఉంది. దళితుల్లో మాల, మాదిగ సామాజిక వర్గాలను, ఒక వెలమ, ఇరువురు బీసీలు, ఇరువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి తాజా విస్తరణలో చోటు కల్పించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల తరువాత మరోసారి మంత్రివర్గాన్ని విస్తరించి ఖాళీగా ఉన్న మంత్రి పదవులన్నింటినీ భర్తీ చేయాలని కేసీఆర్ ప్రతిపాదిస్తున్నారు. పార్లమెంటరీ కార్యదర్శుల నియామకానికి సంబంధించి శాసనసభలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి తద్వారా ఈ పదవులను భర్తీ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. దీంతో ఈ నియామకాలు ఆలస్యం జరిగే అవకాశాలున్నాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్ తీసుకురావాలని వెనువెంటనే ఈ పదవులను భర్తీ చేయాలని ప్రతిపాదించారు. ఎక్కువ మంది పార్లమెంటరీ కార్యదర్శులను నియమించడం ద్వారా ఆశావాహులను సంతృప్తపర్చాలని సీఎం నిర్ణయించారు. పార్లమెంటరీ కార్యదర్శుల పదవి పేరును కూడా మార్చాలని సోమవారం తన అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో కేసీఆర్ నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారులుగా వీరిని నియమించి శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చే అవకాశం కూడా వీరికి ఇవ్వాలని భావిస్తున్నారు. గతంలో సహాయ మంత్రి పదవుల తరహాలోనే పార్లమెంటరీ కార్యదర్శులకు అధికారాలను కట్టబెట్టాలని, వారికి కూడా మంత్రిత్వ శాఖలను ఇవ్వాలని ఈ దిశగా ఆర్డినెన్స్‌ను రూపొందించాలని కేసీఆర్ న్యాయ శాఖకు చెందిన అధికారులకు దిశా-నిర్దేశం చేసినట్టు సమాచారం. గతంలో మంత్రివర్గంలోకి ఎంతమందినైనా తీసుకునే అవకాశం ఉండేది. దాంతో కేబినెట్ మంత్రులుగా పది నుంచి పదిహేను మందిని, సహాయ మంత్రులుగా మరో పదిహేను మందిని తీసుకునే వారు. అయితే రాజ్యాంగంలోని 16వ అధికరణ ప్రకారం మొత్తం శాసనసభ్యుల్లో 15 శాతం మంది మాత్రమే లెక్కించి అందుకు అనుగుణంగా మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 18 మందిని మంత్రులుగా చేర్చుకునే అవకాశముంది.

ఆశావాహుల సంఖ్య పెరిగిపోవడంతో పార్లమెంటరీ కార్యదర్శుల తరహాలో పదవులను సృష్టించి ఆ పదవుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను నియమిస్తోంది. ఒకసారి వీరిని నియమించాక న్యాయపరమైన చిక్కులు రాకుండా చేయాలన్నదే సీఎం కేసీఆర్ భావనగా తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో జాప్యం జరుగుతుండడంతో ఆశావాహుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరికొంత కాలం వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది.



ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ గెజిట్ జారీ

- 16న ప్రమాణ స్వీకారం
- 17నుంచి సభా సమావేశాలు
- ఎమ్మెల్యేలతో ప్రమాణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 16న సాయంత్రం 5 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ప్రమాణం చేయిస్తారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 180 క్లాస్ 1 ప్రకారం తెలంగాణ రెండో శాసనసభకు గవర్నర్ ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. శాసన సభా సమావేశాల్లో స్పీకర్ ఎన్నిక జరిగే వరకు ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు తెలంగాణ రెండో శాసనసభసమావేశాలు జరగనున్నాయి. 17న ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన సమావేశాలు ఆరంభమవుతాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం తొలుత సమావేశాల్లో చేపడుతారు. ఆ తర్వాత సభ్యులకు ప్రభుత్వం విందును ఏర్పాటు చేసింది. 17న స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ జారీ, నామినేషన్ల స్వీకరణ ఉండ నుంది. 18న స్పీకర్ ఎన్నికైనట్లుగా ప్రకటనతో సమావేశాలు ఆరంభమవుతాయి. నూతన స్పీకర్‌ను సీఎంతోపాటు ప్రతిపక్ష నేతలు, ఇతర రాజకీయ పక్షాల నేతలు స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లడం సాంప్రదాయం. నూతన స్పీకర్ అధ్యక్షతన సమావేశాల ఆరంభం, ఆ తర్వాత శాసనసభా వ్యవహారాల కమిటీ(బీఏసీ) సమావేశం ఉంటుంది. మర్నాడు జరిగే గవర్నర్ ప్రసంగంపై బీఏసీ నిర్ణయం తీసుకుని, ఈ నెల 19న శాసనసభనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టి, సభ ఆమోదంతో సమావేశాలు ముగుస్తాయి.

మాజీ మంత్రి తుమ్మలతో టీడీపీ ఎమ్మెల్యేల మంతనాలు?



• కారెక్కే ముహూర్తం ఫిక్సయిందా?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్ కొనసాగుతోంది. ఖమ్మం జిల్లాలో గెలిచిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు కారెక్కబోతున్నారంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతుండగా, మంగళవారం సత్తుపల్లి సమీపంలోని లింగపాలెం తోటలో తుమ్మల నాగేశ్వరరావుతో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు భేటీ అయినట్లు తెలిసింది. గతంలోనే ఇరువురు ఎమ్మెల్యేలకు ప్రగతిభవన్ నుండి అభయహస్తం అందగా, వీరు వెంటనే తేల్చలేకపోవడంతో వ్యవహారం సందిగ్ధంలో పడింది. ఈనేపథ్యంలో తాజాగా తుమ్మలతో ఇద్దరు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. సంక్రాంతిలోగా చేరమని టీఆర్ఎస్ అధిష్టానం సంకేతాలు పంపినట్లు తెలిసింది. పార్టీపరంగా ఇచ్చిన హామీలన్నింటికీ తాను భరోసాగా నిలుస్తానని, అందరం కలిసి జిల్లాను ముందుకు తీసుకువెళదామని తుమ్మల సూచించినట్లు తెలిసింది. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇపుడు అత్యంత సురక్షితంగా, బలీయంగా ఉండగా.. మీ రాజకీయభవిష్యత్ బాగుండాలంటే, కొనసాగాలనుకుంటే కలిసి పనిచేయమని నేతలు చెప్పినట్లు తెలుస్తోంది.

ఖమ్మంజిల్లా ఫలితాలు టీఆర్ఎస్‌కు షాక్‌నివ్వగా, ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఆరు, టీడీపీకి రెండు ఎమ్మెల్యే స్థానాలు జిల్లానుండి ఉన్నాయి. ఒక ఇండి పెండెంట్ ఎమ్మెల్యే ఇప్పటికే టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా, టీఆర్ఎస్ బలం రెండుకు చేరింది. తాజా సంప్రదింపులు ఫలించాయా? సంక్రాంతిలోగా కారెక్కుతారా? మరికొంత సమయం తీసుకుంటారా? అన్న అంశాలు రాజకీయవర్గాల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. రావడం కాస్త ఆలస్యం కావొచ్చేమో కానీ వారిద్దరూ కారెక్కడం పక్కా అని టీఆర్ఎస్ కేంద్రవర్గాలు చెబుతున్నాయి.

ఈబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



అనుకూలంగా 323 , వ్యతిరేకంగా 3 ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏ మతానికి చెందిన పేదలైనా పదిశాతం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతుల్లో లేని అందరికీ రిజర్వేషన్ల ప్రయోజనం కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చామని తెలిపారు. ఈ బిల్లుతో కోట్లాదిమందికి లబ్ది చేకూరుతుదని చెప్పారు. ముస్లిం, క్రైస్తవులతో సహా అన్ని మతాలలోని పేదలకు న్యాయం చేసేందుకు ఈ బిల్లు తెచ్చామన్నారు.

బిల్లు జేపీసీకి పంపాలి: కాంగ్రెస్ డిమాండ్

తొందరపాటుతో ఈ రాజ్యాంగసవరణ బిల్లు తెచ్చారని కాంగ్రెస్ ఎంపీ కెవి.థామస్ లోక్‌సభలో అన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఈ బిల్లు తెచ్చారని అన్నారు. ఎనిమిది లక్షల రూపాయల పరిమితి విధించడం వల్ల సంపన్నులకు సైతం ప్రయోజనం కలుగుతుందన్నారు. హడావిడిగా బిల్లు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని అన్నారు. ఈ బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకించడం లేదని అయితే జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేశారు. సభ్యులకు సరైన కారణం తెలపకుండా, నిబంధనలకు విరుద్ధంగా బిల్లు ప్రవేశపెట్టారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు.



రిజర్వేషన్లు లేని పేదవర్గాలకు లాభం చేకూర్చేందుకు రాజ్యాంగసవరణ బిల్లు తెచ్చామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. రిజర్వేషన్లు లేని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నాయని తెలిపారు.

ఆర్టికల్ 16(4)కు సంబంధించి కులపరమైన రిజర్వేషన్లు విషయంలోనే రిజర్వేషన్లు సుప్రీంకోర్టు పరిమితి విధించిందని చెప్పారు. తాము కులం ఆధారంగా కాకుండా, ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ రిజర్వేషన్లకు ఎవరు అభ్యంతర పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలోనే కాంగ్రెస్ పార్టీ ఆర్థిక వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ



హృదయపూర్వకంగా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈబిసి రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. భేదభావాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని మతాలలోని అగ్రవర్ణ పేదలకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. పేదరికానికి కులం, మతం ఉండదన్నారు. గతంలో పివి నరసింహా రావు ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుపై కేవలం నోటిఫికేషన్ విడుదల చేసిందే తప్ప చట్టం చెయ్యలేదన్నారు.

జనాభా నిష్పత్తిలో అందరికీ రిజర్వేషన్లు ఇవ్వాలి : ఎస్పీ, ఆర్జెడీ

సమానత సాధనలో భాగంగా జనాభా ప్రాతిపదికన అందరికీ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, ఆర్జెడీ ఎంపీ జయప్రకాష్ నారాయణ్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. జనాభాలో ఏ వర్గానికి ఎంత సంఖ్య ఉందో దాని ప్రకారమే రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు.

రెండు బిల్లులకు ఆమోదం

పౌరసత్వ సవరణ బిల్లుకు, డిఎన్ఎ చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభ చర్చించింది. అనంతరం రెండు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. ఇటు రాజ్యసభలో విపక్షా ల గందరగోళంతో సభా కార్యక్రాలు ముందుకుసాగలేదు. విపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అడ్డుతగిలారు.

దేశ చరిత్రలో ఇదో మైలురాయి



జనరల్ కేటగిరి లోని పేదలకు ఉద్యోగ, విద్యావకాశాల కోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంకల్పించాం. సమాజంలోని అన్ని వర్గాల వారికీ న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రతీ పేద వ్యక్తి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలి. సమాజంలోని అవకాశాలను అందుకోవాలి. ఈబీసీ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందేందుకు సహకరించిన అన్ని పార్టీల ఎంపీలకు ధన్యవాదాలు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ మంత్రంతో ముందుకెళ్తాం.

తెలంగాణ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలి



ఈబిసి బిల్లుకు తాము మద్దతు తెలుపుతున్నామని టిఆర్ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. అయితే తెలంగాణ రిజర్వేషన్ల విధానానికి కూడా కేంద్రం ఆమోదం తెలపాలని కోరారు. విభజన జరిగిన తర్వాత ఎస్టీల, ముస్లింల జనాభా పెరిగిందని, దాంతో తాము వారికి రిజర్వేషన్లు పెంచామని చెప్పారు. రిజర్వేషన్లపై దేశమంతా ఒకే విధానం ఉండాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పంపిన బిల్లుపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి

ముస్లింలకు 12% | 10% గిరిజనులకు

రిజర్వేషన్ల పెంపుపై ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

కాలంగా అవకాశం దొరికినప్పుడల్లా రిజర్వేషన్ల పెంపుపై కేంద్రంపై ఒత్తిడి తెస్తూ వస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రస్తుతం మంచి సందర్భం దొరికినట్లయింది. అగ్రవర్ణ పేదలకోసం కేంద్ర తీసుకున్న నిర్ణయంతో మరో అడుగు ముందుకేసిన తెలంగాణ ఎంపీలు మద్దతుదారులను కూడగట్టుకుని రాష్ట్రం పంపించిన ప్రతిపాదనలను రాజ్యాంగ సవరణ బిల్లు ముసాయిదాలో పొందుపర్చేలా తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తమిళనాడు తరహాలో ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని ఇదివరకు జరిగిన పార్లమెంట్‌లో డిమాండ్ చేయగా, ప్రస్తుతం కేంద్రం 50శాతం మించిన రిజర్వేషన్లకు నాంధి పలుకుతుండడం కలిసివచ్చినట్లయింది. ముస్లింలకు 12శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లపై ఢిల్లీలో తెరాస ఎంపీల డిమాండ్ పట్ల పలు రాజకీయవర్గాల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ఇదే అదునుగా పార్లమెంట్‌లో పట్టు వీడొద్దని అధినేత కేసీఆర్ నుంచి అందిన ఆదేశంతో ఎంపీలు రెట్టింపు ఉత్సాహంతో సభలో గొంతు వినిపించారు. రాజ్యాంగ సవరణ బిల్లులో ఈ రెండు అంశాలను పొందుపర్చేలా చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందన్న విషయంపై స్పష్టత లేకపోయినప్పటికీ తెలంగాణ ప్రజల మనోభావాలను పరిరక్షించేందుకు పట్టి ప్రయత్నం చేస్తున్నారు. రాజ్యసభకు వెళ్ళేంతవరకూ ఒకవేళ ఈ బిల్లులో చేర్చకపోయినా, రాజ్యాంగ సవరణ జరిగితే 50శాతానికి మించిన రిజర్వేషన్లను అమలు చేసుకోవచ్చుననే నమ్మకం కలుగుతోంది.

ఇటీవల మూడు రాష్ట్రాల్లో ఎన్నికల పరాభవాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు అవసరమన్న అంశాన్ని తెరపైకి తేవడం శుభపరిణామంగా కనిపిస్తోంది. ఇప్పట్లో కాకపోయినా సమీప భవిష్యత్తులోనైనా ఫలితం దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. రిజర్వేషన్లపై 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మార్గదర్శకాల ప్రకారం 50శాతానికి మించకూడదన్న నిబంధన అమలవుతూ వస్తోంది. వీలును బట్టి రాష్ట్రాలు ఈ పరిమితిని మీరవచ్చునని 2010 జూలైలో సుప్రీం మరో తీర్పు ఇచ్చింది. కానీ బలమైన ఆధారం, వాస్తవికమైన వెనుకబాటుతనం, పటిష్ఠమైన సైంటిఫిక్ డాటా ఉంటేతప్ప రిజర్వేషన్లు పెంచుకోవడానికి వీల్లేదన్న విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ఆ తరుణంలోనే గతంలో తమిళనాడుతోని జయలలిత ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచుకోవడంతో విజయం సాధించింది. పెరుగుతున్న జనాభా, మారుతున్న సమాజం, అదే సమయంతో పెరుగుతున్న వెనుకబాటుతనాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ సవరణ ఆవశ్యకతను సూచిస్తోంది. అందరూ అనుకున్నట్లుగా పార్లమెంట్ ఉభయసభల్లో అగ్రకులాల్లోని పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బిల్లు ఆమోదం పొందితే, తెలంగాణాలోనే కాదు అనేక రాష్ట్రాల్లో సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

ముస్లిం రిజర్వేషన్ బిల్లు మాటేంటి? : ఒవైసీ



ఆర్థికబాటు వెనుకబాటు అంశాన్ని గుర్తించేందుకు ఎటువంటి ఆధారం లేకుండా బిల్లు ఎలా తీసుకువచ్చారని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ముస్లింలలో సైతం చాలా ఆర్థిక వెనుకబాటు ఉందని అనేక కమిషన్‌లు నివేదికలు ఇచ్చాయన్నారు. కానీ ముస్లింలకు మాత్రం రిజర్వేషన్లు కల్పించడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన చట్టానికి కేంద్రప్రభుత్వం ఆమోదం ఎందుకు తెలపలేదని ప్రశ్నించారు. ఈ బిల్లు సుప్రీంకోర్టులో కొట్టివేయడం ఖాయమని అన్నారు.

అన్నాడిఎంకె వాకౌట్

అత్యంత వెనుకబడిన వర్గాలు అధికంగా ఉన్న దేశంలో రిజర్వేషన్ల శాతాన్ని 69శాతంకుపెంచుతూ రాజ్యాంగ సవరణ తీసుకురావాలని అన్నాడిఎంకె పక్ష నేత తంబిదొరై డిమాండ్ చేశారు. ఈ బిల్లును సుప్రీంకోర్టు కొట్టివేయడం ఖాయమన్నారు. ఈ బిల్లుతో అవినీతికి ఆస్కారం కలుగుతుందన్నారు. నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు.



ఈబీసీ బిల్లు ఉద్దేశాలు

- ఆర్థికంగా వెనకబడిన వారిలో చాలామంది ఉన్నతవిద్యా సంస్థల్లో ప్రవేశాలకు, ఉద్యోగ అవకాశాలకు దూరమౌతున్నారు.
- పేదరికం వల్ల ఆర్థికంగా వెనకబడిన వాళ్లు ధనవంతులతో పోటీపడలేకపోతున్నారు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 15లోని క్లాజ్ 4, 5... ఆర్టికల్ 16 లోని క్లాజ్ (4) కింద కల్పించిన రిజర్వేషన్లు ఆర్థికంగా వెనకబడిన వారికి అందడం లేదు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం ఆదేశిక సూత్రాలు వెనకబడిన వర్గాల వారికి విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ కల్పించాలని చెబుతోంది. ఎస్సీ, ఎస్టీలను దోపిడి, సామాజిక అన్యాయం నుంచి రక్షణ కల్పించాలని స్పష్టం చేస్తోంది.
- 93 వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2005 లో ఆర్టికల్ 15లో క్లాస్ 5 చేర్చారు.దీని ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన ఏ వర్గానికైనా ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక తోడ్పాటునిచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 లో క్లాస్ 4 చేర్చడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో, ఇతర సేవల్లో తగిన ప్రాధాన్యం లేదని భావించిన వర్గాలకు ఉద్యోగ అవకాశాల్లో పదవుల్లో రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.
- వెనకబడిన వర్గాలు, అన్యాయం జరుగుతున్న వర్గాలు రిజర్వేషన్లు పొందేందుకు రాజ్యాంగంలోని 46వ అధికారానికి అనుగుణంగా మార్పులు అవసరం.



పట్టు విడువలేదు మెట్టు దిగలేదు

- చివరి రోజూ ఆగని ఆందోళన
- పార్లమెంట్ ఆవరణలో టీడీపీ నిరసన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల ఆరంభం నుంచి అంతం వరకూ టీడీపీ ఎంపీలు పట్టు విడువలేదు - మెట్టు దిగలేదు. చివరి రోజూ అదే నిరసన. అదే ఆందోళన. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం ఆ పార్టీ రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలు ధర్నా నిర్వహించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై నినాదాలతో హోరెత్తించారు.

ఎన్నికల జిమ్మిక్కు - సుజనా

బీఏసీలో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల బిల్లును స్వాగతించాం. అయితే చివరి నిమిషంలో హడావుడిగా తీసుకురావడాన్ని మేం తప్పుబట్టాం. ఇది రాజకీయ ప్రయోజనాల కోసం అనేకంటే ఎన్నికల జిమ్మిక్ అని మేము అంటున్నాం. నిజంగా అగ్ర వర్ణ పేదలపై చిత్తశుద్ధి ఉంటే ఇంత కాలం బీజేపీ ఎందుకు కాలయాపన చేసింది. అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే.

కాపు రిజర్వేషన్ల బిల్లుపై నిర్ణయం తీసుకోవాలి: ముత్తంశెట్టి

ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించినట్టే కాపులకు తక్షణం 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. మాకు గతంలో ఉన్న రిజర్వేషన్లనే పునరుద్ధరించాలని మేం అడుగుతున్నాం. కాపు రిజర్వేషన్ బిల్లుపైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

బాబును గెలిపిస్తాం : శివప్రసాద్

చాణక్యుడి వేషధారణతో మోడీకి వ్యతిరేకంగా శపథం చేస్తున్నాను. ఇన్ని రోజులుగా ఏపీ హక్కుల కోసం ఎంపీలు చేస్తున్న పోరాటం కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నాను.

యూపీఏ హయాంలోనే 10% ప్రతిపాదన

- 2006లో అగ్రపేదల రిజర్వేషన్లపై కమిటీ ఏర్పాటు
- రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యమని నివేదిక
- బీహార్‌లోనే అగ్రపేదల సంక్షేమ పథకాలు
- వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలుగా బీహార్‌లో అమలు

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశం గతంలోనూ చట్ట సభల్లో చర్చకు వచ్చింది. నిజానికి యూపీయే హయంలో సమర్పించిన ఒక నివేదిక ప్రకారం అగ్ర వర్గాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించడంపై ప్రస్తుత కేంద్ర మంత్రి వర్గం మొదట్లో విముఖంగా ఉండేది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2006లో యూపీయే ప్రభుత్వం అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించడంపై ఒక కమిటీని నియమించింది.అయితే ఈ కమిటీ చేసే సిఫార్సులు అమలు చేయడానికి అవసరమైన న్యాయపరమైన, రాజ్యాంగ సంబంధమైన మార్పులు, చేర్పులకు సంబంధించిన అంశాలను కూడా పేర్కొనాలని నాటి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆదేశించింది. నాలుగేళ్ల తరువాత నాటి కేంద్ర మంత్రి ముకుల్ వాస్నిక్‌కి సిన్హో కమిటీ తన నివేదికను సమర్పించింది. అయితే ఈ కమిటీ సమర్పించిన నివేదికను బహిరంగం చేయకపోయినా, అందులో పద్నాలుగు అంశాలు ఉన్నట్లు తెలియవచ్చింది.



యూపీయే నాటి నివేదికలో ఏముంది?

సిన్హో కమిటీ సమర్పించిన నివేదికలో అగ్రవర్ణాల్లో వెనుకబడిన వర్గాలను గుర్తించడానికి కీలక సిఫార్సులు చేసినట్లు తెలియ వస్తోంది. అగ్రవర్ణాల్లో ఎవరైతే ఆదాయ పన్ను చెల్లించలేదో వారిని వెనుకబడిన వర్గాలుగా గుర్తించి ఓబీసీలకు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్లను వర్తింప చేయాలని సిన్హో కమిటీ స్పష్టం చేసినట్లుగా తెలుస్తోంది. సిన్హో కమిటీ పరిశీలన ప్రకారం దేశంలో అగ్రవర్ణాలు జనాభాలో 20 శాతం ఉంటారని తెలుస్తోంది. దేశంలో హిందువులు, ముస్లింల్లోని అగ్రవర్ణాలను ఈ కమిటీ గణించింది. ఈ కమిటీకి నేతృత్వం వహించిన రిటైర్డ్ మేజర్ ఎస్ఆర్ సిన్హా అగ్ర వర్ణంలో పేదలకు ఉన్నత విద్య అభ్యసించడానికి, స్కాలర్‌షిప్పులకు, ఐఎఎస్, పీసీఎస్ పరీక్షల్లో కోచింగ్‌కి, వైద్యానికి ఎంత రుణాలను, ఎంత సబ్సిడీతో ఏ ప్రాతిపదికను మంజూరు చేయవచ్చో కొన్ని సిఫార్సులను చేసింది. ఇదే సందర్భంలో అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ సవరణ చేయాల్సి వస్తుందని సూచించింది. రిజర్వేషన్లు యాభై శాతం మించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను కాదని, అగ్ర వర్ణ పేదలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యారంగంలో రిజర్వేషన్లను కల్పించాలంటే రాజ్యాంగ సవరణ ఒక్కటే మార్గమని సిన్హో కమిటీ స్పష్టం చేసింది.

అగ్రవర్ణాలపై కమిటీ వేసిన బీహార్!

అగ్రవర్ణాల్లో వెనుకబడి వర్గాల ప్రజల కష్టనష్టాలు తెలుసుకోవడానికి, వారికి రాజ్యాంగ పరంగా సౌకర్యాల కల్పనలో, రిజర్వేషన్ల విషయంలో ఏం చేయాలో తెలుసుకోవడానికి దేశంలో ఒకే ఒక్క రాష్ట్రంగా బీహార్ ఒక కమిషన్‌ను 2010లో నియమించింది. సీఎం నితీశ్ కుమార్ ఆదేశాలతో హిందువులు, ముస్లింల్లో అగ్రవర్ణాల్లో పేదల గుర్తింపు ఈ కమిషన్ ఏర్పాటు చేశారు. సవర్ణ అయోగ్‌గా పిలువబడే ఈ కమిషన్ బీహార్‌లో ఆసియన్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించింది. బీహార్ అంతటా పర్యటించిన ఈ కమిషన్ దాదాపు 10 వేల మందితో శ్యాంపుల్ సర్వే నిర్వహించి ఏడాదిన్నర తరువాత ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. అయితే బీహార్ కమిషన్ నివేదికలో అగ్రవర్ణాల్లోని వెనుబడిన వర్గాలకు రిజర్వేషన్ల గురించి ప్రస్తావించకపోవడం విశేషం. అయితే అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడి వర్గాల విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు, సంక్షేమ కార్యక్రమాలను వీరికి కూడా వర్తింప చేయాలని ఆ కమిషన్ సిఫార్సు చేసింది. వీరిలో ఆర్థిక వెనుకబాటును గుర్తించడానికి వార్షిక ఆదాయం రూ.1.5 లక్షల కన్నా తక్కువ ఉండడాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. ఈ కమిషన్ సిఫార్సులను అమలు చేసినట్లు జేడీయూ ఎమ్ఎల్‌సీ నీరజ్ కుమార్ వెల్లడించారు. అగ్ర వర్ణ నిరు పేద విద్యార్థులకు క్రెడిట్ కార్డులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు.

రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు : జైట్లీ



ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే మా ప్రయత్నం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని పైకి తీసుకురావాలన్నదే ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లుకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. పీవీ నరసింహారావు హయాంలో ప్రత్యేక చట్టం చేయలేదు.. అందుకే కోర్టు కొట్టివేసింది. ఆర్టికల్ 16(4)లో కులాల ఆధారంగా రిజర్వేషన్ల ప్రస్తావన ఉంది"

అగ్రవర్ణాల పేదలకు న్యాయం

- మధ్యప్రదేశ్ మాజీ సీఎం చౌహాన్



న్యూఢిల్లీ: అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు పది శాతం కల్పించాలన్న మోడీ ప్రభుత్వం నిర్ణయంపై తొలుత హర్షం వ్యక్తం చేసిన వారిలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఒకరు. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వెంట్రుక వాసిలో బీజేపీ ఓడిపోవడానికి అగ్ర వర్ణాల ఆగ్రహమే కారణమని చౌహాన్ అభిప్రాయం.దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో అగ్రవర్ణాలు అధికంగా ఉండే గ్వాలియర్, చంబల్, బుందేల్‌ఖండ్, మాల్వాల్లో బీజేపీకి పరిస్థితులు అనుకూలంగా మారతాయనే భావన వ్యక్తమవుతోంది.

ఆర్ఎస్ఎస్ హస్తముంది

ముంబై: జనరల్ కోటాలో అగ్రవర్గాల్లోని వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని నేషనల్ కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. ఆర్ఎస్ఎస్ అజెండా ప్రకారం మోడీ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించింది. అగ్ర వర్ణ పేదలకు జనరల్ కోటాలో రిజర్వేషన్లు కల్పిస్తే, అది నెమ్మదిగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఎత్తివేతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తాజా చర్య వలన మధ్య తరగతి బాగు పడుతుందని, ఈ రిజర్వేషన్ ఫలాలు అగ్ర వర్ణాల్లో పేదలకు అందవని అభిప్రాయపడింది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడి వర్గాలకు రిజర్వేషన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు తమ పార్టీ అభ్యంతరం తెలపదని, అయితే రూ.8 లక్షల సీలింగ్‌ను తగ్గిస్తే తప్ప ఆ వర్గాల్లోని పేదలు లబ్ధి పొందలేరని ఎన్సీపీ నేత నవాబ్ మాలిక్ చెప్పారు. రాష్ట్రీయ సర్‌సంఘ్‌చాలక్ ఎమ్ఎస్ గోవాల్కర్ తను 1966లో రాసిన పుస్తకంలో అగ్ర వర్గాలకు ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నట్లు నవాబ్ మాలిక్ గుర్తు చేశారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు రిజర్వేషన్లను ఎత్తివేయాలని ఆర్ఎస్ఎస్ భావిస్తున్నట్లు మాలిక్ ఆరోపించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 9 జనవరి 2019

శిష్యుడి వల్ల మోడీకి అన్నీ షా కులే!

ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ-2 ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ పూర్తిగా స్వయం కృతమే. కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ) డైరక్టర్ పదవి నుంచి నాలుగు నెలల్లో రిటైర్ కానున్న అలోక్ వర్మను గత అక్టోబర్ లో మోడీ ప్రభుత్వం బలవంతంగా సెలవుపై పంపడాన్ని సుప్రీంకోర్టు తప్పు పడుతూ, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కొట్టి వేసింది.వర్మను ఆ పదవిలో కొనసాగించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.ప్రజాస్వామ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి కీలకమైన అంశంపై నోటిఫికేషన్ కొట్టివేయడం, ఆదేశాలు జారీ చేయడం ఏ ప్రభుత్వానికైనా ఘోరమైన అవమానం.ఇంతటి అవమానం మోడీ ప్రభుత్వానికి కలగడానికి కారణం ఆయన శిష్యుడు,బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాయే .రాకేష్ ఆస్తానా అనే ఐపీఎస్ అధికారిని గుజరాత్ నుంచి తీసుకుని వచ్చి సీబీఐ ప్రత్యేక డైరక్టర్‌గా చేయించింది అమిత్ షాయే. అమిత్ షా కేసుల కారణంగానే వర్మకూ,ఆస్తానాకూ మధ్య విభేదాలు పొడసూపాయి.

అవి చివరికి పరస్పరం ఆరోపణలు చేసుకోవడం వరకూ వెళ్ళాయి.మాంసం వ్యాపారి మొయిన్ ఖురేషి నుంచి ఆస్తానా లంచం తీసుకున్నట్టు కేసు నమోదు అయింది.ఆ కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ డీఐజీ మనీష్‌కుమార్ సిన్హాను నాగపూర్‌కు బదిలీ చేయించడంతో ఆయన కోర్టుకు వెళ్ళారు.ఈ కేసులో ఆస్తానాను అమిత్ షా వెనకేసుకొస్తున్నారనీ, ఈ కేసులో కేంద్ర మంత్రి హరిభాయ్ పార్థిభాయ్ చౌదరికి ముడుపులు అందాయనీ, ఈ కేసు దర్యాప్తులో ఆస్తానాకు అనుకూలంగా వ్యవహరించాలని తనపై ఒత్తిడి వచ్చాయంటూ అప్పట్లో చేసిన ఆరోపణ పెను సంచలనాన్ని సృష్టించింది. ఆస్తానాను అమిత్ షా కాపాడుతున్నారంటూ ఎంపీల నుంచి ఆరోపణలు కూడా వచ్చాయి. ఆస్తానా అప్పటి సీబీఐ డైరక్టర్ అలోక్ వర్మపై ఎదురు దాడి చేశారు. ఖురేషీ కేసులో కీలక సాక్షి అయిన హైదరాబాద్‌కు చెందిన సానా సతీష్ బాబును ప్రశ్నించవద్దని అలోక్ వర్మ ఫోన్ చేశారని ఆస్తానా బహిరంగంగానే ఆరోపించారు. దానిని అలోక్ వర్మ ఖండించారు.సీబీఐ ప్రత్యేక డైరక్టర్ ఆస్తానా, డైరక్టర్ అలోక్ వర్మలు బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని అలోక్ వర్మను సెలవులో పంపింది.ఆయన స్థానే ఎం నాగేశ్వరరావును తాత్కాలికంగా నియమించింది.తనను సెలవులో పంపడాన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ న్యాయపోరాటంలో వర్మ గెలిచారు.ఆయనను తిరిగి డైరక్టర్ పదవిలో నియమించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.ఈ మొత్తం వ్యవహారం అంతా బహిరంగంగానే చోటు చేసుకోవడంతో సీబీఐ విశ్వసనీయత దెబ్బతింది. పంజరంలో పక్షిలా సీబీఐ పని చేస్తోందంటూ గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య అక్షరాలా నిజం అయిందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

బొగ్గు కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించిన పత్రాలను సీబీఐ నుంచి పూర్వపు యూపీఏ ప్రభుత్వం తెప్పించుకున్నందుకు సీబీఐని సుప్రీంకోర్టు పంజరంలో పక్షి అని అభివర్ణించింది. యూపీఏ ప్రభుత్వం అమిత్ షాపై దర్యాప్తు చేసినప్పుడు సీబీఐని యూపీఏ ప్రభుత్వం జేబు సంస్థగా వాడుకుంటోందంటూ కమల నాథులు ఆరోపించారు. టూజీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే నాయకుడు,అప్పటి మంత్రి ఎ రాజానూ, డిఎంకె ఎంపీ కనిమొళిని అరెస్టు చేసినప్పుడు సీబీఐపై డీఎంకే నాయకులు ఇదే మాదిరి ఆరోపణలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల ఆదేశాల ప్రకారం సీబీఐ పని చేస్తుందన్న అపవాదును ఆ సంస్థ మూటగట్టుకుంది.రాష్ట్రా ల్లో కుంభకోణాలు వెలుగులోకి వచ్చినప్పుడు సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిన నాయకులే తాము సీబీఐ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రాడర్‌లోకి వచ్చినప్పు డు ఆ రెండు సంస్థలపైనా ఆరోపణలు చేయడం సర్వసాధారణమైంది.

అందుకు తగినట్టుగానే సీబీఐ అధికారులు అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తుండటం కూడా సర్వసాధారణమైంది. యూపీఏ ప్రభుత్వాన్ని గతంలో తీవ్రంగా విమర్శించిన కమలనాథులు తమ ప్రభుత్వంలో కూడా సీబీఐని రాజకీయ ప్రయోజనాల కోసం పావుగా ఉపయోగించుకుంటున్నారనడానికి రాకేష్ ఆస్తానా, అలోక్ వర్మలు బహిరంగంగా చేసుకున్న ఆరోపణలే ప్రత్యక్షనిదర్శనం.

అలోక్ వర్మ పదవీ కాలపరిమితి జనవరి 31వ తేదీతో ముగియనుంది.అలోక్ వర్మ తన అవినీతిపై దర్యాప్తునకు ఆదేశించినందుకు ప్రతీకారంతో వర్మపై ఆస్తానా ఎదురు దాడి చేశారు.వర్మపై ఆస్తానా చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది.అది పూర్తి అయ్యే వరకూ ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని వర్మను సుప్రీంకోర్టు ఆదేశించింది.ఆయన అగౌరవంగా రిటైర్ కాకుండా,గౌరవ ప్రదంగా రిటైరయ్యేందుకు సుప్రీంకోర్టు తాజా తీర్పు వీలు కల్పించినట్టయింది.ఆస్తానా గుజరాత్‌లో ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పుడు అప్పట్లో రాష్ట్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా ప్రాపకంతోనే అంచలంచెలుగా పదోన్నతులు పొందాడు.అప్పట్లో అమిత్ షా ఎన్‌కౌంటర్ల షాగా పేరుమోసారు. మౌఖికంగా ఇచ్చిన ఆదేశాలతోనే పోలీసు ఎన్‌కౌంటర్లు చేసినట్టు చాలా కాలం జైలు శిక్ష అనుభవించిన పోలీసు ఉన్నతాధికారి వంజారా ప్రత్యేక దర్యాప్తు విభాగం సిట్‌కి వాంగ్మూలం ఇచ్చారు.

అలాగే,అమిత్ షా ఆదేశాలను పాటించనందుకు సంజీవ్ భట్ అనే పోలీసు అధికారి జైలు పాలయ్యాడు.అమిత్ షా వల్ల ఎంతో మంది నిజాయితీ పరులైన పోలీసు అధికారులు వేధింపులకు గురయ్యారు.అదే మాదిరిగా అమిత్ షా ఆదేశాలను పాటించినందుకు జైలుపాలైన అధికారులూ ఉన్నారని విమర్శలున్నాయి. ప్రధాని మోడీ తన శిష్యుడు అమిత్ షాని గుడ్డిగా నమ్మినందుకు ఇటీవల మూడు రాష్ట్రా ల్లో పార్టీ ఓటమి సంభవించిందని పార్టీలో విస్తృతంగా చర్చ సాగుతోంది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానంలో ఎదురు దెబ్బతగిలింది.

పాదయాత్రలు - ప్రభావాలు!







భారత దేశం ఆది నుంచి పాదయాత్రలకు పెట్టింది పేరుగా గుర్తింపు పొందింది. ఆధ్యాత్మిక, రాజకీయ, ప్రజాసమస్యలకు పాదయాత్రలు పరిష్కార వేదికలుగా మారాయి. చరిత్రలోకి వెళ్ళి చూస్తే పాదయాత్రలు మన దేశంలో కొత్త కాకపోయినా.. ప్రతి విజయం ఒక కొత్త సందేశానికి సంకేతంగా నిలుస్తూ వస్తున్నాయి. ప్రజలను నేరుగా కలుసుకోడానికీ, వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకోవడానికి పాద యాత్రలు ఎంతో ఉపయోగపడతాయి. పాదయాత్రలు చేసిన వారిలో ఎక్కువమంది రాజకీయ నాయకులే ఉన్నారు. ఆధ్యాత్మిక ప్రచారానికి వివిధ మతాధిపతులూ, పీఠాధిపతులూ కూడా దేశమంతటా పర్యటిస్తూ ఉంటారు. అయితే, నడిచే దైవంగా ఇప్పటికీ భక్తుల కైమోడ్పులు అందుకుంటున్న కంచికోటి పీఠం పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతి మహాస్వామి పాదయాత్ర చరిత్రలో ఒక సువర్ణ ఘట్టాన్ని ఆవిష్కరించింది. ఆది శంకరుల స్ఫూర్తితో ఆయన దేశమంతటా పాదయాత్ర జరిపారు.

చరిత్రలోకి వెళితే, స్వాతంత్ర్య సంగ్రామానికి సారథ్యం వహించిన మహాత్మాగాంధీ జరిపిన పాదయాత్ర చరిత్ర లిఖితమైంది. మహాత్మాగాంధీ వడిగా నడిచేవారనీ, పరుగుమాదిరి సాగిన ఆయన పాదయాత్రలో పాల్గొన్న మన తెలుగు స్వాతంత్ర్య యోధులు తమ అనుభవాలను గ్రంథస్థం చేశారు. పాదయాత్రలు జరిపితే ప్రజల గుండె చప్పుడు వినవచ్చు. ప్రజల ఈతి బాధలను కళ్ళారా చూడవచ్చు. రహదారులు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేక అల్లాడుతున్న ప్రజల కష్టాలనూ, కడగండ్లనూ స్వయంగా చూడవచ్చు. ఈ ఉద్దేశ్యంతోనే నాయకులు పాదయాత్రలు జరుపుతూ ఉంటారు. 1930వ దశకంలో మహాత్మాగాంధీ జరిపిన దండి యాత్ర ప్రజల్లో సమైక్యతా భావాన్ని ప్రోది చేసింది. ఉప్పుసత్యాగ్రహం కూడా ప్రజల్లో జాతీయ భావాలను పాదుకొల్పింది. మన ఉప్పుపై ఆంగ్లేయులు పన్నువేయడమేమిటన్న ప్రశ్న ప్రజల హృదయాలను తాకింది. అందుకే, ఆయన జరిపిన పాదయాత్రల్లో, సత్యాగ్రహాలలో సామాన్యులే కాకుండా, సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తుల్లో ఉన్నవారు ముందూ వెనకా ఆలోచించకుండా వచ్చి చేరారు. గాంధీగారి తర్వాత భూదానోద్యమ నాయకుడు ఆచార్య వినోబాభావే నిర్వహించిన పాదయాత్ర మన తెలుగు రాష్ట్రాల మీదుగా సాగింది. వినోబాభావే పిలుపుపై తెలంగాణలో పోచంపల్లి గ్రామవాసులు వందలాది ఎకరాల భూములను దానం చేశారు. ఆ కారణంగానే ఆ గ్రామానికి భూదాన్ పోచంపల్లి అనే పేరు స్థిరపడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎందరో నాయకులు రథయాత్రలూ, బస్సు యాత్రలు జరిపి చరిత్ర సృష్టించారు. రథయాత్ర అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చేది బీజేపీ అగ్రనాయకుడు ఎల్ కె అద్వానీ అయోధ్యకు జరిపిన రథయాత్ర. 1990వ దశకంలో ఇరవై ఏడేళ్ళ క్రితం అద్వానీ నిర్వహించిన రథయాత్ర లోక్‌సభలో బిజేపీ బలం రెండు స్థానాల నుంచి 200 స్థానాలకు పెరిగేందుకు దోహదం చేసింది. ఆయన పాదయాత్రను బీహార్‌లో అప్పటి ముఖ్యమంత్రి లాలూ ఆపేశారు. ఆయనను అరెస్టు చేశారు. దేశ రాజకీయ చరిత్రలో పెద్ద మలుపునకు కారణమైంది. బీజేపీలో అద్వానీ తరానికి చెందిన డాక్టర్ మురళీ మనోహర్ జోషి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ నిర్వహించిన ఏక్తా యాత్ర కూడా బిజేపీ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్ళేందుకు తోడ్పడింది. మాజీ ప్రధాని, జనతా పార్టీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ జనతాపార్టీ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత 1980లో జరిపిన పాదయాత్ర కూడా యువకులను ఉత్సాహ పర్చింది. లోక్ నాయక్ జయప్రకాష్ భావజాలాన్ని వ్యాపింపజేయడం కోసం ఆయన కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు 4,200 కిలోమీటర్ల ఆ పాద యాత్ర ఆయన ప్రధాని అయ్యేందుకు సోపానమైంది. ఉత్తరాఖండ్‌లో పర్యావరణవేత్త సుందర్‌లాల్ బహుగుణ పర్యావరణ పరిరక్షణ గురించి జనాన్ని జాగృతం చేయడం కోసం సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. పర్యావరణ వేత్తలందరికీ పితామహునిగా ఇప్పటికీ జేజేలు అందుకుంటున్న సుందరలాల్ బహుగుణ ఈ ఉద్యమంలో మేథాపాట్కర్, వందనా శివ, వంటి ఎంతో మందికి స్ఫూర్తిదాయక మయ్యారు.

ఉత్తరప్రదేశ్‌లో షేట్కారీ సంఘటన్ నాయకుడు మహేంద్రసింగ్ తికాయిత్ రైతుల సమస్యల సాధన కోసం ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మహారాష్ట్రలో రైతు నాయకుడు శరద్ జోషి పాదయాత్రను నిర్వహించారు.

వెనకటి తరానికి చెందిన బాలీవుడ్ నటుడు, మాజీ కేంద్రమంత్రి సునీల్‌దత్ 1987లో ముంబాయి నుంచి అమృతసర్‌కు జరిపిన పాదయాత్ర చారిత్రాత్మకమైంది. ఆయన కుమార్తె, మాజీ ఎంపీ ప్రియాదత్ కూడా ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఖలిస్తాన్ తీవ్రవాదుల దాడుల కారణంగా పంజాబ్ అగ్నిగుండంగా మారిన సమయంలో ప్రజలకు ధైర్యాన్ని కలిగించేందుకు సునీల్‌దత్ జరిపిన పాదయాత్ర ఆయనకు శాంతిదూత అనే పేరు వచ్చేట్టు చేసింది. పాదయాత్ర కాకపోయినా ఆ రోజుల్లో ఆయన ఎత్తయిన సియాచిన్ ప్రాంతానికి వెళ్ళి సరిహద్దులను పరిరక్షించే జవాన్లకు స్థయిర్యాన్ని కలిగించారు. స్వాతంత్ర్య సమరంలో తూర్పు బెంగాల్‌లోని నౌఖాలి ప్రాంతంలో 1946 లో మత ఘర్షణలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు మహాత్మాగాంధీ పాదయాత్ర జరిపారనీ, కేరళలో మాప్లాల తిరుగుబాటు బాధితులనూ, నైజాంలో రజాకార్ల దాడులలో బాధితులకు ధైర్యం చెప్పేందుకు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పాదయాత్రలు జరిపినట్టు స్వాతంత్ర్య యోధుడు క్రొవ్విడి లింగరాజు పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పదహారేళ్ళ క్రితం 2003లో ఆనాటి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుంచి ఇచ్ఛాపురం వరకూ దాదాపు 1500 కిలో మీటర్లు మహాప్రస్థానం పేరిట జరిపిన పాదయాత్ర తెలుగు జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ పాదయాత్ర కారణంగానే ఆయన ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడు అయ్యారు. 2004లో ముఖ్యమంత్రి పదవికి ఎంతోమంది పోటీపడినా, ఆయనకున్న జనాదరణను గీటురాయిగా తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం ఆయననే ఆ పదవికి ఎంపిక చేసింది. అత్యున్నత పదవిని చేరేందుకు పాదయాత్ర సోపానంగా వైఎస్ఆర్ హయాంలో స్థిరపడింది. ఆయన కర్నూలు జిల్లా పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో దుర్మరణం పాలై దాదాపు పదేళ్ళు కావస్తున్నా, తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు అసంఖ్యాకంగా ఉన్నారు. వైఎస్ఆర్ అమలు జేసిన ఉచిత విద్యుత్, కార్పొరేట్ వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఆయనకు విశేషమైన జనాదరణ లభించేట్టు చేశాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరిట ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ జనం నాలుకల మీద నడయాడుతున్నాయి. ఆయన కుమార్తె షర్మిల ఇడుపులపాయ నుంచి 2012 అక్టోబర్‌లో పాదయాత్ర ప్రారంభించి 3,112 రోజులు పాదయాత్ర జరిపారు. ఆమె పాదయాత్ర ప్రభావం కూడా మహిళలపై ఎక్కువ కనిపించింది. ఆ తర్వాత అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా హిందుపురం నుంచి విశాఖ వరకూ 2,800 కిలోమీటర్ల పాదయాత్ర జరిపి ప్రజల సమస్యలను ఆకళింపు చేసుకున్నారు. ఆ పాదయాత్రలో జనాభిప్రాయానికి అనుగుణంగానే రైతుల రుణమాఫీ పథకాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు జేశారు. 2012 అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమైన ఆయన పాదయాత్ర 2013 ఏప్రిల్ 13వ తేదీతో ముగిసింది. చంద్రబాబు పాదయాత్రకు విశేషమైన జనాదరణ లభించింది. పాదయాత్రలో అడుగడుగునా ఆయన సామాన్య జనావళితో మమేకమై కదిలారు. నిత్యం జనంలో ఉండే నేతగా ముద్రపడిన చంద్రబాబు ఆ పాదయాత్రతో జనం గుండెలను తాకగలిగారు. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యేందుకు దోహదం అయింది. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జనసంపర్క్ పాదయాత్ర జరిపారు. పోలవరం ప్రాజెక్టు సాధన కోసం వడ్డి వీరభద్రరావు సుదీర్ఘ పాదయాత్ర జరిపారు. పాదయాత్రల పర్వంలో బుధవారంనాడు వైఎస్ జగన్ ముగించనున్న ప్రజాసంకల్ప యాత్ర కూడా రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఈ యాత్ర సందర్భంగా ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నా, మొక్కవోని ధైర్యంతో ఆయన ముందుకు సాగారు. ప్రతి శుక్రవారం ఆస్తుల కేసులో హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. బాలలు, వృద్ధులు, యువకులు, మహిళలతో సహా అన్ని వర్గాల ప్రజలు ఆయనకు నీరాజనం పలికారు. జగన్ పాదయాత్రకు గత అక్టోబర్ మాసంలో కొద్ది రోజుల బ్రేక్ వచ్చింది. హైదరాబాద్ వెళ్ళేందుకు విశాఖ విమానాశ్రయం చేరుకున్న ఆయనపై అక్కడి క్యాంటిన్‌లో పనిచేసే శ్రీనివాసరావు అనే యువకుడు దాడి చేయడంతో జగన్ పదిహేను రోజుల పాటు హైదరాబాద్‌లో చికిత్సపొంది మళ్ళీ పాదయాత్ర ప్రారంభించి 3,600 పైగా కిలోమీటర్ల దూరం నడిచి అందరి రికార్డులను అధిగమించారు. ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు సుదీర్ఘ పాదయాత్ర జరిపిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుంది. జగన్ పాదయాత్రకు అపూర్వమైన ప్రజాస్పందన కనిపించింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా పాదయాత్ర చిహ్నంగా ఇచ్ఛాపురంలో 88 అడుగుల ఎత్తున 13 అంతస్తుల స్థూపాన్ని బుధవారం జగన్ ఆవిష్కరించనున్నారు.

-తేజోన్మయ్

ఆసియాలో అస్థిరతకు చైనా ఆజ్యం!

అంతర్జాతీయ రాజకీయాలు ఆసియా దేశాలలోనే జరుగుతున్నాయి. గల్ఫ్ దేశం అయిన ఇరాన్ మీద అమెరికా ఆంక్షలు, చమురు రాజకీయాలు, ఒపెక్ చమురు దేశాల నిర్ణయాలపై అమెరికా పెత్తనం, పాకిస్తాన్‌ను చైనా లోబరచుకోవడం పాక్ - చైనాల మధ్యా సియాచిన్ మంచు కొండల్లో రోడ్డు నిర్మాణం, నేపాల్ కారిడార్‌లో డోక్లాం ప్రాంతంలో ఉల్లంఘనలు,మయన్మార్ (బర్మా)లో రోహింగ్యాలు ముస్లింలను వెళ్ళగొట్టడం దక్షిణ చైనా సముద్రంలో సైనిక విన్యాసాలు మొదలైన వాటితోపాటు అమెరికా చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ....ఇవన్నీ ఆసియాదేశాల్లోనే...

లంకలో చైనా సైనిక స్థావరాల నిర్మాణంః శ్రీలంక తాజా సంక్షోభానికి ఆర్థిక లొంగుబాటు మరియు శ్రీలంక పార్లమెంటులో ఆధిపత్యపోరు అన్ని చైనా దక్షిణాసియా ప్రాంతంలో ఆధిపత్యం చివరకు చైనా అగ్రరాజ్యం హోదాను పొందేందుకు చేసే ఎత్తుగడలే కారణం. శ్రీలంకలో ఏమి జరుగుతుందో పరిశీలిస్తే మనకు స్పష్టంగా అర్థం మవుతున్నదేమిటి? అందుకు పరిష్కారం ఏమిటి?

1990 వ దశకంలో శ్రీలంక జాతుల సమస్య చెలరేగినపుడు భారతదేశం శ్రీలంకకు భారత సైన్యాన్ని పంపి పెద్ద సమస్యలను ఎదుర్కొంది. శ్రీలంకలో అధికులు సింహళీయులు, మైనారిటీలుగా బ్రిటిష్ వలస ప్రాంతాల నుండి శ్రీలంకకు వెళ్ళిన వారిలో తమిళులు అధికులు. వీరు తూర్పు ఈలం ప్రాంతంలో రబ్బరు తోటలు, వ్యవసాయం చేసుకొనే కూలీలు. గత 150 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో అధికులుగా ఉండి శ్రీలంక దేశ అభివృద్ధిలో భాగం పంచుకొంటున్నారు. 1970 దశకం తరువాత తమిళులు తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తున్నారు. కాని అందుకు సింహళీయులు అంగీకరించుట లేదు. దాంతో 1970 దశకంలో కొన్ని తమిళ ఉగ్రవాద గ్రూపులుగా మారి మాకు ప్రత్యేక తమిళ్ ఈలం కావాలని గెరిల్లా యుద్ధంను శ్రీలంక ప్రభుత్వంకు వ్యతిరేకంగా పనిచేసింది. అలాంటి సమయంలో శ్రీలంక ప్రభుత్వం ఇండియాను తమ దేశంలో జరుగు ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయుటకు సహాయాన్ని కోరింది. దాంతో ఆనాటి ఇండియా ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీలంక అధ్యక్షుడు జయవర్ధనేల మధ్య శ్రీలంక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నారు. ఆ శ్రీలంక - ఇండియా ఒప్పందం ప్రకారం శ్రీలంకలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఇండియా సైన్యాన్ని పంపింది. ఇండియా సైనికులు శ్రీలంక తమిళులకు వ్యతిరేకంగా పనిచేయుట. అంతకు ముందు ఇండియా లిబరేషన్ ఫర్ తమిళ్ టైగర్స్ ఆఫ్ ఈలం వారికి (ఎల్‌టిటిఇ)కి సైనిక శిక్షణను మద్రాసు పట్టణ సైనిక బేస్‌లలో ఇవ్వడం జరిగింది. అపుడే ఆ ఎల్‌టిటిఇ చేస్తున్న విమోచన ఉద్యమ పోరాటం చేయుటకు ఇండియా సైన్యాన్ని పంపింది. దీనిని తమిళ ఆర్గనైజేషన్స్ వ్యతిరేకించాయి. అయినా ఇండియా శ్రీలంక ఒప్పందం 1986 ప్రకారం ఇండియా సైన్యంను పంపింది. ఆ చర్య తమిళుల ఉద్యమం ఆపడంలో అటు శ్రీలంక సైన్యంకు సహాయపడి ఇండియా సైన్యం కూడా అణచలేకపోయింది. దాంతో ఇండియా సైన్యం కొద్ది కాలం తర్వాత సమస్య పరిష్కారం కాకముందే వెనుదిరిగి వచ్చింది. ఆ కక్షతో ఇండియా ప్రధాని రాజీవ్‌గాంధీని ఎల్‌టిటిఇ మానవ బాంబులు శ్రీ పెరంబుదూర్ ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీని కాల్చి చంపాయి.

అక్కడితో ఆగకుండా అంతర్జాతీయ తమిళుల సహాయంతో ఎల్‌టిటిఇ శ్రీలంక రాజ్యంపై దాడులు జరుపుతూనే ఉంది. వాటిని అణచివేయుటకు శ్రీలంక అంతర్జాతీయంగా యుఎన్ ఫోర్స్‌ను ఆహ్వానించింది. కాని శాంతి భద్రతలు ఏర్పరచిన ఎల్‌టిటిఇ దాడులు ఆగలేదు. ఆనాటి సింహళ పార్టీ ప్రధాని రాజపక్సే చైనా సహాయాన్ని కోరారు. చైనా ఇదే అదనుగా శ్రీలంక సైన్యానికి శిక్షణ ఇచ్చేందుకు తన సైనిక స్థావరాన్ని ఏర్పరచింది. అప్పటి నుండి అంటే 1992 నుండి 2004 మధ్యకాలంలో శ్రీలంక సైన్యానికి ఎల్‌టిటిఇ ల మధ్య భీకర పోరులో పూర్తిగా ఎల్‌టిటిఇ నాయకులను సైన్యాన్ని మరియు పౌరులను ఊచకోత కోసి మారణహోమంలో లక్షలమంది తమిళులు ప్రాణాలు కోల్పోయారు. తమిళ్ ఈలం డిమాండ్ తగ్గింది. కాని పూర్తిగా తొలగిపోలేదు. ఎందుకు ఈ విషయాలు పేర్కొనడం జరిగిందంటే శ్రీలంక సంక్షోభంలో భారత దేశ సహాయాన్ని కోరేందుకు శ్రీలంక ప్రధానమంత్రి విక్రమసింగే ఇండియా ప్రధానిని కలిసి సహాయాన్ని అర్థించాడు కాని ఇండియా గతంలో 1987 -88 లో చేసిన తప్పును చేయకుండా శ్రీలంకకు సహాయాన్ని అందించుటకు నిరాకరించింది. కాని అప్పటికే శ్రీలంకలో సైనిక స్థావరాలను ఏర్పరచుకొన్న చైనా శ్రీలంకలో ఎన్నికకాబడిన విక్రమసింగేని తొలగించి చైనాకు అనుకూలుడైన రాజపక్సేను పార్లమెంటులో మెజారిటీ లేకున్నా ప్రధానిగా నియమించడం జరిగింది. చైనా తనకు అనుకూలుడైన రాజపక్సేను నియమించి తన ఆర్థిక, వాణిజ్య, సైనిక కార్యకలాపాలను శ్రీలంకలో కొనసాగించడం. అప్పటికే శ్రీలంక ఆర్థిక ఇబ్బందులు విదేశీ రుణం అప్పులతో బాధపడుతోంది. తిరిగి ఎన్నికల సమయం రాకుండా ముందుగా ఎన్నికలు జరిపిస్తే, మరింత ఆర్థిక భారం పడుతుందని తెలిసిన శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన చైనా వత్తిడితో విక్రమ సింఘేను ప్రధానిగా తొలగించి రాజపక్సేను ప్రధానిగా నియమించారు. దాంతో సంక్షోభం నెలకొంది. కాని శ్రీలంక పార్లమెంటులో రాజపక్సేకు మెజారిటీ లేదు. దాంతో అధ్యక్షుడు మైత్రి పాల సిరిసేన పార్లమెంటును రద్దు చేశాడు. మాజీ ప్రధాని విక్రమసింగే శ్రీలంక సుప్రీం కోర్టును ఆశ్రయించగా శ్రీలంక పార్లమెంటును రద్దు చేయడం చట్టానికి శ్రీలంక రాజ్యాంగానికి విరుద్ధమని ప్రకటించగా అధ్యక్షుడు మైత్రిపాల పార్లమెంటును సమావేశపరచి రాజపక్సేను మెజారిటీ నిరూపించుకోమని కోరాడు. దాంతో మెజారిటీ లేని ప్రధాని రాజపక్సే, పార్టీయులు పార్లమెంటును రద్దుచేసి ఎన్నికలకు వెళ్ళాలని పట్టుపడుతున్నారు. కాని విక్రమసింఘే ప్రభుత్వం (చైనాకు వ్యతిరేకం)ను ఏర్పరచమని కోరడం లేదు. దాంతో శ్రీలంకలో పాలన సంక్షోభం, ఆర్థిక వైఫల్యం, అప్పులతో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాని చైనా, తానిచ్చిన అప్పులను తిరిగి చెలించమని వత్తిడి చేయడంతో దిక్కుతోచని స్థితిని శ్రీలంక ఎదుర్కొంటోంది. ఇలా చైనా శ్రీలంకలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు వెనుకాడడం లేదు.

అదేవిధంగా మయన్మార్‌లో కూడా చైనా, ఎన్నికయిన సాన్‌చూకిని ప్రధాని కాకుండా చేసి మయన్మార్ అధ్యక్షుడినిగా సైన్యాధ్యక్షునిచేసి పాలనను ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో మయన్మార్ నుంచి ముస్లిం రోహింగ్యాలను మయన్మార్ నుండి దాదాపు 4.5 లక్షల మందిని వెళ్ళగొట్టింది. ఆ మయన్మార్ రోహింగ్యాలు బంగాళాఖాతం ద్వారా బంగ్లాదేశ్, ఇండియాలోకి ప్రవేశించి ప్రాణాలను కాపాడుకొంటున్నారు. ఇదే సమయంలో మయన్మార్‌లో మానవ హక్కులను కాపాడడంలో మయన్మార్ పార్టీ ఎన్నికైన నాయకురాలు అంగసాన్ సూకీ రోహింగ్యాల మానవ హక్కులను కాపాడలేకపోయిందని విమర్శలను ఎదుర్కొన్నారు.ఆమెకు గతంలో ఇచ్చిన నోబుల్ శాంతిబహుమతిని తిరిగి వెనక్కి తీసుకొన్నారు. మయన్మార్‌లో సైనికులు రోహింగ్యాలను చిత్రహింసలుపెడితే వారు ఇతర దేశాలకు వలస పోతున్నారు. దీనివలన మయన్మార్ ప్రభుత్వం ఇరకాటంలో పడి చైనా చెప్పుచేతల్లోనే నడుస్తుంది.

-డాక్టర్ కె.ఆసయ్య, ఐఏఎస్, 8008359912

ఛాన్స్ ఇవ్వండి... సత్తా చూపిస్తాం

- ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్ సీనియర్ల వేడుకోలు
- అసెంబ్లీ ఎన్నికలు కలిసి రాలేదంటూ ఆవేదన
- హైకమాండ్‌కు దరఖాస్తు... లాబీయింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీ టికెట్ కోసం ఎవరికి వారుగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు మరో మూడు నెలల సమయం ఉండటం.. కాంగ్రెస్ అధిష్టానం కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించడంతో రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితులు కలసిరాక ఓడిపోయాం... పార్టీ టికెట్ ఇస్తే లోక్‌సభ ఎన్నికల్లో గెలుస్తాం. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయామన్న సానుభూతి ప్రజల్లో ఉందంటూ హైకమాండ్‌కు దరఖాస్తులు, విన్నతులు కూడా చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన హేమాహేమీలు ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నామని, మరో ఐదేళ్లు ఖాళీగా ఉండటం వల్ల రాజకీయంగా నష్టపోతామనే అభిప్రాయంతో పార్లమెంట్‌కు వెళ్లాలని వీరంతా భావిస్తున్నారు. గాంధీ భవన్‌లో మూడురోజులపాటు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్ష సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల గురించి కూడా అభిప్రాయాలు సేకరించారు.



పోటాపోటీ

అసెంబ్లీకి పోటీచేసి ఓటమి చెందిన వారే చాలామంది మళ్లీ టికెట్ కోరుతుండటంతో.. ద్వితీయ శ్రేణి నాయకత్వంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రధానంగా నల్లగొండ లోక్‌సభకు సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, మాజీ ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు టీ పీసీసీ అధ్యక్షుడు, హుజుర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతి కూడా టికెట్ రేసులో ఉన్నారు. ఈ ముగ్గురు నేతలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన విషయం తెలిసిందే.

ఇక మహబూబ్‌నగర్ విషయానికి వస్తే మాజీ మంత్రి డీకే అరుణ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని మాజీ ఎంపీ సూదిని జైపాల్‌రెడ్డి భావిస్తున్నప్పటికీ వయోభారం అంశం అడ్డొచ్చే అవకాశం ఉంది. ఇకనాగర్‌కర్నూల్ విషయానికి వస్తే ప్రస్తుతం ఎంపీగా ఉన్న నంది ఎల్లయ్యతో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి కూడా పోటీపడుతున్నారు. సంపత్ (అలంపూర్), మల్లు రవి (జడ్చర్ల) నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన విషయం తెలిసిందే. చేవెళ్ల టికెట్ కోసం ప్రస్తత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇక సికింద్రాబాద్‌కు మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్‌తో పాటు నగర మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నారు. హైదరాబాద్ విషయంలో మాత్రం పెద్దగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. అజారుద్దీన్‌ను బరిలోకి దింపాలని పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లుగా సమాచారం.

ఇక భువనగిరి విషయానికి వస్తే టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి లోక్‌సభకు పోటీ చేసే అవకాశం వస్తుందని మొదటి నుంచి అశా భావంతో ఉన్నారు. అందుకు భువనగిరి అసెంబ్లీ టికెట్‌ను కూడా ఆశించలేదు. అయితే ఇదే నియోజక వర్గం నుంచి టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో పాటు ఎన్నికల ముందు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వంగాల స్వామిగౌడ్ పేరు కూడా వినిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా వంగాల స్వామిగౌడ్ పని చేశారు.

కాగా పొన్నాల లక్ష్మయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ అసెంబ్లీ నియోజక వర్గం కూడా భువనగిరి లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోనే ఉండటంతో ఆయన లోక్‌సభకు పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇక వరంగల్ విషయానికి వస్తే ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన ఇందిర, మాజీ మంత్రి జి. విజయరామారావుతో పాటు మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కూడా టికెట్ ఆశిస్తున్నారు.

కాగా వరంగల్ ఎస్సీ రిజర్వుడు సీటు కావడం ఎస్సీలోని మాదిగ సామాజిక వర్గం నుంచి మహిళకు అవకాశం ఇవ్వాలని అధిష్టానం భావిస్తే ఇందిరకు లోక్‌సభకు పోటీ చేసే అవకాశం వస్తుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక మహబూబాబాద్ విషయంలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, రవీంద్రకుమార్‌లు టికెట్ ఆశిస్తున్నారు. అయితే బలరాంనాయక్ అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. లంబాడి హక్కుల కోసం మొదటి నుంచి ఉద్యమం చేస్తున్న బెల్లయ్యనాయక్‌కు అసెంబ్లీ టికెట్ ఆశించినా ఇవ్వలేదు. పార్లమెంట్‌కు అవకాశం ఇవ్వొచ్చని అంటున్నారు. కరీంనగర్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద టికెట్ ఆశిస్తున్నారు. అయితే పొన్నం ప్రభాకర్ గతంలో కరీంనగర్ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈ సీటును నేరెళ్ల శారద కూడా మహిళా కోటా నుంచి ఆశించినప్పటికి పొన్నం ప్రభాకర్‌కే అవకాశం ఇచ్చారు. ఇప్పుడు తనకు ఎంపీగా పోటి చేసే అవకాశం ఇవ్వాలని నేరెళ్ల శారద పట్టుపట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

నిజామాబాద్ నుంచి ఏఐసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పోటీ చేయనున్నారు. అయితే భువనగిరి బరిలో ఉంటారనే చర్చ జరుగుతోంది. ఇక పెద్దపెల్లి పార్లమెంట్‌కు మాత్రం మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్, నేతకాని వెంకటేష్ టికెట్‌ను ఆశిస్తున్నారు. జహీరాబాద్ నుంచి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి తనయుడి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ముగ్గురూ పోటీ చేశారు.

ఖమ్మం, మల్కాజ్‌గిరి ఏ పార్టీకో..?





ఖమ్మం, మల్కాజ్‌గిరి నుంచి కూడ సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. ఒక వేళ పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుల ఉంటే.. ఈ రెండు స్థానాలు మిత్రపక్షాలకు వెళ్లే అవకాశం ఉందని అంటున్నరు. మాల్కాజ్‌గిరి టీడీపీకి సిట్టింగ్ స్థానం కావడంతో పాటు ఖమ్మంలో ఆ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్నందున పొత్తులు కుదిరితే ఆ రెండు స్థానాలు టీడీపీకి కేటాయించే అవకాశం ఉం దని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికి ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కోసం మాజీ ఎంపీ రేణుకాచౌదరి, ఎమ్మెల్సీ పొంగు లేటి సుధాకర్‌రెడ్డి ఆశిస్తు న్నారు. ఇక మల్కాజ్‌గిరి టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డితో పాటు రేణుకాచౌదరి కూడా ఆశిస్తున్నారు. ఇక అదిలాబాద్ విషయానికి వస్తే మాజీ ఎంపీ రమేష్‌రాథోడ్, నరేష్‌జాదవ్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే రాష్ట్రం లో రెండు ఎస్టీ లోక్‌సభ సీట్లలో ఒకటి లంబాడ సామాజిక వర్గానికి ఇస్తే మరొకటికి ఆదివాసీలకు ఇవ్వాలని డిమాండ్ వచ్చింది.

నా భార్యకు టికెటిస్తే గెలిపిస్తా



సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గమైన మెదక్ లోక్‌సభ విష యంలో కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించనుందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గం నుంచి గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత, సినీనటి విజయశాంతి ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయశాంతి బరిలో ఉంటారా.? ఉండరా.? అనే విషయంపై ఇంకా స్పష్టత రావడం లేదు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాత్రం తన భార్యకు టికెట్ ఇస్తే గెలిపించుకొని వస్తానని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ హవాలోనూ అది సీఎం సొంత జిల్లాలో సంగారెడ్డి నుంచి జగ్గారెడ్డి ఒక్కరే విజయం సాధించారు. ఎంపీ టికెట్ తమ కుటుంబానికి ఇవ్వాలని కోరుతున్నారు. లేదంటే సీఎల్పీ నేతగా అవకాశమివ్వాలని అంటున్నారు. ఈ సీటును మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ అడుగున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

16న సీఎల్పీ సమావేశం?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసన సభాపక్ష సమావేశం ఈ నెల 16 నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. అదే రోజు సీఎల్పీ నేతను కూడా ఎన్నుకుంటారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుండటంతో, ప్రధాన ప్రతిపక్షహోదాలో సీఎల్పీ నేత అసెంబ్లీలో సభనుద్దేశించి మాట్లాడే సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. కాగా అసెంబ్లీ సమావేశాలకు ఒక రోజు ముందే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం ఏర్పాటు చేసి సీఎల్పీ నేతను ఎన్నుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎల్పీ పదవి కోసం టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రారెడ్డితో పాటు సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఈబీసీ రిజర్వేషన్లు చారిత్రాత్మకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈబీసీ పది శాతం రిజర్వేషన్లు అన్ని అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ వర్తిస్తాయని భాజపా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్ చెప్పారు. ఈబీసీ పది శాతం రిజర్వేషన్ల వలన ఆంధ్రాలో కాపు సామాజికవర్గం కూడా లబ్ధి పొందనుందని వివరించారు. ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను ఒక్కశాతం కూడా తగ్గించకుండా, ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ఈబీసీ రిజర్వేషన్లపై పార్టీలు చౌకబారు విమర్శలు మానుకోవాలన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు అర్థరహితమని మండిపడ్డారు.

కాంగ్రెస్ స్వాగతిస్తోంది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తున్నదని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సీఎం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని సర్వే సత్యనారాయణ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

రాజాసింగ్‌ను అనర్హుడిగా ప్రకటించాలి: దాసోజు

ప్రొటెం స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. 43 కేసులు ఉన్న వ్యక్తిని ఎందుకు శిక్షించడం లేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మత విద్వేశాలు రెచ్చగొడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు.

ఓట్ల రాజకీయమే: టీ.తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ

లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఈబీసీ రిజర్వేషన్లను బీజేపీ తెరపైకి తెచ్చిందని తెలంగాణ తెదేపా అధ్యక్షుడు రమణ ఆరోపించారు. నాలుగేళ్లుగా ఈ బిల్లును ఎందుకు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు.

రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకమా?

- బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన బీసీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్పష్టం చేసింది. అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ ప్రయోజనాల రీత్యా అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, టి నందగోపాల్, భూపేష్‌సాగర్ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్డించారు.

రాజకీయ లబ్ధి కోసమే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు: జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లను తీసుకొస్తోందని జాతీయ ఓబీసీ ఫెడరేషన్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం నేషనల్ ఓబీసీ ఫెడరేషన్, బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'అగ్ర వర్ణాలకు రిజర్వేషన్లు - బీసీల భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై సమావేశం నిర్వహించారు.

ఫ్లోరిడా వర్సిటీతో ఎంవోయూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతులకు మరింత మెరుగైన సాగు విధానాలను పరిచయం చేసేందుకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఆ యూనివర్సిటీకి చెందిన అధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలంగాణ వర్సిటీ అధికారులతో సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్‌లో పరస్పర సహకారం కోసం హరి ద్వార్‌లోని పతంజలి బయోరీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తోనూ ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాలు జయశంకర్ వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ వి.ప్రవీణ్‌రావు సమక్షంలో జరిగాయి.

ఫీజుల నిర్ణయానికి రెండేళ్ల ఆడిట్ ఓకే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్యా కోర్సులకు రానున్న మూడేళ్ల కోసం ఫీజులను నిర్ణయించడానికి కాలేజీలకు చెందిన రెండు సంవత్సరాల ఆడిట్ నివేదికను మాత్రమే పరిశీలించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. వాస్తవానికి అయితే మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్టును పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం కేవలం రెండు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. 2016-17, 2017-18, 2018-19 సంవత్సరాల రిపోర్టు అవసరం ఉంటుంది. కానీ 2018-19 సంవత్సరానికి సంబంధించి నివేదిక పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండదు కాబట్టి కేవలం రెండు సంవత్సరాల నివేదికను పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు తెలంగాణ ఏఎఫ్ఆర్‌సీ జారీ చేసే అవకాశం ఉంది.

31న ఎన్వీరాన్‌మెంటల్ పరీక్ష

పీఆర్‌టీయు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోని ఎన్వీరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను జనవరి 30కి బదులుగా 31న నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి జనవరి 30న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ 30న గ్రామపంచాయతీ ఎన్నికల చివరి విడత పోలింగ్ ఉన్నందున దానిని కాస్త జనవరి 31కి మార్చినట్టు తెలిపారు.

రైలు ఢీకొని తల్లీ కొడుకు మృతి

నవీపేట్, ప్రభన్యూస్: నిజామాబాద్ జిల్లా, నవీపేట్ మండల కేంద్రంలో మంగళవారం ఫకీరాబాద్‌లో మధ్యాహ్నం దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని తల్లీకొడుకులు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం గంగామణి(45), కొడుకు గంగాప్రసాద్ (12) బాసర నుంచి నిజామాబాద్ వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. గంగాప్రసాద్ మానసిక వికలాంగుడు. తల్లి గంగామణి కూలీ పని చేసుకుని ఇంటికి వెళ్తుండగా ఫకీరాబాద్ రైల్వేగేట్ దేవగిరి ఎక్స్‌ప్రెస్ వస్తోందని గేటు వేశారు. గేటు కింది నుంచి వెళ్లిన గంగాప్రసాద్‌ను కాపాడడానికి ప్రయత్నించిన తల్లి గంగామణి అక్కడికక్కడే మృతి చెందారు. గంగామణి భర్త అనారోగ్యంతో గత మూడు సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఈ ప్రమాదంలో మృతదేహాలు తల, మొండాలు వేరయ్యాయి. కూతురు మహేశ్వరికి రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ ప్రణయ్ కుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కర్నాటక మంత్రి పీఏ దందా

బెంగళూరు: కర్ణాటక బీసీ సంక్షేమశాఖ మంత్రికి పీఏగా పనిచేస్తున్న మోహన్ అనే వ్యక్తి నలుగురు కాంట్రాక్టర్ల నుంచి రూ.25.76లక్షలు వసూలు చేశాడని పోలీసులు తెలిపారు. ఈ నగదును జప్తు చేసి కేసు నమోదు చేశామని మంగళవారం మీడియాకు తెలిపారు. మైసూరుకు చెందిన మోహన్ డిప్యుటేషన్‌పై విధానసౌధలోని మంత్రి సీ.పుట్టారంగషెట్టి కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్నారన్నారు. టైపిస్ట్ విధులతోపాటు మంత్రి షెట్టి పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో జనవరి 4న విధానసౌధ పోలీసులు సెక్రెటేరియట్ నుంచి నగదుతో బయటకువెళుతున్న మోహన్‌ను అరెస్టు చేసి విచారించారు. మోహన్ జనవరి 3న అనంతు అనే వ్యక్తి నుంచి రూ.3.6లక్షలు వసూలు చేసి సెక్రెటేరియట్‌లోని కార్యాలయంలో ఉంచినట్టు తెలిపాడన్నారు. మరుసటి రోజు నందు అనే కాంట్రాక్టర్ నుంచి 15.9లక్షలు ఎమ్మెల్యేల నివాసం సమీపంలో వసూలుచేశాడని, అదేవిధంగా శ్రీనిధి నుంచి రూ.2లక్షలు కర్ణాటక హైకోర్టు ఎదురుగా, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి నుంచి రూ.4.26 లక్షలు విధానసౌధలో వసూలు చేశాడని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేసేందుకు కాంగ్రెస్ మంత్రి షెట్టీ రాజీనామా చేయాలని బీజేపీతోపాటు జేడీఎస్ నేతలు డిమాండ్ చేశారు.

'ఇష్ట' సదస్సుకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు సీఎస్ జోషి ఆదేశాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది జూన్ 26 నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభమయ్యే ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ (ఇష్ట) సదస్సు ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటినుంచే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు. హెచ్ఐసీసీ వేదికగా జూలై 3 వరకు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు అనేక దేశాల నుంచి ప్రముఖులు, ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, ప్రతినిధులు వస్తుండడంతో భద్రత, వసతి, రవాణా సదుపాయాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ అంశంపై మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 200 విత్తన సంస్థలు, ఆయా ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొంటున్నందున లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనేక పరిశోధనల అనంతరం కొత్తగా అందుబాటులోకి వచ్చిన విత్తనోత్పత్తులు, ప్రాసెసింగ్, ప్యాకింగ్, ట్రీట్‌మెంట్, టెక్నాలజీ వినియోగం తదితర అంశాలపై పేరుగాంచిన శాస్త్రవేత్తల ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ మెట్టపంటల పరిశోధనా సంస్థ ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీటర్ కార్బెర్రీ, ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఆండ్రీస్ వెయిస్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థిసారధి, పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆందోళనతోనే బస్వాపూర్ నిర్వాసితులకు పరిహారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బస్వాపూర్ సాగునీటి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చొరువకు టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్ రిజర్వాయర్ కింది వందలాది మంది రైతులు భూములు , ఇళ్లు కోల్పోతున్నారని, వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యర్యంలో ఆందోళన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు కోల్పోతున్న వారికి కూడా త్వరతగతిన నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. బీబీనగర్‌లో రూ. 1200 కోట్లతో ఏయిమ్స్ ఏర్పాటుకు కేంద్రం సంసిద్ధత తెలపడంపైన గూడూరు హర్షం వ్యక్తం చేశారు.

పట్టపగలే ఊడ్చేశారు...

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలో దొంగలు చెలరేగిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ మొత్తం ఊడ్చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భాగ్యనగరం వాసులు పట్నం వీడి పల్లె బాట పడుతున్నారు. మంగళవారం వనస్థలిపురం, హయత్‌నగర్‌లోని వినాయక్‌నగర్‌లో దొంగలు మూడు ఇళ్లల్లో చొరబడి రూ.36 తులాల బంగారం, నాలుగు లక్షల నగదును అపహరించి ఉడాయించారు. పట్టపగలే ఈ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సంక్రాంతికి ఊరికెళ్లేవారెవరైనా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించి వెళితే తగు రక్షణ చర్యలు తీసుకోగలమని మరోవైపు పోలీసులు చెబుతున్నారు.

రక్షణ శాఖతో బీడీఎల్ భారీ ఒప్పందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) రక్షణశాఖతో భారీ ఒప్పందం చేసుకుంది. రూ. 760 కోట్ల విలువైన ఆర్మీ సంబంధిత యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్(ఏటీజీఎం), లాంచర్లను సరఫరా చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ మేరకు మంగళవారంనాడు బీడీఎల్ ప్రొడక్షన్ డైరెక్టర్ వి గురుదత్త ప్రసాద్ సంతకం చేశారు. రష్యాతో కలిసి సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన పరికరాలను హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బీడీఎల్‌నుంచి తయారుచేయనుంది.

రిజర్వేషన్ల అవకాశం రాష్ట్రాలకే ఇవ్వాలి

- ముఖ్యమైన బిల్లు చివరి రోజే కేంద్రానికి గుర్తొచ్చిందా: ఎంపీ వినోద్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరి రోజున ఓబీసీ రిజర్వేషన్ల బిల్లును తీసుకొచ్చి బీజేపీ ప్రభుత్వం గందరగోళ పరిస్థితిని రేకెత్తించిందని టీఆర్ఎస్ ఎంపీ వినోద్ అభిప్రాయపడ్డారు. నెల రోజులుగా సమావేశాలు జరుగుతుంటే ఇంత ముఖ్యమైన బిల్లు చివరి రోజునే గుర్తొచ్చిందా అని ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించారు. ముఖ్యమైన ఈ బిల్లుపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు పార్టీలకు, ఎంపీలకు తక్కువ సమయం మిగిలిందని వినోద్ అన్నారు.

ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సామాజిక పొందిక ఉంటుందని, ఉత్తరాదిన ఓసీలు ఎక్కువని, ఛత్తీస్‌గఢ్‌లో ఎస్టీలు అధికమని, దక్షణాదిన వెనకబడిన వర్గాలు, మైనార్టీలు ఎక్కువనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర అసెంబ్లీ ఎస్టీ, మైనారిటీల రిజర్వేషన్లు పెంచుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఈ బిల్లుతో పాటూ తెలంగాణ శాసన సభ తీర్మానం చేసి పంపిన మైనార్టీ, ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని డిమాండ్ చేశామని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు 37, ఎస్టీలకు 10, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినోద్ కోరారు. ఇంద్ర సహానీ కేసు చూపి మైనార్టీ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపును మోడీ సర్కార్ నాలుగున్నరేళ్లుగా అడ్డుకుంటోందని, సిఎం కేసీఆర్ రాష్ట్రపతి, ప్రధానిలను కలిసి మైనార్టీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంచాలని కోరారని తెలిపారు. సామాజిక పొందిక ఆధారంగా రిజర్వేషన్లను కల్పించుకునే అవకాశం రాష్ట్రాలకే ఇవ్వాలని ఎంపీ వినోద్ డిమాండ్ చేశారు.


ఏపీ నుంచి తెలంగాణకు

23 మంది జిల్లా జడ్జీలు

- హైకోర్టు విభజనలో కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కోర్టుల్లో జిల్లా జడ్జీ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న 23 మంది న్యాయాధికారులను ఉమ్మడి హైకోర్టు విభజనలో భాగంగా తెలంగాణ రాష్టానికి కేటాయించారు. వీరంతా వారికి పోస్టింగ్ ఇచ్చిన కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లా మరియు సెషన్స్ జడ్జి హోదాలో సికింద్రాబాద్‌లోని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల జుడీషియల్ అకాడెమీలో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సి.సుమలతను మాత్రం అదే పోస్టులో కొనసాగాలని ఆదేశించారు.

- శ్రీకాకుళం జిల్లా సెషన్స్ జడ్జిగా విధులు నిర్వరిస్తున్న వి.బి.నిర్మల గీతాంబను హైదరాబాద్ పారిశ్రామిక ట్రిబ్యునల్ చైర్ పర్సన్‌గా నియమించారు.
- కర్నూలు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జి.అనుపమ చక్రవర్తికి కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు.
- ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి జి.ప్రియదర్శినిని ఆదిలాబాద్ జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లో ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జి ఎన్.తుకారాంజీని హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా నియమించారు.
- అనంతపురం జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జీ ఎస్.శశిధర్ రెడ్డిని నల్గొండ జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- విశాఖపట్నం ఫ్యామిలీ కోర్టు కమ్ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి గా విధులు నిర్వర్తిస్తున్న కె.సాయిరమాదేవికి మెదక్ జిల్లా సంగారెడ్డి ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు.
- గుంటూరు జిల్లా 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.నర్సింగరావుకు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు లోని 23వ అదనపు చీఫ్ జడ్జి కమ్ అదనపు ఎంఎస్ జేగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆయన అనంతరం హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) గా నియమితులయ్యారు.



- కృష్ణా జిల్లా విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి సుబ్రహ్మణ్యంను సికింద్రాబాద్‌లోని తెలంగాణ, ఏపీ జుడీషియల్ అకాడెమీ అదనపు డైరెక్టర్‌గా నియమించారు.
- గుంటూరు పారిశ్రామిక ట్రిబ్యునల్ చైర్మన్ కమ్ లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి ఎస్.ప్రేమావతిని కరీంనగర్ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- విశాఖపట్నంలోని సీబీఐ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.పాపిరెడ్డి ని హైదరాబాద్ సిటీసివిల్ కోర్టు 2వ అదనపు చీఫ్ జడ్జి గా నియమించారు.
- విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కమ్ 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్.నాగార్జునకు నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) కేసుల చట్టం, కమ్ 8వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు.
- విశాఖపట్నం మహిళా కోర్టు అదనపు ఫ్యామిలీ కోర్టు, జిల్లా మరియు సెషన్స్ జడ్జి వి.వెంకట శేషను రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- కర్నూలు ఫ్యామిలీ కోర్టు కమ్ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి టి.రఘురాంకు మహబూబ్‌నగర్ జిల్లా 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు.
- కృష్ణా జిల్లా నూజివీడు 15వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఎస్.వెంకటేశ్వర ప్రసాద్‌ను నల్గొండ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- కడప ఫ్యామిలీ కోర్టు కమ్ 6వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి బి.మంజరిని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా నియమించారు.
- గుంటూరు జిల్లా నరసారావుపేట అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కె.జయకుమార్‌ను వరంగల్ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- శ్రీకాకుళం జిల్లా 1వ అదనపు మరియు సెషన్స్ జడ్జి బి.గౌతం ప్రసాద్ ను నిజామాబాద్ 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- తూర్పు గోదావరి జిల్లా కాకినాడ 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్రీనివాసచారిని సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు 27వ అదనపు చీఫ్ జడ్జిగా నియమించారు.
- నెల్లూరు జిల్లా ఎస్‌పీఈ మరియు ఏసీబీ కేసులు కమ్ 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ ని ఖమ్మం 7వ జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా నియమించారు.
- చిత్తూరు జిల్లా 8వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఎ.కరుణ కుమార్‌ను మెదక్ జిల్లా సంగారెడ్డి లోని సెషన్స్ జడ్జి గా నియమించారు.
- కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ 5వ జిల్లా మహిళా విధులు నిర్వహిస్తున్న పి.లక్ష్మీ శారదను రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి 15వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా నియమితులయ్యారు.
- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు లో 4వ అదనపు మెట్రోపాలిటన్ అదనపు చీఫ్ జడ్జి డాక్టర్ టి శ్రీనివాస రావును హైదరాబాద్ సీబీఐ కోర్టు ప్రత్యేక జడ్జిగా నియమించారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

తగ్గిన ప్యాసింజర్ కార్ల అమ్మకాలు

• ఏప్రిల్ – డిసెంబర్‌లో..

న్యూఢిల్లీ: గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్యాసింజర్ వాహనాలు (పీవీ) రెండు శాతం తగ్గాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫెడా) మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 19,17,750 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. కాగా అంతకు ముందు ఏడది ఇదే కాలంలో మొత్తం 19,65,630 యూనిట్లు విక్రయించినట్లు ఫెడ్ పేర్కొంది. కాగా ఫెడా దేశంలోని మొత్తం 1,431 ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్‌టీఓ)లకు గాను 1,072 ఆర్‌టీఓల నుంచి వాహనాల రిజిస్ట్రేషన్ సమాచారాన్ని సేకరించి వివరాలు వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఒక మిగిలింది మూడు నెలలు మాత్రమే కాబట్టి..చివరి త్రైమాసికంలో అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయని ఫెడా అధ్యక్షుడు ఆశిష్ హర్షరాజ్ కాలే ఆశాభావం వ్యక్తం చేశారు. జనవరి నుంచి షోరూంలకు కస్టమర్ల సందడి మొదలైందని ఆయన అన్నారు. పండుగ సీజన్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. కానీ అటు తర్వాత డిసెంబర్‌లో ద్రవ్యలభ్యత కఠినతరం కావడంతో అమ్మకాలు మందగించాయని ఆయన వివరణ ఇచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీల్లో ద్రవ్యకొరత ఏర్పడితే దాని ప్రభావం ప్రత్యక్షంగా ఆటోపరిశ్రమపై పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐ గవర్నర్ ఎన్‌బీఎఫ్‌సీలతో చర్చలు జరిపి పరిస్థితిని చక్కబెడతారని ఆశిస్తున్నామని కాలే అన్నారు.

జిన్నోవ్ లీడర్‌షిప్ జోన్‌లో సైయెంట్



హైదరాబాద్ : గ్లోబల్ సర్వీస్ ప్రొవైడర్ సైయెంట్ ఇంజినీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్; జీయోస్పాటియల్; నెట్‌వర్కు, డిజిటల్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, సొల్యూషన్‌లో గ్లోబల్ లీడర్‌గా కొనసాగుతోంది. తాజా ఎస్టాబ్లిష్‌డ్ అండ్ ఎక్స్‌పాన్సివ్ ప్లేయర్ జిన్నోవ్ అనే గ్లోబల్ కన్సల్టింగ్ .. అడ్వయిజరీ సంస్థ 2018 నివేదికలో ఇంజినీరింగ్ ఆర్అండ్‌డి సర్వీసెస్‌లో సైయెంట్ మొత్తం 4 పరిశ్రమలు ఉదాహరణకు ఎయిరోస్పేస్, ఎనర్జీ అండ్ యుటిలిటీస్, ట్రాన్స్‌పోర్టు, కన్‌స్ట్రక్షన్ అండ్ హెవీ మెషినరీ రంగాల్లో లీడర్‌షిప్ జోన్‌ను గతకొన్ని సంవత్సరాల నుంచి ఆక్రమించిందని పేర్కొంది. అలాగే మెడికల్ పరికరాలు, సెమికండక్టర్ విభాగాల్లో కూడా ఎగ్జిక్యూషన్ జోన్‌లో సైయెంట్ చోటు దక్కించుకుందని పేర్కొంది. జిన్నోవ్ జోన్స్ ప్రతి ఏడాది సర్వీస్ ప్రొవైడర్లకు వార్షిక రేటింగ్ ఇస్తుంటోంది. జిన్నోవ్ జోన్ తమను గుర్తించడం పట్ల సైయెంట్ ఎండీ, సీఈవో కృష్ణబోదానపు హర్షం వ్యక్తం చేశారు.

జీఎంఆర్ విమానాశ్రయం... గ్రౌంగ్ హ్యాండ్లింగ్ కాంట్రాక్టు సెలిబికి

హైదరాబాద్ : సెలిబి ఏవియేషన్ హోల్డింగ్.. గ్లోబల్ గ్రౌండ్ హాండ్లిగ్ సర్వీస్ ప్రొవైడర్, హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండ్ హాండ్లింగ్ లైసెన్స్‌ను దక్కించుకుంది. దీంతో భారత్ మార్కెట్లో సెలిబి మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్లో సెలిబికి ఇది మూడవ కాంట్రాక్టు.. ఇంతకు ముందు బెంగళూరు, కన్నూర్ విమానాశ్రయాల్లో లైసెన్సులు దక్కించుకుంది. 10 సంవత్సరాల పాటు లైసెన్సును దక్కించుకున్న సెలిబి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియాగించుకొని సేవలందిస్తుంది. కస్టమర్లకు సౌకర్యవంతమైన సేవలందిస్తామని సెలిబి ఇండియా సీఈవో మురళీ రామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎగ్జిబిషన్‌లో ఎల్ఐసీ స్టాల్



హైదరాబాద్ : లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఇక్కడ జరుగుతున్న ఆల్ ఇండియా ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ 2019లో స్టాల్‌ను ప్రారంభించింది. ఈ స్టాల్‌ను ప్రాంతీయ మేనేజర్ (మార్కెటింగ్) సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్ సోమవారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉథప్ జోసెప్, సీనియర్ డివిజనల్ మేనేజర్, హైదరాబాద్, ఎన్ లలిత, ప్రాంతీయ మేనేజర్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లు, ఇతర బ్రాంచీలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ఈ స్టాల్‌లో ఎల్ఐసీ చేపట్టిన కొత్త ప్రొడక్టులు... ఈ- సర్వీసుల గురించి ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకులకు వివరించి చెబుతారని ఎల్ఐసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

డిజిటల్ పేమెంట్ కమిటీ ఛైర్మన్‌గా

నందన్ నీలేకని

• మరో నలుగురు సభ్యులను నియమించిన ఆర్‌బీఐ • 90 రోజుల్లో నివేదిక




ముంబై : డిజిటల్ చెల్లింపులను బలోపేతం చేయడానికి నందన్ నీలేకని నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి ప్యానెల్‌ను రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా మంగళవారం నాడు ఏర్పా టు చేసింది. ఆధార్ సృష్టికర్త అయిన నీలేకని ప్యానెల్ డిజిటల్ చెల్లింపులను భద్రతతో పాటు మరింత బలోపేతం చేయడా నికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆర్‌బీఐకి సిఫార్సులు చేస్తుంది. ఐదుగురు సభ్యుల బృందం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి, అలాగే బ్యాంకింగ్ సేవలన్నీ డిజిటైజేషన్ చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేసి నివేదికను ఆర్‌బీఐకి అందిస్తుంది. ఈ కమిటి మొదటి సమావేశం తర్వాత 90 రోజుల్లోగా తుది నివేదిక ఆర్‌బీఐకి అందిస్తుందని ఆర్‌బీఐఒక ప్రకటనలో పేర్కొంది.

ఇదిలా ఉండగా నీలేకని ప్యానెల్ ప్రస్తుతం దేశంలో జరుగుతున్న డిజిటైజేషన్ ద్వారా చెల్లిం పుల వ్యవస్థ ఎలా పనిచేస్తుం దో సమీక్షిస్తుంది. అలాగే ఎక్క డైతే లోపాలు ఉన్నాయో వాటిని గుర్తించి వాటికి పరిష్కాలు కనుగొంటుంది. అలాగే డిజిటల్ చెల్లింపుల్లో మరింత భద్రత కోసం .. డిజిటల్ చెల్లింపు లను బలోపేతం చేయడా నికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేస్తుం ది. వీటిలో ఏదైతే అత్యత్తమం గా ఉంటుందో వాటి ని అమలు చేయాలని సిఫారసు చేస్తుంది. డిజిటల్ చెల్లింపులకు ముందు గా కొత్త ప్యానెల్ మధ్యకాలికానికి కొన్ని సిఫారసులు అందిస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది. ఈ ప్యానెల్‌లో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నీలేకనితో పాటు ఇతర సభ్యులు ఉన్నారు. వారిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్, విజయాబ్యాంకు మాజీ ఎండీ, సీఈవో కిశోర్ సాన్సీ, ఐటీ, స్టీల్ మంత్రిత్వశాఖలో మాజీ కార్యదర్శి అరుణ్‌శర్మ, ఐదవ సభ్యులుగా సంజయ్ జైన్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, సెంటర్‌ఫర్ ఇన్నోవేషన్, ఇన్‌క్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (సీఐఐఈ) ఐఐఎం అహ్మదాబాద్‌లు సభ్యులుగా ఉంటారు.ఇక డిజిటల్ చెల్లింపుల విషయానికి వస్తే 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశంలో కార్డుల ద్వారా చెల్లింపులు అంతకు ముందు సంవత్సరంతో పోల్చుకుంటే 43 శాతం పెరిగాయి. రూ. 10.61 లక్షల కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. అలాగే ప్రభుత్వరంగానికి చెందిన యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్ ద్వారా చెల్లింపులు ఏడాది ప్రాతిపదికన చూస్తే రూ. 1.01 లక్షల కోట్లకు చేరాయని గత ఆగస్టులో ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపులు 2023 నాటికి ఐదు రెట్లు పెరిగి లక్ష కోట్ల డాలర్లు .. భారతీయ కరెన్సీ ప్రకారం ప్రస్తుతం ఉన్న మారకం రేటు ప్రకారం చూస్తే రూ.70 లక్షల కోట్ల వరకు డిజిటల్ చెల్లింపులు జరుగుతాయని క్రెడిట్ సూయిస్ అంచనా వేసింది. ఇదిలా ఉండగా చెల్లింపుల వ్యవస్థకు ప్రత్యేకంగా నియంత్రణా సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్యానెల్ సిఫారసు చేసింది. దీన్ని రిజర్వుబ్యాంకు తీవ్రంగా వ్యతిరేకించింది. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ మంగళవారం నాడు కార్డుల ద్వారా చెల్లింపులకు కొన్ని గైడ్‌లైన్స్ విడుదల చేసింది.

ఆర్‌బీఐ మిగులు నిల్వలపై జలాన్ నివేదిక ఏప్రిల్‌లో

న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న మిగులు నిల్వలపై అధ్య యనం చేయడానికి ఏర్పాటు చేసిన జలాన్ ప్యానెల్ మంగళవారం నాడు మొట్టమొదటి సమావేశం ఏర్పాటు చేసింది. ఈసమా వేశం లో ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిధుల్లో బ్యాంకు తమ వద్ద ఎంత నిల్వలు ఉంచుకోవచ్చు... ఎంత మొత్తం డివిడెండ్ రూ పంలో ప్రభుత్వానికి చెల్లించవచ్చు తదితర అంశాలపై చర్చలు జరిపింది. ఆరుగురు సభ్యుల ప్యానెల్ తుది నివేదికను ఏప్రిల్ లో ప్రభుత్వానికి సమర్పించవచ్చునని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కాగా ఆర్‌బీఐ బోర్డు కొత్త ప్యానె ల్‌కు పని అప్పగించి .. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సెంట్రల్ బ్యాంకులు ఎలా పని చేస్తు న్నా యి, వారి బ్యాలెన్స్‌షీట్ల పై అధ్యయ నం చేయాలని జలాన్‌ప్యానె ల్‌కు బాధ్యతలను అప్పగించింది. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ బిమల్‌జలాన్ ప్యానెల్‌లో మాజీ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాకేశ్ మోహన్ వైస్ ఛైర్మన్‌గా వ్య వహరిస్తారు. కొత్త ప్యానెల్ లాభాల పంపిణీపై తగిన విధంగా ఒక విధానాన్ని తీసుకొచ్చి ఆర్‌బీఐ తమ వద్ద ఎంత మొత్తం నిధులు ఉంచుకోవ చ్చు..ప్రభుత్వా నికి ఎంత బదిలీ చేయాలనే అంశంపై అ ధ్యయ నం చేస్తుంది. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ వద్ద ఉన్న రూ.9.6 లక్షల కోట్లు మిగులు నిధులపై ఆర్థిక మంత్రిత్వశాఖకు మాజీ ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు మధ్య పెద్ద రగడ జరి గిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐపై ప్రభు త్వం ఒత్తిడి పెంచి అదనపు నిధులు ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరడం.. దీనికి ఆర్‌బీఐ గవర్నర్ ససేమిరా అనడంతో ఆర్‌బీఐకి ఆర్థిక మంత్రిత్వశాఖకు మధ్య అగాధం పెరిగింది. ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఉర్జిత్ పటేల్ గత నెలలో రాజీనామా చేసి వెళ్లిపో యారు. అయితే చివరగా నవంబర్ 19, 2018 న జరిగిన ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో మిగు లు నిధులు ఏ విధంగా పంప కం చేయాలో అధ్యయనం చేయడానికి ఒక ప్యానెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది. అటు తర్వాత బిమల్ జలాన్ కమిటి ఏర్ప డింది. ఈ కమిటిలో ఆర్థిక వ్యవహారాల కా ర్యదర్శి సు భాష్ చంద్రగార్గ్‌తో పాటు ఆర్ బీఐ సెంట్రల్ బోర్డుకు చెందిన ఇద్దరు సభ్యులు.. భరత్‌దోషి, సుధీర్‌మం కడ్, ఆర్‌బీఐ డిపర్యాటీ గవర్నర్ ఎన్ ఎస్ విశ్వనాథన్ కమిటీలో ఆరవ సభ్యుడిగా ఉంటారు.



గతంలో కూడా ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిధుల పంపకంపై అధ్యయనం చేయడానికి మూడు కమిటిలను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిలో వి సుబ్రహ్మణ్యం (1997), ఉషా తోరాట్ (2004) వై హెచ్ మలేగాం (2013)లో ఏర్పాటు చేశారు. అయితే సుబ్రహ్మణ్యం కమిటి మాత్రం ఆర్‌బీఐ వద్ద ఉన్న మిగులు నిల్వలు 12 శాతం మాత్రం తమ వద్ద ఉంచుకోవాలని సిఫారసు చేస్తే.. తోరాట్ కమిటి మాత్రం 18 శాతం వరకు ఆర్‌బీఐ ఉంచుకోవచ్చునని సిఫారసు చేసింది. అయితే తోరాట్ కమిటి సిఫారసులను ఆర్‌బీఐ బోర్డు తిరస్కరించింది. అంతకు సుబ్రహ్మణ్యం ప్యానెల్ సిఫారులకే మొగ్గు చూపింది.

అదనపు మూలధనంలో..

బ్యాంకుల ఎన్‌పీఏలు అదుపులోకి...

• రేటింగ్ ఏజెన్సీ ఇక్రా

ICRA

ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు కేంద్రప్రభుత్వం రూ.41వేల కోట్ల మూలధనం సమకూరు స్తామని ప్రకటించడం బ్యాంకులకు అనుకూలమైన పరిణా మమని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదికలో వెల్లడించిం ది. బ్యాంకులకు ప్రభుత్వం అదనపు మూలధనం సమకూర్చడం వల్ల బ్యాంకులు నష్టాలను తగ్గించుకోవచ్చు.. మొండిబకాయిలను తగ్గించవచ్చునని నివేదికలో పేర్కొంది. డిసెంబర్ 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు రూ. 41వేల కోట్ల మూలధనం సమకూర్చడానికి లోకసభ అనుమతి తీసుకున్న విషయాన్ని నివేదికలో గుర్తు చేసింది. దీంతో ఈ ఆర్థికసంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులకు రూ.1.06 లక్షల కోట్ల మూలధనం సమకూరుస్తుంది. ఇదిలా ఉండగా గతేడాది కేంద్రప్రభుత్వం బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనం సమకూరుస్తామని ప్రకటించింది. అటు తర్వాత ఈ బ్యాంకులు మార్కెట్ల నుంచి మూలధనం సమకూర్చలేని పరిస్థితి ఏర్పడిందని ఇక్రా మంగళవారం నాడు విడుదల చేసిన నివేదికలో వివరించింది. తాజాగా ప్రభుత్వం సమ కూరు స్తామన్న రూ.41వేల కోట్ల మూలధనంలో బ్యాంకులకు ప్రభుత్వం సమకూర్చే మొత్తం మూలధనం 2015 నుంచి 2019 ఆర్థికసంవత్స రం వరకు చూస్తే రూ.2.56 లక్షల కోట్లు సమకూర్చినట్లుగా తేలింది. తాజాగా సమకూరుస్తున్న మూలధనంతో ఇప్పటి వరకు ఆర్‌బీఐ పరిధిలో ఉన్న 11 బ్యాంకులు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) ఫ్రేంవర్కును నుంచి బయటపడ్డానికి వీల వుతుంది. ప్రస్తుతం ప్రభుత్వరంగానికి చెందిన బలహీ నమైన బ్యాంకులు దేనా, విజయా బ్యాంకులను బ్యాంకు ఆఫ్ బరోడాలో విలీనం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విలీ నం తర్వాత పీఎస్‌యు బ్యాంకు సంఖ్య 21 నుంచి 19కి దిగి వస్తాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం సమకూరుస్తా మన్న అదనపు మూలధనంలో కొన్ని బ్యాంకులకు ఎక్కువ మొత్తంలో మూలధనం కేటాయింపులు చేయడం జరిగిం ది. తాజాగా మూలధనం రావడంతో బ్యాంకులు మొండిబ కాయిలను కాస్తా తగ్గించుకొనే వెసులుబాటు లభిస్తుందని ఇక్రా నివేదికలో వివరించింది.

గృహ వాణిజ్య అమ్మకాల్లో

హైదరాబాద్ హవా!

• జులై – డిసెంబర్‌లో 24 శాతం వృద్ధి

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్‌కు రానున్న రోజుల్లో మంచి మార్కెట్ ఉంటుందని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది. ఆఫీ స్ స్పేస్, రెసిడెన్షియల్ రంగంలో గత ఏడాది చివరి ఆరు నెలల్లో మంచి వృద్ధి నమోదు చేసు కుందని నైట్‌ఫ్రాంక్ అధ్యయనం పేర్కొంది. దేశం లోని 8 ప్రధాన నగరాలపై జులై-డిసెంబర్ మధ్య కాలంలో జరిగిన రియల్ ఎస్టేట్ రంగ పురోగతిపై అధ్యయనాన్ని మంగళవారం ఆవిష్కరించింది. ఆఫీస్ స్పేస్, రెసిడెన్షియల్ వృద్ధిలో బెంగళూరు అగ్రస్థానంలో నిలవగా, ఎన్‌సీఆర్-ఢిల్లీ, ముంబై తర్వాత స్థానాల్లో నిలిచాయని నైట్‌ఫ్రాంక్ తెలిపిం ది. హైదరాబాద్ మార్కెట్‌కు మంచి డిమాండ్ పెరుగుతుందని, ఇది అత్యంత భవిష్యత్ కలిగిన నగరంగా నిలుస్తుందని పేర్కొంది. గతంలో నిర్మాణాలు చేపట్టిన వాటిలో ఈ ఆరు నెలల్లోనే 70 శాతం పూర్తయ్యాయి. అద్దె భవనాలకు డిమాండ్ పెరగడంతో లీజింగ్ వాల్యూమ్ 43 లక్షల చదరపు అడుగుల్లో ఒప్పందాలు జరిగాయి. ఐటీ, దాని ఆధారిత రంగాలతోపాటు ఉత్పత్తిరంగం విస్త రించడంతో ఎన్‌సీఆర్, ముంబైలతో సమానంగా లీజింగ్ పెరిగింది. గడిచిన ఆరు నెలల్లో దాదాపు 19 శాతం పెరుగుదలకు నమోదు చేసుకుందని నైట్ ఫ్రాంక్ అధ్యయనం పేర్కొంది.2018లో 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో లావాదేవీలు జరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా హైదరాబాద్ డైరెక్టర్ శాంసన్ ఆర్థర్ చెప్పారు. నివాస హౌసింగ్ మార్కెట్ జాతీయ సగటుకన్నా ఎక్కువగా నమోదు చేసింది. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున విక్రయాలు బాగా పెరుగుతున్నాయని ఆయన చెప్పారు.హైదరాబాద్‌లో ఉపాధి పెరుగుతున్న నేపథ్యంలో రెసిడెన్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతుందని, ఇది 2018లో 70 లక్షల అడుగులకు పెరిగిందని తెలిపారు. మాదాపూర్ ప్రారంభంలో అద్దె ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ అద్దె అడుగుకు 60 నుంచి 67 రూపాయలుండగా,గచ్చిబౌలిలో, నానక్‌రామ్‌గూడలో 50 నుంచి 55 రూపాయలు ఉందని తెలిపారు. ఐటీ రంగం ఆశించిన మేర విస్తరించనప్పటికీ ఉత్పాదన, ఇతర రంగాలు 17 నుంచి 27 శాతానికి అభివృద్ధి చెందుతున్నందున బిజినెస్ సెంటర్లకు డిమాండ్ పెరిగిందని శాంసన్ ఆర్థర్ చెప్పారు.



దేశంలోని మొత్తం ఎనిమిది నగ రాల్లో గత ఏడాది గృహ అమ్మకా ల్లో ఆరు శాతం వృద్ధి కనిపించింది. కస్టమర్లను ఆక ర్షించేందుకు డెవలపర్లు ధరలు త గ్గించడమే కాకుండా పరోక్షం గా డి స్కౌంట్లతో ఆఫర్ల వర్షం కురిం పిం చారని స్థిరాస్తుల కన్సెల్టెంటట్ నైట్ ఫ్రాంక్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో వెల్ల డించిం ది. ఆరు నగరాల విషయానికి వస్తే ఢిల్లీ - ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూ రు, చెన్నై, హైదరాబాద్‌లలో అమ్మ కాలు పెరి గితే... కోలకతా, పూనేలలో అమ్మకాలు తగ్గాయి. అమ్ముడు పోకుండా నిలిచిపోయిన గృహాలు 11 శాతం తగ్గి 4.7 లక్షల యూనిట్ల కు దిగివచ్చా యి. అ యితే ఇతర స్థిరాస్థి కన్సెల్టెం ట్లు ఉదాహరణకు జెఎల్ ఎల్ ఏడు నగరాల్లో అమ్మ కాలు 47 శా తం పెరిగాయని పేర్కొనగా.. అనెరాక్ మాత్రం 7 నగ రాల్లో 16 శాతం, ప్రాపై గర్ విష యానికి వస్తే మొ త్తం 9 నగరాల్లో అమ్మకాలు 25 శాతం వరకు పెరిగాయన్నారు.

హైదరాబాద్‌లో ఇండియాసాఫ్ట్ ఎక్స్‌పో



హైదరాబాద్, న్యూఢిల్లీ ,ఆంధ్రప్రభ : ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) ఫిబ్రవరి 4, 5 తేదీల్లో ఇండియా సాఫ్ట్-2019ని నిర్వహించనుంది. హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ ఎగ్జిబిషన్, సదస్సులో 60 దేశాలకు చెందిన ఐటీ కంపెనీలు, 500 మంది ఐసీటీ కొనుగోలుదారులు పాల్గొంటారని ఇండియా సాఫ్ట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్ నళిన్ కోహ్లి మంగళవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో ఇండియా సాఫ్ట్ సీఈవో డికె షరీన్, ఎస్టీపీఐ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనే కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి, మార్కెట్ ఒప్పందాలు చేసుకుంటాయని కోహ్లి చెప్పారు. ఇందులో 250 మేరకు భారతీయ ఐటీ సంస్థలు, 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఆయన చెప్పారు. విదేశీ ఐటీ సంస్థలు ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం, భారత ఐటీ రంగానికున్న ప్రాధాన్యతను తెలుపుతుందని ఆయన అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎస్ఎంఈ)లపై దృష్టి సారించామన్నా రు. దేశీయ ఎంఎస్‌సీలను ప్రోత్సహించేవిధంగా ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని, ఇందులో పాల్గొనే ఈ తరహా కంపెనీలకు రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీ రంగంలో వృద్ధికి ఎంతో అవకాశం ఉంటుందని, కొత్త మార్కెట్ల అన్వేషణకు ఈ ఎగ్జిబిషన్ దోహదపడుతుందని కోహ్లి ఆశాభావం వ్యక్తంచేశారు.ఇండియా సాఫ్ట్ సీఈవో షరీన్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరం ఐటీ ఎగుమతులు 8 శాతం వృద్ధి సాధించనున్నాయని చెప్పారు. భారతీయ ఐటీ ఉత్పత్తుల్లో 60 శాతం అమెరికాకు, 20 శాతం యూరప్ దేశాలకు, మిగిలిన 20 శాతం ఇతర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఆఫ్రిక, మధ్య ప్రాశ్చ్యా దేశాల మార్కెట్‌పై దృష్టి సారించామని, మన ఉత్పత్తులకు అక్కడ మంచి మార్కెట్ ఉంటుందని షరీన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో వెనుకబడి ఉన్నామని, చైనాదే అగ్రస్థానమని అన్నారు. అయితే ఆ దేశం నుంచి కొన్ని కంపెనీలు బయటకు వెళుతున్నాయని, వాటిని భారత్ వైపు రప్పించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు.

ఎగుమతుల్లో 10% వృద్ధి

దేశం నుంచి ఐటీ, ఐటీఈఎస్ ఎగుమతులు ఈ ఆర్థిక సంవత్సరం ఎనిమిది నుంచి పది శాతం వరకు వృద్దిని సాధించే అవకాశాలున్నాయని ఈసీఎస్ మంగళవారం నాడు పేర్కొంది. వాణిజ్యమంత్రిత్వశాఖ కింద పనిచేసే ఎలక్ట్రానిక్స్... కంప్యూటర్ స్టాఫ్ట్‌వేర్ ఎగుమతుల ప్రోత్సాహక కౌన్సిల్ (సీఎస్ఈ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీ కె సరీన్ ఎగుమతల గురించి వివరణ ఇస్తూ.. సోలార్ పవర్ ఎలక్ట్రానిక్స్, యూపీఎస్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ ఎనర్జీ మీటర్లు కొత్త కొత్త ప్రాంతాల్లో వినియోగంలోకి రావడంతో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్‌కు మంచి ఊపు వచ్చిందని.. సుమారు ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు వృద్ధి కనిపించవచ్చునని ఆయన అన్నారు. అయితే ఐటీ, ఐటీఈఎస్ ఎగుమతుల గణాంకాలపై స్పష్టత రావాలంటే రిజర్వుబ్యాంకు పూర్తిస్థాయిలో గణాంకాలను విడుదల చేస్తేనే కానీ పక్కాగా లెక్కలు చెప్పలేమని ఆయన తెలిపారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాలు ఎగుమతులు జోరందుకున్నాయని, అంచనా కంటే కూడా ఎగుమతుల పరిస్థితి మెరుగ్గా నే ఉందన్నారు. మొతానికి చూస్తే ఐటీ ఎగుమతులు ఈ ఏడాది 8 నుంచి 10 శాతం వరకు ఉంటుందని ఇక్కడ జరుగుతున్న ఒక కార్యక్రమంలో సీఎస్ఈ అధికారులు తెలియజేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఐటీ రంగానికి చెందిన నాస్కామ్ మాత్రం ఈ ఆర్థిక సంవత్సరం ఐటీ ఎగుమతులు 7 నుంచి 8 శాతం వృద్ధితో 137బిలియన్ డాలర్లు సాధించవచ్చునని అంచనా వేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్స రంలో ఎగుమతులు 126 బిలియన్ డాలర్ల వరకు జరిగాయి. గత మూడు సంవత్సరాల నుంచి హార్డ్వే ర్ ఎలక్ట్రానిక్ విడిభాగాల ఎగుమతులు మందగించ డానికి గల కారణాలపై సరీన్ వివరిస్తూ.. దీనికి పలు కారణాలున్నాయని.. వాటిలో చెన్నైలో నోకియా తయారీప్లాంట్‌మూతపడ్డం ఒక కారణంగా వివరిం చారు. వరుసగా గత రెండు నుంచి మూడు సంవత్స రాల పాటు హార్డ్‌వేర్ ఎగుమతులు మందగించడంతో ఈ ఆర్థిక సంవత్సరం తమ అంచనా ప్రకారం 7 నుంచి 8 శాతం వరకు వృద్ధిని సాధించవచ్చున్నారు.

బ్యాంక్ షేర్ల జోరు!

• గ్లోబల్ మార్కెట్ల అండ
• 130 పాయింట్ల వృది
• మూడో రోజు లోభాల్లోనే



ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. మంగళవారం మదుపరులు బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లను పెద్దెత్తున కొనుగోలు చేశారు. మార్కెట్లోకి పెద్దమొత్తం లో విదేశీ పెట్టుబడులు రావడంతో పాటు గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడం తదితర అంశాలు మార్కెటలకు బాగా కలిసొ చ్చాయి. మొత్తానికి మార్కెట్ ముగిసే నాటికి సెన్సెక్స్ 130 పాయిం ట్లు లాభపడి 35,980.93 వద్ద, నిఫ్టీ 30.35 పాయిం ట్లు పెరిగి 10,802.15 వద్ద ముగిసాయి. మంగళవారం నాటి ట్రేడిం గ్ సరళిని గమనిస్తే.. ప్రారంభం నుంచి ట్రేడింగ్ అంతా నష్టాల తోనే కొనసాగింది. గత రెండు రోజుల నుంచి మార్కె ట్లు దూసుకుపోవడంతో ఇన్వె స్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సూచి కుంగింది. అయితే మార్కెట్ ముగిసే చివరి గంటలో ఇన్వెస్టర్లు పెద్దమొ త్తంలో షేర్లు కొనుగోలు చేయడంతో ఉదయం నుంచి కొనసాగిన నష్టాలు మటుమాయం అయ్యి సూచి ఏకంగా 36,037.35 మార్కుకు ఎగబాకింది. ఎట్టకేల కు సెన్సెక్స్ 0.36 శాతంతో లాభపడింది. వరుసగా గత రెండు ట్రేడింగ్ సెషన్‌లలో సెన్సెక్స్ 336.45 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ 0.28 శాతం లాభపడి ఇంట్రాడేలో 10,730.25వద్ద కనిష్ఠానికి, 10,818.45 గరిష్ఠానికి ఎగబాకింది.

మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం బ్యాంకు షేర్లలో ర్యాలీ ఏర్పడ్డానికి ప్రధాన కారణం సోమవారం నాడు రిజర్వుబ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్ బ్యాంకింగ్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో మొం డిబకాయిలు క్రమంగా తగ్గముఖం పడుతున్నాయని, ద్రవ్యలభ్యతకు ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రకటించడంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడిందన్నారు. ఇక ఇన్వెస్టర్ల దృష్టి అంతా కార్పొరేట్ ఫలితాలు, అమెరికా - చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్య సమావేశాలపై ఉంది. ఈ వారంలోనే ఐటి దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఇక డాలర్ మారకంతో రూపాయి 70 మార్కను దాటిపోయింది. అయితే సోమవారం నాడు కేంద్ర గణాంకాల కార్యాలయం ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతం సాధిస్తుందని అంచనా వేయడం కూడా మార్కెట్లకు కిక్కు ఇచ్చింది. వ్యవసాయరంగంతో పాటు తయారీరంగం పుంజుకోవడంతో దాని ప్రభావం వృద్ధిరేటుపై కనిపిస్తుందని సీఎస్ఓ నివేదికలో పేర్కొంది.

బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లలో సన్‌ఫార్మా అగ్రస్థానంలో ఉంది. 3.98 శాతం వృద్దిని సాధించింది. తర్వాత స్థానం ఐసీఐసీఐ బ్యాంకు 3.46 శాతం మిగిలిన షేర్లు ఇలా ఉన్నాయి. టాటామో టార్స్ 2.34 శాతం ఎస్‌బీఐ, ఎస్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, బజాజ్‌ఆటో, ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 3.18 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లలో కొటక్‌బ్యాంకు, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్‌ఎం షేర్లు 1.41 శాతం వరకు ఉన్నాయి. గృహ ఫైనాన్స్, బంధన్ బ్యాంకు షేర్లు మంగళవారం నాడు భారీగా కుంగాయి. ఈ రెండు సంస్థలు విలీనం అవుతున్నట్లు ప్రకటించి న విషయం తెలిసిందే. గృహ ఫైనాన్స్ 16.39 శాతం వరకు నష్టపోయింది. ఇదిలాఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో షేర్లు కొనుగోలు చేయడం కూడా మార్కెట్ సెంటిమెం ట్‌కు తోడైంది. ఇదిలా ఉండగా సోమవారం విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.736.18 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరు లు రూ. 141.97 కోట్లు విక్రయించినట్లుస్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. బీఎస్ఈలో బ్యాం కింగ్, హెల్త్‌కేర్, పీఎస్‌యు, మెటల్, ఆటో, ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, ఎఫ్ఎంసీజీ, టెక్‌షేర్లు లాభాలతో ముగియ గా.. క్యాపిటల్ గూడ్స్, విద్యుత్, కన్స్యూమర్ డ్యూరబు ల్స్, ఐటి, చమురు సహజవాయువు రంగానికి చెందిన సూచిలు నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లు లాభాలతో ముగి శాయి. అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చ లు సఫలం అవుతాయన్న అంచనాయే కారణం. దీం తో పాటు ఐరోపా మార్కెట్లు కూడా లాభాలతోనే ముగి శాయి.



హైదరాబాద్ ఖ్యాతి పెంచేలా అంతర్జాతీయ పతంగుల పండుగ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వీట్ ఫెస్టివల్ పేరుతో ఈనెల 13నుండి 15 వరకు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే అంతర్జాతీయ పతంగుల పండుగ -2019ను హైదరాబాద్ నగర ఖ్యాతిని ఇనుమడించేలా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె జోషి ఆదేశించారు. అంతర్జాతీయ పతంగుల పండుగ, అంతర్జాతీయ మిఠాయిల వేడుకల నిర్వహణపై మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ 3లక్షల మంది సందర్శకులకు తగినట్లుగా ఏర్పాట్లు ఉండాలన్నారు. బ్యారికేడింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, బందోబస్తు, మంచినీటి సరఫరా, వైద్యసేవలు అందించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ద్వారా స్వచ్ఛ సర్వేక్షణపై ప్రచారం నిర్వ హించాలన్నారు. పర్యాటక శాఖ కార్యదర్శి బి వెంకటేశం మాట్లాడుతూ కైట్ ఫెస్టివల్‌కు వచ్చే సంవత్సరానికి హైదరాబాద్‌లో అతిపెద్ద పండుగగా ఉండేలా కృషి చేస్తున్నా మన్నారు. 20దేశాలనుండి 50 మంది పతంగులు ఎగురవేసే నిపుణులు పాల్గొంటారని, వివిధ రాష్ట్రాల మహిళలు 1000 రకాల మిఠాయిలు ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా మిఠాయిలు తయారు చేస్తారని తెలిపారు. సాంప్రదాయ దుస్తులతో పాల్గొంటారని అన్నారు. ప్రతిరోజూ సాస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వేడుకలకు దాదాపు 10లక్షల మంది సందర్శిస్తారని వెల్లడించారు.

విశాఖలో నేడు గవర్నర్ పర్యటన

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ మంగళవారం విశాఖ చేరుకున్నారు. మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయంలో గవర్నర్‌కు సాదర స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, నేవీ పోలీస్ అధికారులు గవర్నర్‌ను సాదరంగా స్వాగతించారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. అనంతరం ప్రోటోకాల్ మర్యాదలు స్వీకరించారు. బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో గవర్నర్ పాల్గొంటారు. వివిధ రంగాల్లో సేవలందించిన సుమారు 80 మందికి గవర్నర్ చేతులు మీదుగా అవార్డులు ప్రధానం చేయనున్నారు. సాయంత్రం ఆంధ్రా యూనివర్శిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 85, 86 స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. తదుపరి స్కాలర్లు, వివిధ రంగాల విద్యార్థులకు మెడల్స్, పట్టాలు ప్రదానం చేస్తారు. గవర్నర్ రాక సందర్భంగా విశాఖ జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

మైనారిటీ బాలికావిద్యకు హజ్ నిధులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: హజ్ సబ్సిడీ కి వినియోగించే నిధులను మైనారిటీ బాలికల విద్యకు కేటాయించేందుకు కేంద్రం ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మంగళవారం రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. హజ్ సబ్సిడీని క్రమంగా తగ్గించి, ఎత్తివేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుందని కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. ఇందులో భాగంగా 2012-13 లో 836.56 కోట్ల నుంచి 2017-18 లో 210.63 వరకు తగ్గించారని వివరించారు. 2018లో హజ్ సబ్సిడీ పూర్తిగా ఆపి వేశామని వెల్లడించారు. హజ్ సబ్సిడీ నిధులను మైనారిటీ బాలికల విద్యకు ఖర్చు చేస్తామని తెలిపారు.

నదుల అనుసంధానం ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు అవసరమా?

- కేంద్ర పర్యావరణ శాఖను ప్రశ్నించిన జాతీయ హరిత ట్రిబ్యునల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానంపై నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ శాఖకు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం నదుల అనుసంధానం పేరుతో రాష్ట్రంలో అక్రమ ప్రాజెక్టులు కడుతున్నారంటూ మాజీ మంత్రి వట్టి వసంత్, త్రినాథ్ రెడ్డి దాఖలు చేసిన పిటీషన్లను ఎన్‌జిటి విచారించింది. జస్టిస్ గోయల్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ బెంచ్ విచారణ జరిపింది. గోదావరి డెల్టాకు నష్టం జరుగుతున్నా పట్టించుకోకుండా నదుల అనుసంధానం చేస్తున్నారని పిటీషనర్లు పేర్కొన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడి, గోదావరి - కృష్ణా - పెన్నా అనుసంధాన ప్రాజెక్టులకు, వైకుంఠపురంలోని గోదావరి - పెన్నా లింక్ ప్రాజెక్టుకుల పర్యావరణ అనుమతులు అవసరమా? కాదా ? చెప్పాలని కేంద్రానికి ఎన్జీటీ ఆదేశాలిచ్చింది. ఈఐఏ నోటిఫికేషన్ కింద ఈ ప్రాజెక్టులను చేపట్టవచ్చా లేదా అనే అంశంపై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కోరింది.

కోటిపల్లి- నర్సాపూర్ రైల్వే పనులు వేగవంతం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోటిపల్లి - నర్సాపూర్ మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రైలులైను అమలాపురం, పేరూరు, పాశర్లపూడి, జగ్గన్నపేట, రాజోలు ప్రాంతాలను కలుపుతూ నర్సాపూర్ వెళ్తుంది. మొత్తం రూ.2,120 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ నిధుల్లో ఇప్పటి వరకు 2014 -19 మధ్య కాలంలో రూ.323 కోట్లు వ్యయం చేశారు. మొత్తం మూడు దశల్లో ఈ రైల్వేలైను ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. మొదటి దశలో నర్సాపూర్ - చించినాడ (పది కిలోమీటర్లు), రెండవ దశలో కోటిపల్లి - అమలాపురం (12.70 కిలో మీటర్లు), మూడవ దశలో అమలాపురం - చించినాడ (33.88 కిలోమీటర్లు) పనులను పూర్తి చేస్తారు. ఈ మార్గంలో గౌతమీ, వైనతేయ, వశిష్ట నదులపై మూడు రైల్వే వంతె నలను నిర్మించనున్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు కృషి

- కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ: మోహన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి తెలిపారు. తాను రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. తనకు తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్, తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్, తెలంగాణ ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ మద్దతు ప్రకటించాయని తెలిపారు. మంగళవారం మోహన్‌రెడ్డి తనకు మద్దతు ప్రకటించిన సంఘాల నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 26 సంవత్సరాలపాటు పీఆర్‌టీయులో అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించానని గుర్తు చేశారు. అంతేకాకుండా జాక్టో చైర్మన్‌గా కూడా కొనసాగినట్టు చెప్పారు.

మామిడిపల్లి విద్యుత్ లైన్ల మార్పిడి

హై దరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మామిడిపల్లి-శివరాంపల్లి 220కెవి విద్యుత్ లైన్‌తోపాటు మరో మూడు విద్యుత్‌లైన్ల మార్పిడి చేపడుతున్నట్టు ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ టి.జగత్ రెడ్డి తెలిపారు. విద్యుత్ సరఫరా సామర్ధ్యాన్ని పెంచేందుకు చేపట్టిన ఈ పనుల వల్ల ఏదైనా సరఫరాలో అంతరాయం జరిగితే అందుకు వినియోగదారులు సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. మాడిమిపల్లి-శివరాం పల్లిలైన్ ఈనెల 11నుంచి31 మధ్యలో మార్పిడి చేయనున్నారు. అదేవిధంగా హెచ్ఐఏఎల్ -మామిడిపల్లి వన్‌లైన్ 24నుంచి 31మధ్య మార్చనున్నారు. హెచ్ఐఏఎల్ -శివారాంపల్లి లైన్ ఫిబ్రవరి 1నుంచి 15మధ్యలో మార్చనున్నారు. హెచ్ఐఏఎల్ -మామిడిపల్లి లైన్ ఫిబ్రవరి 5నుంచి 10లోపు మార్చనున్నారు.

బీసీ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల్లో(బీసీ)ని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను ఇవ్వనున్నట్టు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన శిక్షణను అపోలో మెడ్ స్కిల్స్ ద్వారా ఇవ్వనున్నట్టు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణను జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ప్లేబాటమీ టెక్నిషియన్ ఉద్యోగాల కోసం శిక్షణకు 50 మందిని ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. వారికి మంగళవారం నుంచే శిక్షణను ప్రారంభించినట్టు స్పష్టం చేశారు.

కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామాలకు మృతదేహాలు • కన్నీటి సంద్రమైన గ్రామాలు





మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప భక్తులకు కుటుంబసభ్యులు, గ్రామస్తులు చివరి కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తుల రోదనలతో మృతుల స్వగ్రామాలు తల్లడిల్లాయి. తమిళనాడులోని పుదుకొట్టై ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సాపూర్ మండలం ఖాజిపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట గ్రామాలకు చెందిన 9 మంది అయ్యప్ప భక్తుల మృతదేహాలు మంగళవారం సాయంత్రం స్వగ్రామాలకు చేరాయి. విగతజీవులుగా పడివున్న తమవారిని చూసి కుటుంబసభ్యులు, గ్రామస్తులు భోరున విలపించారు. కడసారిగా తమవారిని చూసి కన్నీటితో వీడ్కోలు పలికారు. కాగా ఆయా గ్రామాలకు చెందిన మృతదేహాలను వేర్వేరుగా తరలించి గ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించారు. తమిళనాడులో మృతి చెందడంతో అక్కడి ఆసుపత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించి 9 అంబులెన్సులలో నర్సాపూర్‌కు తీసుకువచ్చారు.

నర్సాపూర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే నివాళులు..

తమిళనాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప భక్తుల మృతదేహాలను అంబులెన్సులలో నర్సాపూర్‌కు తీసుకురావడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో ప్రధాన రోడ్డు ప్రాంతం కిక్కిరిసి పోయింది. మృతదేహాలునర్సాపూర్ చేరుకోగానే ఒక్కసారిగా రోదనలతో మిన్నంటింది. మృతులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, టీఆర్ఎస్ నేత మురళీయాదవ్ నివాళులు అర్పించారు. అక్కడి నుంచి అంతిమయాత్ర నిర్వహించి వారి స్వగ్రామాలకు తరలించారు.

ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తా..ః ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తమిళనాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప భక్తుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకనేందుకు చర్యలు తీసుకుంటామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీనిచ్చారు. నర్సాపూర్‌లో మృతులకు నివాళులు అర్పించి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వారి కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతానని హామీనిచ్చారు. ఎంపీ వెంట ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఉన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగ రద్దీ సందర్భంగా హైదరాబాద్ - తిరుపతి మధ్య ప్రత్యేక రైలును దక్షిణమధ్య రైల్వే నడపనుంది. ఈనెల 12న హైదరాబాద్ తిరుపతి ప్రత్యేక (ట్రైన్ నెంబర్ 02764) రైలు హైదరాబాద్ స్టేషన్ నుండి సాయింత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు తిరుపతి చేరుకుంటంది. తిరిగి తిరుపతి హైదరాబాద్ (ట్రైన్ నెంబర్ 02763) తిరుపతి స్టేషన్ నుండి సాయింత్రం 5 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

అడవుల రక్షణే ధ్యేయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ:అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి అడవుల పర్యావరణ రక్షణే ధ్యేయంగా పనిచేయాలని అటవీశాఖ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పి. కె. ఝా సూచించారు. చెట్లు నరికివేత, కలప అక్రమ రవాణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే పోలీసుల సహకారంతో పీడీ చట్టం కింద కేసులు పెట్టాలని ఆయన ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా అటవీ అధికారులతో పి.కె. ఝా సమీక్ష నిర్వహించారు.. నేరగాళ్లు, స్మగ్లర్లను గుర్తించి వారిపై నిరంతరం నిఘా పెట్టాలని ఆయన సూచించారు. అడవులను కాపాడటం వలన జరిగే లాభాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే సీజన్‌లో హరితహారం కోసం నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని, వెదురు, టేకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పీసీసీఎఫ్‌లు రఘువీర్, వృద్ధీరాజ్, సి.ఎం. ఓఎస్డీ ప్రియంకా వర్గీస్, అదన పు పీసీసీఎఫ్‌లు లోకేశ్ జైస్వాల్, ఆర్,ఎం.డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భారత్ నెట్ బేర్..

- లక్ష్యాలను చేరుకోలేకపోతున్న డిజిటల్ ఇండియా
- అధికారుల మధ్య సమన్వయలోపంతో నత్తనడక
- నాసిరకం పరికరాల బిగింపుతో సర్వీస్ నిల్
- గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీకి అవాంతరాలు
- బీఎస్ఎన్ఎల్, బీబీఎన్ఎల్, టెలికాం శాఖకు పీఎంవో మెమో



న్యూఢిల్లీ: గ్రామీణ భారతాన్ని డిజిటలైజ్ చేసే ఉద్దేశంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ నెట్ ప్రాజెక్టు ఆశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. ప్రభుత్వ రంగ సంస్థ మధ్య సమన్వయ లోపం.. ఎవరికి వారు తమపరిధిని గిరిగీసుకోవడంతో ముందడుగు పడటం లేదు. దేశంలోని 2 లక్షలకు పైగా గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్ నెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రధాని మోడీ పదేపదే ప్రస్తావిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈనేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం బీఎస్ఎన్ఎల్, బీబీఎన్ఎల్, టెలికాం శాఖ కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. డిజిటల్ ఇండియాకు వెన్నుముఖ లాంటి ఈ ప్రాజెక్టును ప్రజలకు చేరువచేయడంలో అధికారులు విఫలమౌతున్నారని ప్రధానమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ నృపేంద్ర మిశ్రా రుసరుసలాడినట్లు తెలుస్తోంది. ఇటీవల బీఎస్ఎన్ఎల్, భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్ వర్క్ లిమిటెడ్(బీబీఎన్ఎల్) టెలికాం సెక్రటరీ అరుణ్ సుందర్‌రాజన్‌కు పీఎంవో నుంచి మెమో జారీ కావడంతో ఈ విషయం బయటపడింది. ప్రధానమంత్రి కార్యాలయంలోని ముఖ్య పరిశీలకులు భారత్ నెట్ ప్రాజెక్టు కోసం పనిచేస్తున్న అధికారులతో ఎప్పటికప్పుడు భేటీ అయి ..ప్రాజెక్టు పురోభివృద్ధిపై చర్చించినప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించలేదని మెమోలో పేర్కొన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టును విజయవంతం చేయడంలో అధికారుల్లో సమన్వయలోపం కూడా ప్రధాన కారణంగా పీఎంవో గుర్తించింది. దేశంలోని 2.5 లక్షల గ్రామా లకు వేగవంతమైన ఇంటర్ నెట్ సౌకర్యాన్ని అందించాలనే లక్ష్యంతో భారత్ నెట్ ప్రాజెక్టును ప్రారంభించినప్పటికీ అది ఆశించిన స్థాయిలో వర్కౌట్ కాలేదని పీఎంవో సీరియస్ అయినట్లు సమాచారం.

డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దేశంలోని అన్ని గ్రామాలు, గ్రామ పంచాయతీలకు ఇంటర్ నెట్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. దేశంలోని 1.1 లక్షల గ్రామ పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు గతేడాది ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ చీఫ్ సుందరరాజన్, బీబీఎన్ఎల్ చీఫ్ సంజయ్ సింగ్ మధ్య వరుసగా ఉత్తర,ప్రత్యుత్తరాలు నడిచాయి. 1.1 లక్షగ్రామాలకు ఇంటర్ నెట్ ఏంటీ అన్నది వారి ఉత్తరాల్లో ఉత్పన్నమైన ప్రశ్న. వీటిలో 50 శాతం గ్రామాల్లో నెట్ సౌకర్యం కల్పించినా నాణ్యతా ప్రమాణాలు పాటించ కపోవడం.. అమర్చిన పరికరాలు నాసిరకానికి కావడంతో నెట్ సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో బీఎస్ఎన్ఎల్ చీఫ్‌కు గతనెల మెమో జారీ అయ్యింది. బీఎస్ ఎన్ఎల్, బీడీఎన్ఎల్ సీఎండీలు తమ ఆదేశాలకు అనుగుణంగా కలిసికట్టుగా పనిచేయకపోవడంపై పీఎంవో సీరియస్ అయింది.

ఓ నివేదిక ప్రకారం దేశంలోని 2.5 శాతంకంటే తక్కువ గ్రామ పంచాయతీల్లో వాణిజ్య బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్ల కోసం ప్రభుత్వం 12 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో విఫల

12 వేల కోట్లు బుగ్గిపాలు

మైనట్లు తేలింది. మొబైల్ కనెక్టివిటీ లేని గ్రామాల్లో కూడా ఇంటర్ నెట్ సౌకర్యాన్ని కల్పించడంలో అధికారులు విఫలమైనట్లు వెల్లడైంది.

పనిచేయని ఓఎన్‌టీలు

గ్రామీణ ఇంటర్ నెట్ కోసం ఏర్పాటు చేసిన ఆప్టికల్ నెట్ టర్మినల్‌లు(ఓఎన్‌టీ) పనిచేయకపోవడం.. పనిచేసినా అంతరాయాలు ఏర్పరడం వంటి అంశాలపై పీఎంవో వీరిద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓఎన్‌టీలు సరిగ్గా పనిచేయకపోవడం, ఎక్కువ ఫిర్యాదులు నమోదు కావడంతో పీఎంవోకు చిర్రెత్తుకొచ్చింది. దేశంలోని 1.15 లక్షల గ్రామాలకు భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఇంటర్నెట్ సదుపాయాన్నికల్పించినట్లు ప్రభుత్వం ఒకవేళ ప్రకటించుకున్నా..50 శాతం కంటే ఎక్కువ గ్రామాల్లో అసలు సర్వీసులు పనిచేయడం లేదన్నది ప్రధాన ఫిర్యాదుగా తెలుస్తోంది.భారత్ నెట్ ప్రాజెక్టు నిర్వహణలో బీఎస్ఎన్ఎల్ ఎందుకు విఫలమైందన్న టెలి కమ్యూనికేషన్ శాఖ లేవనెత్తిన ప్రశ్నకు బీఎస్ఎన్ఎల్ సమాధానం వింతగా ఉంది. 80-90 శాతం గ్రామపంచాయతీల్లో ఇంటర్ నెట్ వినియోగం ఆశించిన స్థాయిలో లేదని.. తాము పెట్టుకున్న లక్ష్యానికంటే 10 శాతం తక్కువే ఇంటర్ నెట్ వాడుతన్నట్లు అర్థమైనట్లు పేర్కొన్నారు. భారత్ నెట్ పనితీరు తెలుసుకోవడం చాలా సులభం. కేంద్ర ప్రభుత్వం ఎక్కడికక్కడ ఓపెన్ యాక్సెస్ ఆప్టికల్ ఫైబర్ ఇంటర్ నెట్ కేంద్రాలను నిర్మిస్తుంది. టెలికాం కంపెనీలు బీఎస్ఎన్ఎల్ నుంచి బ్యాండ్ విడ్త్‌ను కొనుగోలు చేసి సేవలను అందిస్తాయి. అయితే అసలు విషయం ఏటంటే దాదాపు 60 వేల ఆప్టికల్ నెట్ టర్మినల్‌లు సరిగ్గా పనిచేయడం లేదు. దీంతోనే ప్రైవేట్ కంపెనీలు కూడా భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఆప్టికల్ ఫైబర్ నెట్ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రాజెక్టు పేలవ ప్రదర్శనపై పీఎంవో సీరియస్ అవడంతో బీఎస్ఎన్ఎల్, బీబీఎన్ఎల్ సంస్థలు తప్పు మీదంటే మీదంటూ ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి. గ్రామపంచాయతీలకు నెట్ కనెక్టివిటీలో ఎదురయ్యే అవాంతరాలకు తొలగించి..నిర్వహించడమే తమ పని అని గతేడాది నవంబర్‌లో ఐటీ శాఖకు రాసిన లెటర్‌లో బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. విద్యుత్ సరఫరా, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ తదితర విషయాలన్నింటినీ చూసుకోవాల్సింది బీబీఎన్ఎల్ పనేనం టూ ఉటంకించింది. బీబీఎన్ఎల్ తప్పు వల్లే భారత్ నెట్ ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఫలితాలను రాబట్ట లకపోవచ్చు ఝంటూ తమ లేఖలో అభిప్రాయపడింది. మొత్తానికి తప్పెవరిదైనా ప్రజాధనానికి మాత్రం భారీగా గండిపడింది. మా పని కాదంటే..మా పని కాదంటూ టెలికాంసంస్థలు మీనమేషాలు లెక్కించడంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్‌గా గీతా గోపీనాథ్



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనామిస్ట్‌గా భారత్‌లోని కర్ణాటక రాష్ట్రానికి చెందిన గీత గోపీనాథ్ నియమితుల్యయారు. ఐఎంఎఫ్ లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా గీత ఘనత సాధించారు. గీతా ఐఎంఎఫ్ కు 11వ చీఫ్ ఎకనామిస్ట్. గీత హార్వర్డ్ యూనివర్శిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ లో ఇంటర్నేషనల్ ఫైనాన్స్, మాక్రో ఎకనామిక్స్ ప్రోగ్రామ్ కో డైరక్ట్ గా కూడా గీత వ్యవహరిస్తున్నారు. కేరళ సీఎం ఆర్థికసలహాదారుగా కూడా గీత గోపీనాథ్ వ్యవహరిస్తున్నారు. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరక్టర్ గా పనిచేసిన మౌరీ అబ్‌స్టెఫెల్డ్ డిసెంబర్ 31న పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత గీతకు చీఫ్ ఎకనామిస్ట్‌గా పదవి దక్కింది. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీత ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో గీత ఒకరని, అక్టోబర్ 2018లోనే గీతను ఐఎమ్ఎఫ్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ఎకనామిక్ కౌన్సిలర్, డైరక్టర్ గా ఐఎంఎప్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే నియమించారు. 1971 డిసెంబర్ 8న మైసూర్ లో జన్మించిన గీత మైసూర్ లోని నిర్మలా కాన్వెంట్ స్కూల్ లో పాఠశాల విద్యనభ్యసించింది. లేడీ శ్రీరామ్ కాలేజ్ ఫర్ ఉమెన్(ఢిల్లీ యూనివర్శిటీ),లో 1992లో బీఏ పట్టా అందుకొంది. 1994లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎకనామిక్స్ లో మాస్టర్స్ పట్టా పొందింది. 1996లో వాషింగ్టన్ యూనివర్శిటీలో ఎమ్ఏ పూర్తి చేసింది.2001లో ప్రిన్సిటాన్ యూనివర్శిటీలో పీహెచ్ డీ పూర్తి చేసింది.

జీబీ రాజ్యాంగ హోదాపై తీర్పు రిజర్వు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సుప్రీంకోర్టు పాక్ ఆక్రమిత కాశ్మీర్లో గిల్గిట్-బల్టిస్థాన్ (జీబీ) రాజ్యాంగ హోదాకు సంబంధించిన తీర్పును రిజర్వులో ఉంచింది. జీబీ నివాసితులకు ప్రాథమిక హక్కులను పాక్ సుప్రీం మంజూరు చేసింది. పాక్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సకీబ్ నిసార్‌తో కూడిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గిల్గిట్-బాల్టిస్థాన్ ఆర్డర్ 2018, గిల్గిట్ -బాలిస్థాన్ సాధికారత, స్వీయ పరిపాలన ఉత్తర్వులు 2009ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పాక్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సకీబ్ నిసార్ నేతృత్వంలోనిఏడుగురు న్యాయమూర్తులు ధర్మా సనం విచారణ చేపట్టింది. వారు ఎంపిక చేసిన ప్రతినిధుల ద్వారా ఈ ప్రాంత పాలన జరుగుతుందని డాన్ నివేదించింది.కాగా గిల్గిట్-బాల్టిస్థాన్ ఆర్డర్ 2018పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొంతమంది ఆందోళనకారులు పిటిషన్ వేశారు. వీరు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిల్గిట్-బాల్టిస్థాన్ ఆర్డర్ 2018కు బదులుగా రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. వీరి పిటిషన్లను విచారించిన పాక్ సుప్రీంకోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది. కాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను పాకిస్థాన్ రెండు పరిపాలనా భాగాలుగా విడదీసింది.

విద్యార్థులతో మోడీ 'పరీక్షా పే చర్చా'




న్యూఢిల్లీ: విద్యార్థుల్లో టెన్షన్ తగ్గించేందుకు స్కూలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో దాదాపు ఏడాది తర్వాత ప్రధాని మోడీ మరోసారి ఈనెల 29న భేటీ కానున్నారు. తల్కతోరా స్టేడియంలో జరిగే ఈ చర్చా కార్యక్ర మంలో పిల్లలతో ప్రధాని ముఖాముఖీ మాట్లాడటంతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా వేలాది మంది పిల్లలతో సంభాషి స్తారు. పరీక్షలు, జీవితం, ఇంకా ఎన్నో విషయాలపై చర్చ జరుగుతుందని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వి ఓ ట్వీట్‌లో తెలియజేశారు. చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొంటున్నందున దీన్ని వీక్షించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని పాఠశాలలకు ఆదేశాలివ్వాలని సీబీఎస్‌సీని ప్రభుత్వం కోరింది.

రాజస్థాన్‌లో 200 ఎంవోయూలు రద్దు

జైపూర్: రాజస్థాన్‌లో బీజేపీ పరిపాలన కాలంలో సంతకం చేసిన 200 అవగాహన ఒప్పందాలను (ఎంవోయూలు) సీఎం గెహ్లాట్ ప్రభుత్వం రద్దు చేసింది. 2015లో రాజస్థాన్‌లో జరిగిన పెట్టుబడిదారుల సమ్మేళనం సందర్భంగా గత బీజేపీ ప్రభుత్వం వివిధ కంపెనీలతో 200ఎంవోయూలను కుదుర్చుకుంది. వీటిని గెహ్లాట్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ సందర్భంగా పారిశ్రామిక శాఖ మంత్రి పారసడీ లాల్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడి పెడతామని ఆయా కంపెనీలు చేసిన వాగ్దానాలు కార్యారూపం దాల్చలేదన్నారు. సమ్మేళనంలో మునుపటి ప్రభుత్వం 470 ఎంవోయూలపై సంతకాలు చేయగా వాటిలో 120కంపెనీలు మాత్రమే పెట్టుబడులు పెట్టాయని లాల్ అన్నారు. 2015లో జరిగిన సమావేశంలో సుమారు రూ.3లక్షల కోట్లు మేరకు ఎంవోయూలు జరిగితే కేవలం 10శాతంకంటే తక్కువగా 12వేలకోట్ల మేరకే కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని మంత్రి లాల్ తెలిపారు.

మహిళల స్వీయ రక్షణపై శిక్షణ

- ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రణబ్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా మహిళలపై నేరాలు పెరిగి పోతున్న తరుణంలో వారిలో చైతన్యాన్ని పెంపొం దించేందుకు చాణక్య ఫౌండేషన్ చర్యలు చేపడుతోంది. నానాటికీ పెరుగుతున్న నేరాల నియంత్రణకు, స్వీయ రక్షణ విద్యల్లో ఆడవారిని సుశిక్షితులను చేయడానికి జాతీయ స్థాయిలో ఉద్యమిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను మంగళవారం మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఢిల్లీకి చెందిన చాణక్య ఫౌండేషన్ నేషనల్ ఫుట్ ప్రింట్స్ సంస్థ ద్వారా దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో పాటు వివిధ సంస్థలలో అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు సంకల్పిం చింది. అండమాన్ నుంచి అమరావతి వరకు... ఇలా దేశ వ్యాప్తంగా ఏ ప్రాంతాన్నీ వదలకుండా అన్ని చోట్ల మహిళలకు కరాటే వంటి స్వీయ రక్షణ విద్యల్లో శిక్షణ ఇప్పించబోతున్నట్టు చాణక్య ఫౌండేషన్ ఛైర్మన్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

కాలగర్భంలో 12వేల ఏళ్లనాటి పట్టణం



అంకారా: టర్కీలో 12వందల ఏళ్లనాటి చిన్న పట్టణం హసన్ కియఫ్ మరికొన్ని నెలల్లో కాలగర్భంలో కనుమరుగవనుంది. ఇలిసు హైడ్రోఎలక్ట్రిక్ డ్యామ్ ప్రాజెక్టులో భాగమైన ఓ కృత్రియ సరస్సు ఈ పట్టణాన్ని కబళించి వేయనుంది. ఇలిసు ఆగ్నేయ అనటోలియా ప్రాజెక్టు కేంద్ర బిందువు. హైడ్రోఎలక్ట్రిక్ ఎనర్జీ, ఇరిగేషన్ ద్వారా సుదీర్ఘ నిర్లక్ష్య ప్రాంతానికి ఊతమిచ్చేలా ఈ ల్యాండ్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు సిద్ధమైంది. కృత్రిమ సరస్సు కారణంగా 100 గ్రామాలు, 3,000 మంది హసన్ కియఫ్ ప్రజలు విభజించబడ్డారు. మరికొందరు ఈ ప్రాజెక్టుని వ్యతిరేకించారు. హసన్ కియఫ్ ని నాశనం చేయడం పెద్ద నేరానికి పాల్పడటమేనని స్థానికుడు అయహన్ తెలిపారు. హసన్ కియఫ్ ప్రాంతానికి పెద్ద చరిత్ర ఉందని ఆయన తెలిపారు. అయితే విమర్శలను టర్కిష్ ప్రభుత్వం తోసిపు చ్చింది. స్మారక కట్టడాలను కాపాడే ప్రక్రియ అంతా పూర్తి అయిందని తెలిపింది.

మాటల్లో కాదు.. చేతల మనిషిని

- కర్నూలు ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



కర్నూలు, ప్రభ న్యూస్ బ్యూరో: తాను మాటల మనిషిని కాదని, ఏదైనా చేతల్లోనే చూపుతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం, కనమడకల, పుడిచెర్ల గ్రామ సమీపంలో రూ. 88.5 కోట్లతో నూతనంగా నిర్మితమైన కర్నూలు ఎయిర్‌పోర్టును మంగళవారం ఆయన జాతికి అంకితం చేశారు. అంతకు ముందు ఎయిర్‌పోర్టు పైలాన్‌ను ఆవిష్కరించడంతో పాటు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గడివేముల మండల పరిధిలో నిర్మించిన ఆల్ట్రా మెగా సోలార్ పార్కును జాతికి అంకితం చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. వీటితోపాటు కర్నూలు ప్రభుత్వ అసుపత్రిలో రూ.120 కోట్లతో నిర్మితమవు తున్న కాన్సర్ పరిశోధన కేంద్రంకు శంకుస్థాపన చేశారు .ఫార్మాక్లస్టర్, ఎంఎస్ఎంఇ పార్కులకు భూమి పూజ గావించారు. అనంతరం యువ పారిశ్రామికవేత్తలు, వైద్య విద్యార్థులు బైఠాయించిన సభనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేవలం 18 నెలల్లోనే రూ.88.5 కోట్ల వ్యయంతో కర్నూలు విమానా శ్రయాన్ని నిర్మించామన్నారు. 2015 అగస్టు 15న ఇచ్చిన హామీ మేరకు 2017 జూన్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. సుమారు వెయ్యి ఎకరాల్లో నిర్మించినట్లు తెలిపారు. విమాన రాకపోకల కు కేంద్ర పౌర విమా నయాన సంస్థ నుంచి అనుమతులు రావాల్సి ఉందని, కేంద్రం నుంచి అనుమతులు రాగానే వచ్చే వేసవిలో కర్నూలు నుంచి అమరావతి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌కు విమాన సర్వీసును నడిపేందుకు ప్రణాళికలు రూపొం దిస్తామన్నారు. వీటివల్ల జిల్లా ప్రజలకు రాజధాని ప్రయాణంతో పాటు, పరిశ్రమ పెట్టుబడుదారులకు, విద్య, ఉపాధి అవకాశాలకు ఈ ఎయిర్‌పోర్టు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అయన తెలిపారు. జిల్లాలో 97 లిఫ్ట్ ఇరిగేషన్‌లు పూర్తి చేశామన్నారు. మిగిలిన ఒకటో, రెండో త్వరలో పూర్తి చేస్తామన్నారు. పూర్తయిన వాటితో ఇప్పటి వరకు జిల్లాలో 97వేల ఎకరాలకు సాగునీరు అందించా మన్నారు. త్వరలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందన్నారు. 200 ప్రముఖ కంపెనీలు ఓర్వ కల్లుకు వచ్చే అవకాశ ముందన్నారు. రూ.7200 కోట్ల పెట్టుబడితో రాంకో, జయరాజ్ సిమెంట్ పరి శ్రమలను స్థాపించి జిల్లాలో 6వేల మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. లైమ్ స్టోన్, తదితర రకాల భూగర్భ ఖనిజ సంపదను ఉపయోగించుకుని, కర్నూలు నగరాన్ని ఓర్వకల్లు వరకు విస్తరిస్తా మన్నారు. గని అల్ట్రా మెగా పవర్ సోలార్ పార్కు ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ప్రాజెక్ట్‌గా ఆయన పేర్కొన్నారు.

యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్‌పై ఎఫ్ఐఆర్



పాట్నా: మాజీ ప్రధాని మన్మో హన్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కి విడుదలకు సిద్దంగా ఉన్న ది యాక్సిడెంటల్ ప్రైమ్ మిని స్టర్ సినిమాతో అసిసి యేట్ అయిన అనుపమ్ ఖేర్, అక్షయ్ కన్నా తో సహ మరో 15 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బీహార్ హైకోర్టు మంగళవారం పోలీసులను ఆదేశం చింది. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ మన్మహన్ పాత్రలో కన్పించనున్నారు. జనవరి 11న విడుదలనున్న ఈ సినిమా సంజయ్ బారు రాసిన బుక్ ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమా నిర్మాత, దర్శకుడు సినిమాలో మన్మోహన్, సోనియా తదితర ప్రముఖులు పాత్రలను తప్పుగా చిత్రీకరించారని పేర్కొంటూ సుధీర్ కుమార్ ఓజ్హ అనే న్యాయవాది పిటిష్ వేశారు. ఈ సినిమా ట్రైలర్ తన మనోభావాలను దెబ్బతీసిందని ఆయన తన పిటిషన్ లో ఆరోపించారు. ఈ పిటిసన్‌పై మంగళవారం విచారించిన సబ్ డివిజినల్ జడ్జి గౌరవ్ కమల్ కంతి పోలీస్ స్టేషన్ ఈ సినిమాతో అసోసియేట్ అయిన 17మందిపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని కంతి పోలీస్ స్టేషన్‌ను ఆదేశించింది.


నేడు ప్రజాసంకల్పయాత్ర స్థూపం ఆవిష్కరణ



శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో : వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర నేడు జిల్లాలోని ఇఛ్ఛాపురం నియోజక వర్గ కేంద్రంలో ముగియనుం డటంతో యాత్ర ముగింపు గుర్తుగా నిర్మించిన విజయ స్థూపాన్ని (పైలాన్) బుధవారం వైకాపా అధినేత, రాష్ట్ర ప్రతిపక్షనేత వైఎస్ జగన్మో హనరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కానుంది. పైలాన్‌ను బుధవారం జగన్ చేతులమీదుగా ఆవిష్కరించనున్న నేపథ్యంలో దానిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అయోధ్య కేసు విచారణకు రాజ్యాంగ ధర్మాసనం

- రేపటి నుంచి విచారణ ప్రారంభం
- ధర్మాసనంలో తెలుగు న్యాయమూర్తి ఎన్‌వీ రమణ




న్యూఢిల్లీ: అయోధ్య రామ జన్మభూమి- బాబ్రీ మసీదు భూ వివాదంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు 5గురు జడ్జిలతో ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని ఎస్.ఏ బాబ్డే,ఎన్.వి రమణ, యు.యు లలిత్, డి.వై చంద్రచూడ్ లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈనెల 10 వ తేదీ నుంచి విచారణ ప్రారంభించనుంది. జనవరి 10 ఉదయం 10.30 గంటల నుంచి విచారణ ప్రారంభించనున్నట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈనెల 4వ తేదీన విచారణ జరిపిన సుప్రీంకోర్టు తుదుపరి విచారణను ఈనెల10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించినా ధర్మాసనం ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించలేదు.



అలహాబాద్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ..

2010 లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రామ జన్మభూమి, బాబ్రీ మసీదు భూ వివాదంపై సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖల య్యాయి. 2.77 ఎకరాల భూమిని ముగ్గురు పిటిషనర్లకు మూడు భాగాలుగా విభజించాలని అలహాబాద్ కోర్టు తీర్పునిచ్చింది. సున్ని వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లాలకు భూ పంపిణీ సమానంగా జరగాలని తీర్పులో పేర్కొంది. ఈ కేసుపై అత్యవసర విచారణ జరపాలని అఖిల భారత హిందు మహారాష్ట్ర దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గతంలో అనుమతించలేదు. 14 పిటిషన్లపై గతేడాది సెప్టెంబర్ 27న విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం..ఈ కేసును ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసేందుకు నిరాకరించింది. నాటి నుంచి అయోధ్య కేసుపై విచారణ వాయిదా పడుతూ వస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అయోధ్య రామాలయ నిర్మాణంపై ఆర్డినెన్స్ తేవాలని హిందుత్వ సంఘాలు బీజేపీపై ఒత్తిడి చేస్తున్నాయి. కోర్టు తీర్పునకు అనుగుణంగానే తాము నడుచు కుంటామని ప్రధాని మోడీ కూడా పేర్కొనడంతో ఈనెల 10 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే విచారణ ప్రభావం ఎలా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది.

22న దావోస్‌కు చంద్రబాబు!



అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్రంలోని పారిశ్రామిక పెట్టుబడులే లక్ష్యంగా సీఎం ఎన్.చంద్రబాబునాయుడు తో పాటు మరో 10 మంది సభ్యుల బృందం ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి బయల్దేరి 'దావోస్' పర్యటనకు వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబుతోపాటు ఈ బృం దంలో సభ్యులుగా రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యన మల రామకృష్ణుడు, మున్సిపల్ పరిపాలన మరి యు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఆర్టీజీఎస్ సీఈఓ అహ్మద్‌బాబు, ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు మరో ఇద్దరితోపాటు మొత్తం పదిమంది సభ్యులు దావోస్‌లో ఈనెల 22 నుండి జరిగే పారిశ్రామిక పెట్టుబడల సదస్సులో పాల్గొననున్నారు. చంద్రబాబునాయుడు బృందం తిరిగి 25వ తేదీ అర్ధరాత్రికి గన్నవరం విమానా శ్రాయానికి చేరుకుంటారు. 26న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే గణతంత్ర దినోత్సవ రాష్ట్రస్థాయి ఉత్సవాలలో గవర్నర్‌తోపాటు కలిసి పాల్గొంటారు.

కార్మిక సమ్మెతో జనజీవనానికి అంతరాయం



న్యూఢిల్లీ: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల సమ్మెతో దేశ వ్యాప్తంగా రవాణా, బ్యాంకింగ్ తదితర రంగాలు స్తంభించాయి. కనీస వేతనాలు, సామాజిక భద్రతా పథకాలను అమలుచేయాలని డిమాండ్‌తోపాటు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ట్రేడ్ యూనియన్లు దేశవ్యాప్త బంద్ పిలుపుతో మంగళవారం పలు రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రైళ్ల రాకపోకలను అడ్డుకోవడం, హైవేల దిగ్బంధం వంటి ఘటనలు చోటుచేసుకోవటంతో రవాణా స్తంభించింది. పలు ప్రాంతాల్లో బస్సులపై రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత నెలకొంది. సమ్మెకు కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాలుమద్దతు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ర్యాలీ, రాస్తారోకోలు, ధర్నాలు జరిగాయి. ఐఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ, ఏఐసీఐటీయూ, హెచ్ఎం ఎస్,యూటీయూసీ, టీయూసీసీ తదితర కార్మికసంఘాలు ఆందోళన కార్య క్రమాలు నిర్వహించాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఆందోళనలు మిన్నం టాయి. కేరళలో కార్మిక సంఘాల ప్రభావంతో ప్రజాజీవనం స్తంభించింది. ఒడిశాలోనూ రవాణా వ్యవస్థ స్తంభించింది. కార్మికులు రోడ్లపై ఆందోళన చేపట్టి, టైర్లకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలో సమ్మె కారణంగా ముంబైలో బస్సులు డిపోలకే పరి మితం అయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రవ్యా ప్తంగా పలు ప్రాంతాల్లో బంద్ సందర్భంగా ప్రధాని మోడీ దిష్టిబొమ్మలు తగలబెట్టారు. కోల్‌కతాలో సమ్మెకు దిగిన సీపీఎం కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పది కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. మరోవైపు కార్మిక సంఘాల సమ్మెకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, ప్రభుత్వబ్యాంక్‌ల ఉద్యోగ సంఘాలు, దేశవ్యాప్తంగా రైతులు కూడా మద్దతు తెలిపారు. కాగా 8,9వ తేదీల్లో తాముకూడా సమ్మె చేపట్టినట్టు బ్యాంక్ ఉద్యోగాలు ప్రకటించడంతో ప్రభుత్వ బ్యాంక్‌ల సేవలకు అంతరాయం కలిగింది. కర్ణాటకలోని ముందగొడిలో బంద్ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్త అక్కడికక్కడే కుప్పకూలి కన్నుమూసింది.

బాబు అవినీతిపై దర్యాప్తు చేయాలి

- ఎంపరర్ ఆఫ్ కరప్షన్ పుస్తకం విడుదల

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : చంద్ర బాబు అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు డిమాండ్ చేశారు. మంగళవారం మాజీ ఎంపీ మేకపాటి నివాసంలో ఎంపరర్ ఆఫ్ కరప్షన్ అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు విజయ సాయిరెడ్డి, వేంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు మేకపాటి రాజమో హన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాద్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చంద్రబాబు అవినీతితో ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డ పై వేలాది రూపాయల అప్పుల భారం మోపారని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ప్రతి క్యాబినెట్ మీటింగ్ లో కారు చౌకగా భూములు సంస్థలకు కట్టబెట్టారని అన్నారు. తన పరిపాలనలో రాష్ట్ర బడ్జెట్ ను మించి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బడ్జెట్ కి సంబంధం లేకుండా 6 లక్షల కోట్లు అవినీతి చేశారన్నారు. రాజధాని భూములలో, లోటు బడ్జెట్ లో అన్ని చోట్లా అవినీతి చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అవినీతిని పుస్తకంలో వివరించామన్నారు. ఈ పుస్తకాలను దేశంలోని ఎంపీలందరికీ ఇస్తున్నామని చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని మాజీ ఎంపీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే తాము కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. అమరావతి నుంచి పోలవరం వరకు అవినీతి చేశారని, మరుగుదొడ్ల లో 600 కోట్ల అవినీతి కి పాల్పడ్డారని ఆరోపించారు. బాబు అవినీతి పై కేంద్రం సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి రాక్షస పాలన జరుగుతోందని రాజ్యసభ సభ్యుడు వేంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు. ఇద్దరు చీఫ్ సెక్రటరీ లు బయటికి వచ్చి చంద్రబాబు అవినీతిని బయటపెట్టారని గుర్తు చేశారు. చంద్రబాబు ఆరు లక్షల కోట్ల రూపాయలకు మించి అవినీతి కి పాల్పడ్డారని అన్నారు.

3 క్యూనెట్ కుచ్చు టోపీ వేల కోట్లు హాంఫట్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్

(మొదటిపేజీ తరువాయి)

కావడం విశేషం. క్యూనెట్ ముఠాపై సైబరాబాద్ సహా పలు ప్రాంతాల్లో దాదాపు 30 కేసులుండగా వాటిలో 14 నగరంలోనే నమోదయ్యాయి. కాగా ఆయా కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు క్యూనెట్ మోసాన్ని పసిగట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను మంగళవారం సీపీ సజ్జన్నార్ వివరించారు. 14 కేసులకు సంబంధించి 58 మంది నిందితులను అరెస్ట్ చేశామని, క్యూనెట్‌కు చెందిన బ్యాంక్ అకౌంట్‌లలో రూ. 2.7 కోట్లు ఫ్రీజ్ చేశామని, నిందితుల బ్యాంక్ అకౌంట్లను స్తంభింపచేశామని వివరించారు. అనధికారిక లెక్కల ప్రకారం దేశవిదేశాల్లో క్యూనెట్ స్వాహా చేసిన మొత్తం 3 వేల కోట్ల రూపాయలకు పైమాటే. కాగా ఈ కేసులకు సంబంధించి హైదరాబాద్‌లో 51 మందిని, బెంగళూరులో ఐదుగురిని, ఢిల్లీ, ఏపీలోని ఏలూరులో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 58 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. కాగా బెంగళూరులో క్యూనెట్ గోడౌన్, ఆఫీసును పోలీసులు సీజ్ చేశారు. తెలంగాణ సీఐడీలో క్యూనెట్‌పై 8 కేసులు ఉండగా.. సైబరాబాద్ కమిషనరేట్‌లో 30 కేసులున్నాయి. దేశవ్యాప్తంగా 19 కేసులున్నాయి.

ఇలా మోసం...

మల్టీలెవెల్ మార్కెట్ స్కీంలో కొత్తగా చేరేవారినుంచి సభ్యత్వ రుసుం వసూలు చేసి వారికి వివిధ పథకాలు, వాణిజ్యంలో మెళకువలను నేర్పడం మొదలుపెడతారు. ఆన్‌లోనే వసూళ్ల దందా నడుస్తుంది. సభ్యత్వం ఇస్తూ ఒక ఐడీ జనరేట్ చేస్తారు. కానీ పాస్‌వర్డ్ చెప్పకుండా దాటవేస్తారు. సభ్యులుగా చేరినవారు మరికొందరిని చేర్పించడం తొలి నిబంధన. ఇష్టంలేనివారు నెలరోజుల్లోగా ఫీజ్ రిఫండ్ కోరొచ్చు. కానీ అలా వారు తీసుకునేందుకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా శిక్షణ తరగతుల పేరిట కాలయాపన చేసి ఆ గడువు ముగిసేలా చేయడంతో మోసం మొదలవుతుంది. కాస్ట్ ఆప్టిమైజేషన్ బిజినెస్, హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రాడక్ట్స్. వాచెస్, జ్యువెల్లరీ, పర్సనల్ కేర్, బ్యూటీ తదితర ప్రాజెక్టులతో పాటు టూర్ ప్యాకేజెస్, ఎడ్యుకేషనల్ ప్యాకేజెస్ (ఎస్ఎంసీ, ఎంబీఏ సర్టిఫికేషన్)తోపాటు అనేక పథకాలను పరిచయం చేస్తూ తరగతులు చెబుతారు. క్యూనెట్ ప్రమోటర్స్‌గా ఉన్న వారు కొత్తవారిని తమ క్యూనెట్‌లో జాయిన్ చేసేందుకు చెప్పే మాటలకు ఎంతటివారైనా ఇట్టే పడిపోతారు. ఎవరి భవిష్యత్తు వారే నిర్మించుకోవాలి.. త్వరితగతిన అభివృద్ధి పథంలో పయనించాలని ఉద్బోధిస్తూ అనేక పుస్తకాలను స్టడీ చేయాల్సిందిగా ఇస్తారు. స్ఫూర్తిదాయకంగా వారు చెప్పే ఉపన్యాసాలకు నిరుద్యోగ యువత, గృహిణులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఆకర్షితులై పెట్టుబడులు పెట్టారు. తొలుత క్యూనెట్‌లో జాయిన్ అయిన తర్వాత ఇండిపెండెంట్ రిప్రంజెంటేటివ్‌గా పరిగణిస్తారు. ఇక ఇక్కడ్నించీ అసలు తంతు మొదలవుతుంది. ఈ విధంగా జాయిన్ అయిన వ్యక్తి ఒక మెంబర్‌ను చేర్చుకోవాలి. ఆ మెంబర్ మరో ఇద్దరు మెంబర్స్‌ని జాయిన్ చేసుకోవాలి. అలా చేరినవారు సభ్యత్వ రుసుముతోపాటు పెట్టుబడిగా కొంత నగదు జమచేయాలి. ఈ విధంగా గొలుసుకట్టు మాదిరిగా క్యూనెట్ ఉచ్చులో పలువురు చిక్కారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, ఢిల్లీలతో పాటు విదేశాలలో సైతం క్యూనెట్ మోసాలకు పాల్పడింది.

హాంకాంగ్ కేంద్రంగా...

హాంకాంగ్ కేంద్రంగా విజయ్ ఈశ్వరన్, జోసెఫ్ బిస్మార్క్‌లు క్యూఐ వ్యవస్థాపకులుగా 1998లో నెలకొల్పారు. 2008లో త్రెవర్ కన క్యూనెట్‌లో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ చేరాడు. ఆయననే సీఈవోగా చెబుతారు. మైఖెల్ ఫెరియా, మాల్కామ్ దేశాయి క్యూనెట్ షేర్ హోల్డర్స్‌గా వ్యవహరి స్తున్నారు. ఇండియా, ఫిలిప్పైన్స్, కాంబోడియా, నేపాల్, ఇండోనేసియా, టర్కీ, సౌదీ అరేబియా, రష్యా తదితర తదితర దేశాలలో ఈ సంస్థ విస్తరించింది. క్యూఐ గ్రూప్‌లో హాంకాంగ్‌గా బేస్‌డ్‌గా ఉన్న గోల్డ్‌క్వెస్ట్, క్వెస్ట్‌నెట్‌గా విస్తరించి ఉన్న విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ క్యూనెట్ పేరుతో కార్య కలాపాలు కొనసాగించేందుకు క్యూఐ గ్రూప్ అనుమతించగా ఆ సిబ్బంది మోసాలకు తెరతీశారు. తమ వ్యాపారాలు, పథకాలలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు పొందవచ్చని అకర్షణీయ లెక్చర్స్ ఇచ్చేది. ఇందుకుగానూ తొలుత ప్రమోటర్స్‌ను నియ మించు కున్న క్యూనెట్ ఆనక మెంబర్స్‌గా జాయిన్ అయినవారి నుంచి గొలుసు నియామక ప్రక్రియ మొదలుపెట్టేది. అయితే, అంతగా పరిజ్ఞానం లేకపోవడం, తమకిచ్చిన వస్తువుల నాణ్యత తెలియకపోవడం, వాటిని ఏం చేయాలో అయోమయ స్థితిలో ఉండి చిట్టచివరకు తాము మోసపోయామన్నాక లబోదిబోమనడం మామూలైంది. ఇలా మోసపోయినవారిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మహిళలు, నిరుద్యోగ యువత ఉండటం కొసమెరుపు. అధిక లాభాలు ఆశ చూపడంతోనే తాము క్యూనెట్ ఉచ్చులో పడిపోయినట్లు పలువురు బాధితులు చెబుతున్నారు. అత్యంత హంగూ, ఆర్భాటంతో వీరు అమాయక ప్రజలను చాకచక్యంగా తమ బుట్టలో వేసుకున్నారని పోలీసులు తెలిపారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ చట్టవ్యతిరేకమని తెలిసినా, ఇటీవల పలు సంస్థల బాగోతాలు వెలుగు చూసినా ఇటువంటి సంస్థల ఉచ్చులో పడిపోతుండటం గమనార్హం. నిందితులలో 14 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా, పది మంది ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.

ఎన్ని జరిగినా మోసపోతూనే ఉన్నారు

అమాయక ప్రజలను మభ్యపెట్టి మల్టీలెవెల్ మార్కెటింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్న ఒక్కో సంస్థ బాగోతాన్ని పోలీసులు వెలికి తీస్తున్నారు. మొన్న ఫ్యూచర్ మేకర్.. నిన్న సన్ పరివార్.. నేడు దాదాపు మూడు వేల కోట్ల రూపాయల మోసానికి పాల్పడ్డ క్యూనెట్ సంస్థల బాగోతం వెలుగుచూసింది. ఈ క్యూనెట్ ప్రధానంగా ఐటీ కారిడార్ లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టార్గెట్ చేసింది. బాధితుల్లో నిరు ద్యోగ యువత, గృహిణులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం అధిక సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఒక్కరోజులో ఎవరూ కోటీశ్వరులు కాలేరు.. కష్టపడితేనే ఫలితం వస్తుంది తప్ప అధిక లాభాలు ఆశచూపే ఇలాంటి సంస్థల పట్లనిరుద్యోగ యువత, గృహిణులు మోసపోవద్దని, అవి మోసపూరిత సంస్థలని అనుమానం వస్తే వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమందించాలని సైబరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు.

న్యాయం కావాలి

- భర్త వివాహేతర సంబంధంపై భార్య ఆందోళన
- అత్తారింటి వద్ద ప్లకార్డులతో నిరసన
- ఖమ్మం జిల్లా సుజాత నగర్‌లో ఘటన
- ఇద్దరితో కాపురం.. లేదంటే తలాక్: భర్త బెదిరింపు



సుజాతనగర్, ప్రభన్యూస్: మొదటి భార్యకు విడాకులివ్వకుండానే ఓ మహిళతో వివాహేతర సంబంధం నెరపుతూ తీరా భార్య బంధువులకు అడ్డంగా దొరికిపోయిన ఓ ప్రబుద్ధుడి ఉదంతమిది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా, సుజాతనగర్ మండ లానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అబ్దుల్ ఫారూఖ్ తనయుడు అలీమ్ ఫారూఖ్ ఖమ్మంకు చెందిన సయ్యద్ సఫియా ఫాతిమాతో 2012లో వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రూ. 10 లక్షల కట్నంతో పాటు సుమారు రూ. 35 లక్షలు వరకు నజరానా ఇచ్చారు. ఆదిత్య బిర్లా కంపెనీలో రీజినల్ మేనేజర్‌గా పని చేస్తున్న అలీమ్‌కు రూ. 2 లక్షలు వరకు వేతనం కూడా లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు కూడా ఉన్నారు. ఈ క్రమంలో తన కార్యాలయంలో పని చేస్తున్న సత్తుపల్లికి చెందిన షేక్ ఫాతిమాతో ఏర్పడిన పరిచయం కాస్తా సన్నిహిత సంబంధానికి దారి తీసింది. అక్కడే ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఆమెతో సహజీవనం సాగిస్తున్నాడు.

తరుచూ ఇంటికి రాకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, వేధింపులకు గురి చేస్తుండటంతో అనుమానం వచ్చిన మొదటి భార్య బంధువులు ఆరా తీయగా అతని భాగోతం బయటపడింది. అక్కడి పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదర్చగా తిరిగి మొదటి భార్యతో కాపురం చేస్తానని చెప్పి మూడు నెలలు తిరగక ముందే తిరిగి తన ప్రియురాలికి సందేశాలు పంపుతూ తిరిగి సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలియడంతో అతన్ని నిలదీయగా షేక్ ఫాతిమాను తాను వివాహం చేసుకున్నట్లు, తనకు రూ. 2లక్షలు జీతం వస్తుందని, ఇద్దరికీ న్యాయం చేస్తానని బొంకినట్లు మొదటి భార్య తరుపు బంధువులు చెపుతున్నారు. త్రిపుల్ తలాక్ ద్వారా విడాకులిస్తానని చెప్పడంతో ఖంగుతిన్న మొదటి భార్య బంధువులు తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం సుజాతనగర్‌లోని అలీమ్ తండ్రి ఇంటి ముందు ప్లకార్డులతో సుమారు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. తమను మోసం చేసిన అలీమ్‌ను అరెస్ట్ చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు బాధితులకు నచ్చజెప్పి పంపించి వేశారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

80 దళిత కుటుంబాలు బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

గ్రామానికి చెందిన ఇతర భవనాన్ని నిర్మించాలనుకుంటున్నామని, కుల సంఘాల భవనాలు కట్టొద్దంటూ గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు హుకూం జారీ చేశారు. దీంతో దళితులు పెద్దల పెత్తనాన్ని నిరసిస్తూ వ్యవసాయ పనులకు దూరంగా ఉన్నారు. గ్రామాభివృద్ధి కమిటీకి దళితులు పనులకు దూరంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోయారు. వివాదం ముదురుతుండటంతో గ్రామస్థులు పంచాయితీ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. పంచాయితీ నిర్వహించి అంబేద్కర్ భవనాన్ని నిర్మించడానికి వీలు లేదని తేల్చి చెప్పారు. దీనిని వ్యతిరేకించిన 80 దళిత కుటుంబాలను బహిష్కరించారు.

పంచాయితీ కోసం తమ వద్ద నుంచి రూ.50వేలు తీసుకుని, సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించకుండా గ్రామ బహిష్కరణ విధించారని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమకు సహకరించే గ్రామస్థులకు రూ.10వేలు జరిమానా విధిస్తామని బెదిరించడంతో గ్రామంలో ఎవరూ తమతో మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గత నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోలేదు. విషయం తెలిసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు గ్రామాన్ని సందర్శించారు. డిసెంబర్ 24న ఘటన జరిగితే జనవరి 2వరకు స్పందించడం లేదెందుకని నందిపేట్ మండలం సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఐ మారంపల్లి గ్రామస్థులు 25మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

భారతీయ చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన వెంటనే బాధితులకు రూ.లక్షసహాయం అందించాలని ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. దీంతో స్పందించిన ఆర్డీవో కేసుపై విచారణ జరిపి 80 దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు, దళిత సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

సంక్రాంతి పర్యాటక ప్యాకేజి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగకు తెలంగాణ టూరిజం సంస్థ స్పెషల్ టూర్ ప్యాకేజీలను సిద్ధం చేసింది. పండుగ సెలవుల్లో కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేయాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా టూర్ ఫ్యాకేజీలు అమలు చేయనున్నారు. అడ్వెంచర్, డివోషనల్, నేచర్‌లాంటి విభిన్న రకాల టూర్లతో టూరిస్టులను ఆకట్టుకునేందుకు ప్లాన్ చేసింది. జిల్లాల నుంచి నగరాన్ని చూసేందుకు వచ్చే వారి కోసం టూర్ ఫ్యాకేజీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 13 నుంచి నగరంలో మూడు రోజుల పాటు జరిగే స్వీట్ అండ్ క్యైట్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. వరంగల్ లక్నవరం ఎకో టూరిజంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని అధికారులు తెలిపారు. రూప్ బ్రిడ్జి సరస్సులో బోటింగ్, రిసార్ట్స్‌లో నైట్ స్టేయింగ్ సౌకర్యం ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. కాటేజీ రూమ్స్, హరితా హోటల్స్ అడ్వాన్స్‌గా బుకింగ్ మొదలైనట్లు సంబం ధిత అధికారులు తెలిపారు. టెంపుల్స్ పర్యటన, ఇతర రాష్ట్రాల్లోని టూర్లు, తిరు పతి, శబరిమల, సిటి టూర్‌కు డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. నెక్లెస్ రోడ్డులో డిఫెన్స్ మ్యూజియంను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఒక యుద్ధ విమానాన్ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే 142 డిఫెన్స్ ఫ్లైట్‌ను ప్రదర్శించారు.

19న జైపూర్ ఫుట్ డ్యాన్స్ ఫెస్టివల్

వికలాంగులకు చేయూతగా ఈ నెల 19న జైపూర్ ఫుట్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ హైటెక్ సిటీలో శిల్పకళావేదికగా ఈనెల 19న సాయత్రం ఏర్పాటు చేస్తున్న జైపూర్ ఫుట్ డ్యాన్స్ ఫెస్టివల్‌కు సీఎస్ ఎస్‌కె జోషి ముఖ్యఅతిధిగా హాజరు కానున్నట్టు తెలిపారు. ప్రముఖ సినీ ,టీవీ కళాకారిణి సుధాచంద్రన్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు. జైపూర్ ఫుట్‌కు సుధా చంద్రన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నట్టు తెలిపారు. ఈకార్యక్రంలో సుధా చంద్రన్‌తోపాటు మరో 40 మంది కళాకారులు నృత్యప్రదర్శన ఇస్తారన్నారు. అంగవైకల్యాన్ని సవాల్‌గా తీసుకుని ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన ఇటు వంటివారికి మరింత చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ్ సమితి అధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పద్మభూషన్ డి.ఆర్ మెహతా హాజరు కానున్నట్టు సాంస్కృతిక శాఖ కార్యదర్శి వెంకటేశం తెలిపారు.

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క?

(మొదటిపేజీ తరువాయి)

పీసీసీ అధ్యక్షుడిని మార్చడం వల్ల అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. దళితుడైన భట్టి ఇటీవల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడంతోపాటు ప్రచార కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక శాసనసభ స్థానాలను కైవసం చేసుకోవడం కూడా భట్టికి అదనంగా కలిసివచ్చిన అంశంగా భావిస్తున్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ భట్టి కీలకపాత్ర పోషిస్తారని అభ్యర్థుల ఎంపిక మొదలుకుని ఎన్నికలయ్యేంత వరకు ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించాలన్న ప్రతిపాదనలతో పార్టీ అధినాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా ఖమ్మం జిల్లాలోనే మహాకూటమితో కలిపి 8 స్థానాలను చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. దళితుడికి సీఎల్పీ పదవిని కట్టబెట్టడం ద్వారా ప్రజల్లో మంచి సంకేతాలు ఇవ్వవచ్చన్న భావనతో కూడా కాంగ్రెస్ పార్టీ ఉంది. ఈ ఐదేళ్లు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడాలంటే యువకుడిని, సీనియర్ నాయకుడిని శాసనసభాపక్ష నేతగా ఎంపిక చేయడం భావ్యంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. త్వరలో జరిగే పంచాయితీరాజ్, సహకార ఎన్నికలతోపాటు లోక్‌సభ, ఆ తర్వాత జరిగే మున్సిపల్ ఎన్నికల్లోనూ అధికార పార్టీ తెరాసను ధీటుగా ఎదుర్కొనేందుకు సీనియర్లు అనుభవం ఉన్న నేతల సేవలు అవసరమని కాంగ్రెస్ అగ్రనేతలు భావిస్తున్నారు. భట్టిని సీఎల్పీ నేతగా ఎంపిక చేస్తే పార్టీలో వ్యతిరేకించేవారు కూడా ఎవరూ ఉండరని పైగా ఆయన వివాదారహితుడని, అందరితో కలిసి చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్న అభిప్రాయం పార్టీలో ఉంది. అందుకే సీఎల్పీ నేతగా భట్టిని ఎంపిక చేయాలని రాహుల్ గాంధీ వద్దా నిర్ణయం జరిగినట్లు అధిష్ఠానం కూడా ఆయన వైపే మొగ్గు చూపుతుందని విశ్వసనీయంగా తెలిసింది.

తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హైదరాబాద్/ఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగు రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజెక్టు పనులపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చర్చించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రైల్వే అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తన అత్తగారి దశదిన కార్యక్రమాలకు హాజరు కావడానికి గాను ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రాయానికి వచ్చారు. అక్కడి నుంచి రైలు మార్గంలో నెల్లూరు జిల్లాలోనే వెంకటాపురం చేసుకున్నారు. రైలు ప్రయాణంలోనే రైల్వే అధికారులతో సమావేశమై రెండు తెలుగు రాష్ట్రాల్లోని పెండింగ్ పనుల పురోగతిపైన చర్చిం చారు. ప్రధానంగా కృష్ణపట్నం- ఓబులవారిపల్లె , నడికుడి - శ్రీకాలస్తి రైలు మార్గం పనులను పూర్తి చేయాలన్నారు. గూడూరు - విజయవాడ మూడో లైన్, గుంటూరు - అమరావతి- విజయవాడ లైన్, గుంతకల్లు స్టేషన్, నెల్లూరు నూతన స్టేషన్‌తో పాటు గూడూరు, రేణిగుంట స్టేషన్లల్లో వైఫే సౌకర్యంపై చర్చించారు. డైనమిక్ ఫెయిర్ ట్రైన్స్‌లో టికెట్ల ధరలు ఎక్కువగా ఉన్నాయనే ప్రయాణికులు నుంచి వార్తలు వినిపిస్తున్నాయని, మధ్య తరగతి వర్గాలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా చూడాలని సూచించారు.

నెల్లూరు, కడప జిల్లాల మధ్య ముడి సరుకు రవాణా, ప్రయాణ సౌకర్యాలు, కృష్ణపట్నం పోర్టుద్వారా ఎగుమతులు, దిగుమతులు కల్పించాలన్నారు. కృష్ణపట్నం- ఓబులవారి పల్లె రైల్వే సొరంగం పనులపై రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను తన ఛాంబర్‌ను పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టు పనులు ఫిబ్రవరి చివరి నాటికి పూరయ్యేలా చూడాల ని అధికారులకు సూచించారు. నడికుడి- శ్రీకాళస్తి రైల్వే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 45 కి. మీటర్ల మేరకు భూమి కేటాయించిందని, అందులో రెండు చోట్ల వివాదం ఉండటంతో ప్రస్తుతం హై కోర్టులో కేసు నడుస్తున్నందున కొంత ఆలస్యమైందని అధికారులు తెలిపారు. రొంపిచర్ల- పిడుగురాళ్ల మధ్య వివాదంలో ఉన్న భూమి మినహా మిగిలిన ప్రాంతంలో పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటికే పూర్తయిన పనుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి క్లియరెన్స్‌లు రావాల్సి ఉందని, కేంద్ర మంత్రిత్వశాఖలో మాట్లాడి తొందరగా క్లియరెన్స్ వచ్చే విధంగా చూస్తానని వెంకయ్య నాయుడు తెలిపారు.

ఏపీలో టీడీపీ- కాంగ్రెస్ కలిసే!



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు కొనసాగింపు వ్యవహారం దాదాపుగా కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు జరిపిన సుదీర్ఘ మంతనాల్లో ఈ అంశమే ప్రధాన ఎజెండాగా నిలిచింది. మరికొద్ది నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు, సీట్ల సర్దుబాటు కొనసాగించే విషయంపై రెండు పార్టీల అధినేతలు అవగాహనకు వచ్చినట్టు సమాచారం. ఏపీ కాంగ్రెస్ నేతల్లో ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండాలనే కోరుకుంటున్నట్టు తెలిసింది. రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఊమెన్ చాందీ ఉండడంతో పొత్తులు, సీట్ల సర్దబాటు అంశంపై చర్చ జరిగిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం ఏపీ భవన్ సీఎం కాటేజికి చేరుకున్న చంద్రబాబు నాయుడును ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వచ్చి కలిశారు. జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటు, ఈనెల 19న కోల్‌కతాలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ (ర్యాలీ)కి హాజరయ్యే విషయంపై చర్చించినట్టు తెలుస్తోంది. కేజ్రీవాల్‌తో భేటీ అనంతరం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్‌ను ఆయన నివాసంలో చంద్రబాబు నాయుడు కలుసుకున్నారు. అదే సమయంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్నారు. కాసేపటి తర్వాత లోక్‌సభలో జరుగుతున్న రిజర్వేషన్ బిల్లుపై చర్చలో పాల్గొనేందుకు ఫరూఖ్ అబ్దుల్లా వెళ్లిపోగా, పవార్‌తో విడిగా మరికొంత సేపు చంద్రబాబు చర్చలు జరిపారు.

అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 19 మమతా బెనర్జీ తలపెట్టిన ర్యాలీకి రావాల్సిందిగా ఆహ్వానం అందిందని, ఆ సభకు విపక్ష పార్టీల నేతలందరూ హాజరవ్వాలని నిర్ణయించుకున్నామని చంద్రబాబు తెలిపారు. మరోవైపు రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ తామంతా సమర్థిస్తున్నామని అన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వానికి రిజర్వేషన్ల అంశంపై ప్రతిపాదనలు పంపాయని, ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్మీకీ బోయలను ఎస్టీలలో చేర్చడం, కాపులకు రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన తీర్మానాలు, బిల్లులపై ఆమోదముద్ర వేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.





కల్తీ కల్లు.. ఆరుగురికి అస్వస్థత

మహబూబాబాద్, ప్రభ న్యూస్ : కల్తీ కల్లు తాగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు అస్వస్థతకు గురైన సంఘటన కెసముద్రం మండలంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల బంధువులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లా కె సముద్రం మండలంలోని పెనుగొండ గ్రామం శివారు మర్రి తండాకు చెందిన వాంకుడోత్ దేవ్‌జ, అతడి భార్య బుజ్జి, కుమారులు సుమన్, ఉమలతో పాటు వేవ్‌జీ సోదరులైన బాలు, అతడి కొడుకు సంతోష్‌లు వరికల్లాల వద్ద వడ్లను మార్కెట్‌కు తరలించేందుకు బస్తాలలో నింపి ట్రాక్టర్లలో పంపేందుకు సిద్దం చేశారు. అనంతరం ఉప్పరపల్లి గ్రామ శివారులో గల ఘనపురం తాటివనంలో కుటుంబ సభ్యులతో కలిసి కల్లు సేవించినట్లు వారు తెలిపారు. కాసేపటి తర్వాత ఆరుగురు విరోచనాలు, వాంతులు చేసుకోవడంతో స్థానికులు వారిని హుటాహుటిన ఆసు పత్రులకు తరలించారు. బాలు, సంతోష్ లిద్దరిని కెసముద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, మరో నలుగురిని మహబూబాబాద్‌లోని ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.


వారిలో వాంకుడోత్ దేవ్‌జ భార్య బుజ్జి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు తాటి వనం వద్ద గీత పనివారలు కల్తీ కల్లు ఇవ్వడం వల్లే అస్వస్థతకు గురయ్యారని తండావాసులు ఆరోపిస్తున్నారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: పీఆర్‌టీయు తెలంగాణ రూపొందించిన 2019 డైరీని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా రూపొందించిన డైరీని హరీష్ రావు మంగళవారం తన నివాషంలో ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్యతోపాటు ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుందని మాజీ మంత్రి తెలిపారని అన్నారు. త్వరలోనే ఉపాధ్యాయుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరిస్తారని హామి ఇచ్చారని నేతలు తెలిపారు.



మా ఊరు-మా రాజ్యం

ఏకగ్రీవాలపై ఈసీ నిఘా



- వేలం.. ఒత్తిడి ప్రయత్నాలుంటే చర్య
- అందుకోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలనిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం చర్యలు వేగవంతం అయ్యాయి. తొలిదశ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగింపు దశకు చేరుకోవటంతో ఇక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై దృష్టి సారించింది. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు బెదిరింపులు, దౌర్జన్యకర పద్ధతులు, ప్రలోభాలు, వేలంపాటల ద్వారా ఏకగ్రీవం చేసి ప్రజాస్వామ్య స్పూర్తిని దెబ్బతీసే వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇందులో భాగంగానే గ్రామాల్లో నామినేషన్ల పర్వం నుంచే రహస్య నిఘా పెట్టింది. సూక్ష్మస్థాయి పరిశీలకులకు ఈ బాధ్యతలు అప్పగించటంతో ఇప్పటికే వారు గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

సింగిల్ నామినేషన్లపై ఆరా

తొలివిడత ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో సింగిల్ నామినేషన్లపై నిఘా పెట్టారు. ఏ గ్రామ పంచాయతీలోనైనా సర్పంచ్ స్థానానికి ఒకే అభ్యర్థినుంచి నామినేషన్ల దాఖలయిన పంచాయతీల్లో అక్కడ ప్రజలు స్వచ్ఛందంగానే ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు సహకరిస్తున్నారా లేక ఎవరి ప్రమేయంతోనైనా బలవంతంగా ఏకగ్రీవ ఎన్నికలకు తలొగ్గారా అన్నది ఆరా తీస్తున్నారు. మీడియాల్లో వస్తున్న వార్తా కథనాలనూ పరిశీలిస్తున్నారు. ఏ చిన్న ఆధారం లభించినా అక్కడ పంచాయతీరాజ్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు.

ఉద్యోగులూ జాగ్రత్త!

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు పూర్తి నిష్పక్షపాతంగా వుండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. పోటీలో ఉన్న అభ్యర్థికి అనుకూలంగానో లేక వ్యతిరేకంగానో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రచారం చేయరాదని, ఎన్నికల్లో ఏవిధంగానూ సహాయపడరాదని స్పష్టం చేసింది. ఎన్నికల పర్యటనలో భాగంగా మంత్రి లేదా రాజకీయ పార్టీ ఆహ్వానాన్ని అంగీకరించి, ఆయా వ్యక్తుల ఇంటిలో ఏర్పాటు చేసిన ఏదైనా కార్యక్రమంలో పాల్గొంటే చర్య తీసుకుంటామని పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగులెవరూ అటువంటి కార్యక్రమాల్లో పాల్గొనరాదని, ఎయిడెడ్ విద్యాసంస్థలు లేదా రాష్ట్ర ప్రభుత్వ లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న ఏదేని ఇతర విద్యాసంస్థ యజమాన్యానికి ఇన్‌చార్జి కూడా పోటీలో ఉన్న వారికి సహకారం అందించరాదని తెలిపింది. సంస్థకు చెందిన భవనాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది , నిధులు, లేదా వాహనాలు పోటీలో ఉన్న అభ్యర్థులకు అనుకూలంగా ఉపయోగించరాదని, గ్రామ , మండల స్థాయిలో ఉన్న సిబ్బంది ప్రత్యేకించి గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, గ్రామ సేవకులు అదే గ్రామానికి చెందిన వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో క్షేత్రస్థాయి ఉద్యోగులను అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఎట్టిపరిస్థితుల్లోనూ అటువంటి వాటికి తావీయరాదని సూచించింది. క్షేత్రస్థాయి ఉద్యోగులపై కూడా ఎన్నికల సంఘం తగిన నిఘా ఏర్పాటు చేసింది. సభలు , సమావేశాలు, ఊరేగింపులు వంటి వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాల్సింవుంటుంది. లేదంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలకు గురి కావాల్సివుంటుందని ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది.

గీత దాటితే.. వేటు!

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి, వార్డు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల సంఘం విధించిన పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హత వేటు పడనుంది. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రచార ఖర్చులకు సంబంధించి బ్యాంకు ద్వారానే లావాదేవీలు జరపాల్సింది. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరవాలన్న నిబంధనలను ఎన్నికల సంఘం సడలించింది. ఇప్పటికే అభ్యర్థికి ఏదైనా బ్యాంకులో ఖాతా ఉంటే అదేఖాతా ద్వారా ఎన్నికల లావాదేవీలు జరిపేందుకు అవకాశం కల్పించింది. అయితే అందుకు అఫిడవిట్ సమర్పించాలని నిబంధన విధించింది. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు కూడా ఏరోజుకారోజే తగిన రసీదులతో రికార్డు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనలకు మించి ఖర్చులు చేస్తే అనర్హతవేటు పడనుంది.

వేలం వేస్తే జైలుకే

- ఏడాదిపాటు జైలు... ఆరేళ్ల అనర్హత వేటు
- పంచాయతీ ఎన్నికలపై ఈసీ
- నిఘా సారించాలంటూ కలెక్టర్లకు ఈసీ ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వేలం పాటలు నిర్వహిస్తే ఎన్నికల నిభంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ , వార్డు స్థానాలకు పోటీలేకుండా అభ్యర్థులమధ్య వేలం పాటలు జరుగుతున్నట్టు మీడియాలో కథనాలు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. వేలం పాటలు జరిగే పంచాయతీలపై విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించింది.

నేరం రుజువైతే ఏడాది జైలుతోపాటు , జరిమానా,ఆరేళ్లదాక ఎన్నికల్లోపోటీకి అనర్హులవుతారని హెచ్చరించింది. ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వేలం పాటలు వంటి వాటి ద్వారా ఎన్నికలు ఏకగ్రీవం చేసుకున్న పంచాయతీల్లో అసవరమైతే ఎన్నికైన వారిని అనర్హులుగా ప్రకటించి అక్కడ తిరిగి ఎన్నికల రీ నోటిఫికేషన్ ఇవ్వవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఆశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఎక్కడైనా ఒటర్లు స్వచ్ఛందంగా ఎన్నికలను ఏకగ్రీవం చేసుకుంటే దాన్ని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంటనే ఫలితాలు వెల్లడించరాదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎన్నికల పరశీలకుల నుంచి క్లియరెన్స్ లభించాకే ఫలితాలను ప్రకటించాలని పేర్కొంది. ఎన్నికల పరిశీలకులు కూడా గ్రామ పంచాయతీలో ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నికల్లో అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తమ విచారణలో సంతృప్తి చెందితేనే క్లియరెన్స్ ఇవ్వాలని ఆదేశించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి ఎప్పకప్పుడు ఫిర్యాదులు నమోదు చేయాలని ఎన్నికల సంఘం కార్యదర్శి ఆశోక్ కుమార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

2వ రోజు 5413 నామినేషన్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలనామినేషన్లప్రక్రియ ఊపందుకుంది. మంగళవారం మొత్తం 5413 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకూ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు మొత్తం 8524నామినేషన్లు దాఖలయ్యాయి. అదే విధంగా వార్డు స్థానాలకు కూడా రెండవరోజు నామినేషన్లు జోరుమీద సాగాయి. ఒక్క రోజులోనే 16946నామినేషన్లు దాఖల య్యాయి . దీంతో ఇప్పటివరకూ వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల సంఖ్య మొత్తం 20902కు చేరుకుంది

నేడే చివరిరోజు

రాష్ట్రంలో తొలిదశ కింద ఎన్నికలు జరుగున్న 4479 గ్రామపంచాయతీలకు నామినేషన్ల దాఖలు గడువు బుధవారం నాటితో ముగియనుంది. సాయంత్రం 5గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారు.నామినేషన్ల చివరి రోజు కావటంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టు గా నామినేషన్ల దాఖలుతోపాటు శాంతిభద్రతల పరంగా కూడా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు.

మోడీ, ట్రంప్ ఫోన్ టాక్

న్యూఢిల్లీ వాషింగ్టన్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఫోన్ లో చర్చలు జరిగాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఈ చర్చల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్న ఇరువురూ భారత్, అమెరికా మధ్య కీలకమైన వాణిజ్య, రక్షణ అంశాలపై చర్చించారు. 2018లో భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం వృద్ధి, 2 ప్లస్ 2 చర్చల ప్రక్రియ ప్రారంభం, భారత్, అమెరికా, జపాన్ మధ్య మొదటిసారిగా జరిగిన త్రైపాక్షిక సమావేశం పట్ల ఇరువురు సంతృప్త వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావంతో నష్టపోయిన ఆఫ్ఘనిస్తాన్ కు ఇరుదేశాల సహకారం పెంచాలని నిర్ణయించారు. యూఎస్ - ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్యం-2019కి అంగీకారం, భారత్ తో అమెరికా వాణిజ్య లోటు భర్తీ అంశాలపై ఇరువురు చర్చించారు. ఇండో - ఫిసిఫిక్ ప్రాంతంలో రక్షణ, సంపద విషయాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారులు వెల్లడించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో లైబ్రరీ నిర్మాణానికి భారత్ అందిస్తున్న సహకారం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, భద్రత విషయంలో సహకారం అందిస్తే బావుంటుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం వ్యాఖ్యానించిన తర్వాత ఈ చర్చలు జరగడం గమనార్హం. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా ప్రధాని మోదీ ఫోన్‌లో సోమవారం చర్చించారు. ఇరుదేశాలకు చెందిన పలు కీలకమైన అంశాలపై ఇరువురూ చర్చించారు.



ఓటర్ల జాబితా సవరణలో పాల్గొనండి

- రాజకీయ పార్టీలకు ఈసీ పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ముమ్మరంగా పాల్గొని రాజకీయ పార్టీలు ఓటర్ల నమోదు చేయించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రజత్ కుమార్ అన్నారు.

మంగళవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 1నుంచి చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం వివరాలను సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ, బీజేపి, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, ఎంఐఎం, టీఆర్ ఎస్, టీడీపీ నేతలకు వివరించారు. ఈనెల 20న ప్రత్యేక ప్రచార దినంగా ఓటర్ల జాబితా సవరణను చేపడుతామని ఆయన వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఉండి ఓటర్ల జాబితాపై సవరణలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

సీబీఐ బాస్ ఈజ్ బ్యాక్..



- అలోక్ వర్మను తొలగించడం సబబు కాదు : సుప్రీం
- తిరిగి విధులు అప్పగించాలని ఆదేశం
- కొంత న్యాయం జరిగింది.. ఇప్పుడు ఏం జరుగుతుందో చూద్దాం: రాహుల్
- కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటాం : అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: దేశసర్వోన్నత న్యాయస్థానంలో సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మకు ఊరట లభించింది. సీబీఐ బాస్‌గా తిరిగి విధులు నిర్వర్తించేందుకు ఆయనకు మార్గం సుగుమం అయింది. అలోక్ వర్మను సెలవుపై పంపిస్తూ సీవీసీ, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు చెల్లవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా కొనసాగించాలంటూ కేంద్రప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్యం, సమైక్యతకు సీబీఐ అధిపతి ఆదర్శంగా నిలవాలని, ఇతర శక్తుల జోక్యాన్ని, నియంత్రించి స్వేచ్ఛను కల్పించినప్పుడే ఈ పరిస్థితి సాధ్యపడుతుందని, సీబీఐ స్వతంత్రం సంస్థగా వ్యవహరించగలుగుతుందని, స్వేచ్ఛగా ధైర్యంగా ప్రజల అభీష్టం మేరకు తన విధులను కొనసాగించగలుగుతుందని జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసాధారణ పర్యవసనాలు సీవీసీ ఆదేశాలకు కారణమయ్యాయని పేర్కొంది. సీవీసీ విచారణకు సహకరించకపోగా అవినీతి ఆరోపణలపై కేబినెట్ సెక్రటరికీ ఎవరు ఫిర్యాదు చేశారని సీవీసీని అలోక్ వర్మ ప్రశ్నించారని, అస్థానా అవినీతి ఆరోపణలను అలోక్ వర్మ సీవీసీ దృష్టికి తీసుకెళ్లారని పలు విషయాలను వెల్లడించింది. పలు సెక్షన్ల కింది అలోక్ వర్మను సెలవుపై పంపించడం సబబేనని సీవీసీ భావించిందని వెల్లడించింది. చట్టం ప్రకారం సీబీఐ డైరెక్టర్ కార్యాకలాపాల్లో ఇతరుల జోక్యం తగదని, ఇతరుల జోక్యం కారణంగా సంస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ అనుమతి లేకుండా తొలగించడంకుదరదని స్పష్టం చేసింది. సీబీఐ అధిపతిని మధ్యలో తొలగించాల్సిన అవసరం ఏర్పడినప్పుడు చట్టం ప్రకారం వ్యవహరించాలని, ఎంపిక చేసిన కమిటీ నిర్ణయం తప్పనిసరని పేర్కొంది. ఇది లావుండగా గతేడాది అక్టోబర్ 23న సీవీసీ, డీపీటీ(డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) ఆదేశాల మేరకు సీబీఐ అధిపతి విధులు నిర్వర్తించేందుకు మధ్యంతర డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వర్ రావు నియమించడంపై వర్మ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అలోక్ వర్మ తో పాటు వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులకు కోర్టులో ఎలాంటి ఊరట దక్క లేదు. బదిలీలకుసంబంధించి పర్యవసనాలను తెలియజేస్తూ సంబంధిత ఫోరంలను ఆశ్రయించాల్సిందిగా న్యాయస్థానం సూచించింది.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

స్వాతంత్ర్యం, సమైక్యకతకు సీబీఐ డైరెక్టర్ ఆదర్శంగా ఉండాలి. పార్లమెంట్ మినహా ఇతర జోక్యాలు, నియంత్రణల నుంచి స్వేచ్ఛ కల్పించినప్పుడే ఈ పరిస్థితి సాధ్యపడుతుంది.

కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం



నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని దూరదృష్టితో సీబీఐ డైరెక్టర్‌కు కల్పించిన అధికారాన్ని కోర్టు మరింత బలోపేతం చేసింది. అదేవిధంగా పని చేయడానికి అవసరమయిన జవాబుదారీ విధానాన్ని కోర్టు కలిగివుంది. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. అలోక్ వర్మ, రాకేష్ అస్థానాను సెలవుపై పంపించడాన్ని ఆయన సమర్థించారు. దేశ అత్యున్నత సంస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఇద్దరిపై అవినీతి ఆరోపణలు రావడంతో సీవీసీ సూచన మేరకు సెలవుపై పంపించామన్నారు.

కొంత న్యాయం జరిగింది



సుప్రీంకోర్టు తీర్పును రాహుల్ గాంధీ స్వాగతించారు. సీబీఐ డైరెక్టర్‌ను పునః నియమించడంతో కొంత న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. రాఫెల్ కుంభకోణంపై అలోక్ వర్మ విచారణ జరప బోతున్నారనే అర్ధరాత్రి సమయంలో ఆయనను తొలగించారని, తిరిగి నియమించడంతో కొంత న్యాయం జరిగిందని, ఇప్పుడు ఏం జరుగుతుందో చూద్దామని రాహుల్ అన్నారు. రాఫెల్ విమాన ఒప్పందం అవినీతి నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వం తప్పించుకోలేదని, నరేంద్ర మోదీని ఎవరూ రక్షించలేరని, ఎలాంటి అనుమానాలు లేకుండా దేశ ప్రజలకు ప్రధాని పట్టుబడతారని రాహుల్ అన్నారు.

భారత్, నార్వే సహజ భాగస్వాములు






న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా, క్లీన్ ఇండియా వంటి కార్యక్రమాలకు నార్వే సహకారం అందించాల్సిందిగా ఆ దేశ ప్రధానమంత్రి ఎర్న సోల్‌బెర్గ్‌ను భారత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కోరారు. మొదటిసారిగా భారత పర్యటనకు వచ్చిన ఆమె రాష్ట్రపతి భవన్‌లో రామ్ నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య స్నేహపూర్వకమైన బంధాలు ఉన్నాయని, సహజ భాగస్వామ్య దేశాలని రాష్ట్రపతి కోవింద్ అన్నారు. న్యాయం, భిన్న సంస్కృతులు, మానవ హక్కులకు గౌరవం ఇవ్వడంతొపాటు ఇరు దేశాలు ధృఢమైన ప్రజాస్వామ్యాన్ని కలిగివుండడంతో సహజ భాగస్వాములని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు.

ఇందిరా గాంధీ హయాంలో ఇరు దేశాల ద్వైపాక్షిక బంధాలు వృద్ధి చెందాయని, కానీ శక్తి, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాలలో బంధాలు మరింత వృద్ధి సాధించాల్సి ఉందని రాష్ట్రపతి అన్నారు. షిప్పింగ్, పోర్టు నిర్వహణ, చేపల వేట, రక్షణ, శక్తి రంగాల్లో నార్వే సామర్థ్యం ప్రపంచానికి తెలుసునని, మేక్ ఇన్ ఇండియా, స్మార్ట్ సిటీస్, క్లీన్ ఇండియా, సాగర్‌మాల వంటి ప్రాజెక్టులకు నార్వే సహకారం కోరుతున్నామని కోవింద్ వెల్లడించారు.

మోదీతో ఎర్న సోల్‌బెర్గ్ భేటీ

రాష్ట్రపతితో భేటీ అనంతరం ఎర్న సోల్‌బెర్గ్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. కీలకమైన ద్వైపాక్షిక అంశాలపై ఇరువురూ చర్చించారు. సముద్ర ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకరిస్తామని నార్వే ప్రధాని అంగీకరించారు. ఈ మేరకు ఇరుదేశాల మధ్య ఎంఓయూ కుదిరింది. అత్యధిక జనాభా కలిగివున్న భారత్ లాంటి దేశం సహకారం లేకుండా సుస్థిర అభివృద్ధి సాధ్యంకాదని, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సహకరిస్తామని ఎర్న సోల్‌బెర్గ్ స్పష్టం చేశారు. భారతలోని మహిళ సాధికారత తనకు నచ్చిందని ఆమె తెలిపారు. 2017లో జరిగిన జీ-20 సదస్సులో నార్వే ప్రధాని ఎర్న సోల్‌బెర్గ్‌ను తాను కలిసినప్పుడు ఆమె తనకు ఓ ఫుట్‌బాల్ బహుకరించారని, ఈ ఫుట్‌బాల్ గోల్(లక్ష్యం)ను సూచించిందని, సుస్థిర అభివృద్ధికి సంకేతమని, పలు రంగాల సహకారంలో ఇరు దేశాలు విజయవంతమయ్యాని మోదీ అన్నారు.



మా ఊరు-మా రాజ్యం


గ్రామంలో ఉన్న మహారాష్ట్ర తెలంగాణ పాఠశాలలు

ఒక ఊరు.. ఇద్దరు సర్పంచులు

- అక్కడ రెండు రాష్ట్రాల పాలన
- తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో వింత పరిస్థితి
- 12 గ్రామాలు తమవే అంటున్న ఇరు రాష్ట్రాలు
- వివాదాస్పద పంచాయతీల్లో వైచిత్రి

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : అనగనగా ఒక ఊరు.. ఆ ఊరికి ఇద్దరు సర్పంచులు.. అదేంటి ఒక గ్రామానికి ఒకే సర్పంచ్ ఉంటాడు కదా.. అనుకుంటున్నారు కదూ.. నిజమే కానీ అక్కడ ఒక గ్రామానికి ఇద్దరు సర్పంచులు ఉన్నారు. ఇద్దరూ గ్రామాన్ని పాలిస్తున్నారు. ఒక సర్పంచ్ తెలంగాణకు చెందినవారు కాగా, రెండో సర్పంచ్ మహారాష్ట్రకు చెందిన వ్యక్తి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఈ వైచిత్రి కనిపిస్తోంది. ఆయా గ్రామాలు తమ వంటే తమవని రెండు రాష్ట్రాలు వాదిస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

పరందోలి.. అంతాపూర్‌లో...


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా , కెరమెరి మండలంలో ఈ గ్రామాలున్నాయి. పరందోలి , అంతాపూర్ గ్రామపంచాయతీల్లో రెండు రాష్ట్రాలకు చెందిన సర్పంచులు పనిచేస్తున్నారు. దానికి కారణం ఆ గ్రామాలు రెండు రాష్ట్రాల పాలనలో ఉండటమే. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదంగా మారిన గ్రామ పంచాయతీల్లో రెండు రాష్ట్రాల పాలన సాగుతోంది.అక్కడ తెలంగాణ సర్పంచ్ ఒకరు, మహారాష్ట్ర సర్పంచ్ ఒకరు పనిచేస్తున్నారు. ఈ పరిస్థితి గత 50 ఏళ్లుగా కొనసాగూతూనే ఉంది. పరందోలి , అంతాపూర్ గ్రామపంచాయతీల పరిధిలోని 12 గ్రామాలు తమవంటే తమవంటూ రెండు రాష్ట్రాలు పట్టుబడుతున్నాయి. కేసు సుప్రీంకోర్టు వరకు కూడ వెళ్లింది. అయినా వివాదం సమసిపోలేదు. రెండు రాష్ట్రాలు ఆ గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయి.

రెండు రాష్ట్రాల తరపున ఎన్నికలు

పరందోలి గ్రామ పంచా యతీకి, అంతా పూర్ పరిధిలోని చికిలి గ్రామ పంచాయతీకి 2015 లో మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లోను ఇక్కడ ఎన్నికలు జరిగాయి. పరం దోలి గ్రామ పంచా యతీకి మహారాష్ట్ర సర్పంచ్‌గా కామ్లె లక్ష్మణ్ సర్పంచ్‌గా వ్యవహరిస్తుండగా , తెలంగాణ సర్పంచ్‌గా వసంత్‌రావ్ సర్పంచ్‌గా వ్యవహరించి మాజీ అయ్యారు. ప్రస్తుతం పరందోలి, అంతాపూర్ గ్రామాలకు మూడో దశలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం అక్కడ మహారాష్ట్ర సర్పంచులు కొనసాగుతున్నారు. వారి కాలపరిమితి ఇంకో రెండేళ్లు ఉంది. పరందోలి గ్రామపంచాయతీలో 1627 జనాభా ఉంది. వారిలో పురుషులు 804, మహిళలు 778 ఉన్నారు. అంతాపూర్ గ్రామపంచాయతీలో 684 మంది జనాభా ఉండగా పురుషులు 350, మహిళలు 334 ఉన్నారు.

ఎవరి ఆఫీసు వారిదే

ఈ రెండు గ్రామపంచాయతీలు రెండు రాష్ట్రాల పాలనలో సాగుతున్నాయి. ఈ గ్రామాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలున్నాయి. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రెండు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. అయితే వివాదస్పదంగా మారిన రెండు గ్రామాల ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. కొంతమంది మహారాష్ట్రలో ఉంటామని అంటుండగా మరికొంతమంది తాము తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటామని పేర్కొంటున్నారు. రెండు రాష్ట్రప్రభుత్వాలు ఈ వివాదం పరిష్కరించనంతవరకు ఈగ్రామాల్లో రెండు రాష్ట్రాల పాలన సాగుతూనే ఉండే అవకాశాలున్నాయి.


పరందోలి గ్రామం

సర్పంచ్‌గా గెలిచి.. ఉన్నత స్థానాల్లో నిలిచి..

పంచాయతీల్లో రాజకీయ పాఠాలు నేర్చిన ప్రముఖులు

- ధన్వాడ సర్పంచ్‌గా శ్రీపాదరావు రాజకీయ అరంగ్రేటం
- స్పీకర్‌గా తనదైన ముద్ర వేసిన దుద్దిళ్ల
- మంత్రులుగా రాణించిన కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సుద్దాల
- అదే దారిలో ఆరెపల్లి, కేతిరి
- రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన జిల్లా నేతలు
- ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ప్రముఖులు

కరీంనగర్ , ప్రభన్యూస్ బ్యూరో :రాజకీయంగా ఉన్నతస్థానాలకు ఎదిగి పేరుప్రతిష్ఠలు పొందిన ఎంద రో జిల్లా నేతలు.. రాజకీయాల్లో తొలి అడుగులు పంచాయతీల్లోనే వేశారు. ఉమ్మడి ఏపీలో స్పీకర్‌గా ఒక వెలుగువెలిగిన స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు మొదలుకొని మంత్రులుగా రాణించిన సుద్దాల దేవయ్య, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ప్రభుత్వ విప్‌గా ఎదిగిన అరెపల్లి మోహన్, జడ్‌పీ చైర్మన్‌గా తనదైన ముద్రవేసిన కేతిరి సాయిరెడ్డి తొలి రాజకీయ పాఠాలు సర్పంచ్‌లుగానే నేర్చుకున్నారు. ఉన్నతస్థా నాలకు ఎదిగి తనదైన ముద్రతో పరిపాలన సాగించిన ఆయా ప్రముఖులు జిల్లాకు ఎంతో పేరుప్రతిష్టలు తీసుకువచ్చారు.

ధన్వాడ సర్పంచ్‌గా శ్రీపాద తొలి అడుగు



కాటారం మండలం, ధన్వాడ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు స్వగ్రామం. సర్పంచ్‌గా పనిచేసి ఆ తరువాతఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా రాణించిన దుదిళ్ల శ్రీపాదరావు 1964-83 వరకు ధన్వాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వరుసగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన హయాంలో రెండు సార్లు గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును దక్కించుకుంది. 1980లో సర్పంచ్‌గా ఉన్నప్పుడు మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నిక య్యారు. 1983, 1985,1989లో వరుసగా మూడుసార్లు మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1984 నుంచి 1989 వరకు శాసనసభ స్పీకర్‌గా పని చేశారు. 1999 ఏప్రిల్ 13న శ్రీపాదరావు నక్సల్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. శ్రీపాద తనయుడు శ్రీధర్‌బాబు ఎమ్మె ల్యేగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లోనూ శ్రీధర్‌బాబు విజయం సాధించారు.

అంతర్గాంలో సుద్దాల దేవయ్య




జగిత్యాల మండలం, అంతర్గాం సర్పంచ్‌గా పనిచేసిన సుద్దాల దేవయ్య జిల్లా పరిషత్ చైర్మన్‌గా, నేరెళ్ల, చొప్పదండి నియోజవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో సహకార మంత్రిగా పనిచేశారు. తెలుగుదేశం హయాంలో జిల్లా రాజకీయాలలో చక్రం తిప్పిన ఆయన తాజా రాజకీయ పరిణామాల్లో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు.

సర్పంచ్‌లుగా తండ్రీ కొడుకులు

సర్పంచ్ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు. టీఆర్ఎస్ పార్టీ నుంచి 2004లో హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది అప్పటి వైఎస్ఆర్ మంత్రివర్గంలో బీసీ సంక్షేమ మంత్రిగా పనిచేశారు. కెప్టెన్ లక్ష్మీకాంతరావు 1981 నుంచి 1994 వరకు సింగాపురం సర్పంచ్‌గా 13 ఏళ్లు పనిచేశారు. 2004లో హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది 2006లో బీసీ సంక్షేమశాఖ మంత్రిగా ఆరునెలలపాటు పని చేశారు. తెలంగాణ కోసం టీఆర్ఎస్ నేత కేసీఆర్‌తో కలసి రాజీనామా చేసి 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో తిరిగి గెలుపొందారు. లక్ష్మీకాంతరావు కుమారుడు ఒడితెల సతీష్‌కుమార్ కూడా 1995- 2001 వరకు సింగాపూర్ సర్పంచ్‌గా పనిచేశారు. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.



మానకొండూరులో ఆరెపల్లి మోహన్



ఆరెపల్లి మోహన్ 1988 నుంచి 2001 వరకు 13 సంవత్సరాలు మానకొండూరు సర్పంచ్‌గా పనిచేశారు. 2007లో మానకొండూరు జెడ్పీటీసీగా ఎన్నికై 2009 వరకు జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. 2009లో జెడ్పీ చైర్మన్‌కు రాజీనామా చేసి మానకొండూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009-14 వరకు ఉమ్మడి రాష్ట్రప్రభుత్వంలో విప్‌గా పనిచేశారు.

జూపాక నుంచి కేతిరి

మాజీ జెడ్పీ చైర్మన్ కేతిరి సాయిరెడ్డి కూడ సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఎదిగిన వారే. సాయిరెడ్డి జూపాక సర్పంచ్‌గా 1970 నుంచి 1974 వరకు పనిచేశారు. 1975లో సమితి అధ్యక్షునిగా, 1976లో రెండోసారి సర్పంచ్‌గా, మళ్లీ సమతి అధ్యక్షునిగా పనిచేశారు. 1983-86 వరకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 1989-94 వరకు హుజురాబాద్ ఎమ్మెల్యేగా పనిచేశారు. వీరంతా గ్రామ స్థాయి నుంచి ఎదగడమే కాదు రాష్ట్ర రాజకీయాల్లో పేరుగడించి తమ ఉనికిని చాటినవారే.

స్వయం సహాయ బృందాలతో గుణాత్మక మార్పు!



పంచాయతీ కథలు 6

పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ప్రతి యేటా ఏప్రిల్ 24న నిర్వహిస్తారు. 1993లో ఇదే రోజున రాజ్యాంగానికి 73వ సవరణ చేయడం ద్వారా పంచాయతీ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం అమల్లోకి రావడంతోనే రాష్ట్రాలకు పంచాయతీల ఏర్పాటుకి, ఎన్నికల నిర్వహణకు వెసులుబాటు కలిగింది. పంచాయతీలకు అధికారాలు కల్పించడం, నిధులు సమకూర్చడం, స్వపరిపాలనా సంస్థలుగా పని చేయడానికి సహాయ సహకారాలు అందించడానికి వీలు కలిగింది. ఏప్రిల్ 24 కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించి ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు, పురస్కారాలు అందచేయడం ఆనవాయితీ.

చైనాలోనూ గ్రామ స్వపరిపాలనే!

గ్రామ పరిపాలన వ్యవస్థ లేని దేశం లేదంటే అతిశయోక్తి కాదు. చివరికి నియంతృత్వ దేశంగా పేరుపడ్డ చైనాలో కూడా బలమైన స్థానిక సంస్థల పరిపాలన ఉండడం విశేషం. ఏ సమాజంలోనైనా ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే స్థానిక సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, పౌర వ్యవహారాలు సజావుగా జరుగుతాయి. అందుకనే ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందంటే స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా ప్రతినిధులు, వారికి దాఖలైన అధికారాలే కారణమని పంచాయతీరంగ నిపుణులంటారు. ఇక మన దేశంలో ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు రిజర్వు స్థానాలు కేటాయించడంతో స్వపరిపాలన కొంత పుంతలు తొక్కింది. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మహిళలకు యాభై శాతం స్థానాలు రిజర్వు చేయాలి. ఈ విషయంలో దాదాపు 20 రాష్ట్రాలు మాత్రమే చర్యలు తీసుకున్నాయి.

స్వయం సహాయక బృందాలను అనుసంధానించాలి..

అయితే పంచాయతీ బాద్యులు ఎవరైతే ఉన్నారో వారు.. గ్రామ సభలను బలోపేతం చేయాలనే ధోరణిలో వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. రాబోయే రోజుల్లో అరవై శాతం గ్రామీణ కుటుంబాలు స్వయం సహాయక బృందాల పరిధిలోకి వస్తాయని, ఈ బృందాలు చైతన్యవంతంగా, ఆర్థిక శక్తితో నిర్ణయాలు తీసుకొని అమలు చేసే శక్తి కలిగి ఉన్నాయని అంటారు.


వారితోనే గుణాత్మక మార్పు

పంచాయతీ వ్యవ హారా ల్లో స్వయం సహాయక బృం దాల పాత్రను తొలుత కేరళలో అమల్లోకి తెచ్చారు. కేరళ మార్గంలో అసోం, జార్ఖండ్, ఒడిషా వంటి మరికొన్ని రాష్ట్రాలు కూడా ప్రయాణించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాయి. పంచాతీలకు మహిళలు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నిక అవుతుండడంతో స్వయం సహాయ బృందాల సమన్వయం తోడైతే ఆయా గ్రామాల స్వపరిపానలనలో గుణాత్మక మార్పు వస్తుందని ఈ రంగ నిపుణులు బలంగా విశ్వస్తున్నారు.

ఉపాధి పథకంలో పంచాయతీలే ఫైనల్!

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రంగంలోకి దిగిన తరువాత పంచాయతీల పనితీరులో కీలక మార్పులు వచ్చాయి. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం ఉపాధి కూలీల బడ్జెట్‌ను రూపొందించే అధికారం పంచాయతీలకు మాత్రమే ఉంది. తొలి ఉపాధి హామీ చట్టంలో పంచాయతీల ప్రస్తావన లేకున్నా.. తరువాత దాన్ని చేర్చడంతో పాటు విచక్షణాధికారాలను కూడా కట్టబెట్టారు.

మేనిఫెస్టో మేమిస్తాం బాండ్‌పై హామీ మీరివ్వండి



సర్పంచ్ అభ్యర్థులకు స్పష్టం చేసిన జనం

- 12 పేజీల ఎన్నికల ప్రణాళికను రూపొందించిన గ్రామస్థులు
- ప్రతి ఇంటికీ ఒక కాపీ అందజేత
- రూ.100 బాండ్ పేపర్‌పై హామీపత్రం రాసిస్తేనే మద్దతు
- మెదక్ జిల్లా లక్ష్మీనగర్‌లో విన్నూత ప్రయోగం

మెదక్ బ్యూరో, ప్రభ న్యూస్: నాయకుల మాయ మాటలు నమ్మి ఓట్లేసి... ఆ తరు వాత హామీలు అమలు చేయకపోతే ఓటర్లు బాధపడే రోజులు పోయాయి. అభ్యర్థులు హామీలు ఇవ్వడం కాదు... ఊరికేం చేయాలో జనమే స్పష్టం చేస్తున్నారు. ఏం చేయాలో ప్రజలే మేనిఫెస్టో సిద్ధం చేసి అవి అమలు చేస్తామంటూ అభ్యర్థులనుంచి వంద రూపాయల బాండ్ పేపర్‌పై హామీపత్రం రాయించుకుంటున్నారు. అందుకు అభ్యర్థులూ సై అంటూ రాసిస్తున్నారు. ఇది మెదక్ జిల్లా లక్ష్మీనగర్‌లో కనిపిస్తున్న కొత్త సంప్రదాయం.

ఆ రోజుల్లో అలా..

ఊరు బాగుండాలంటే నాయకుడు బాగుండాలి..నాయకుడు నిస్వార్థంతో పనిచేస్తే ఊరంతా అభివృద్ధి చెందుతుంది. అలాంటి నాయకులనే ఎన్నుకోవాలని భావించిన లక్ష్మీనగర్ గ్రామస్థులు కొత్త పంథాను ఎన్నుకున్నారు. ముసుగులో గుద్దులాట లేకుండా ఓ కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు పార్టీపరంగా కొనసాగుతాయి. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీరహితంగా నిర్వహిస్తారు. జనరల్ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం మేనిఫెస్టోలను విడుదల చేయడం..తాము చేయాలనుకుంటున్న పనులను అందులో చేరుస్తారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులు తాము చేయాలనుకున్న పనులను ఎన్నికల ప్రచారంలో చెప్పడం ఆనవాయితీ.

ప్రజల మేనిఫెస్టో



ఇందుకు విరుద్ధంగా గ్రామంలో అభివృద్ధి పనులు ఏం చేయాలో గ్రామ ప్రజలే మేనిఫెస్టో తయారు చేసి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు గ్రామస్థులకు అందిస్తున్న ఘటన మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది. ఈ గ్రామంలో 946 మంది గ్రామ జనాభా ఉండగా, 832 మంది ఓటర్లు ఉన్నారు. లక్ష్మీనగర్ గ్రామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 12 పేజీల బుక్‌లెట్‌గా గ్రామ ప్రజల మేనిఫెస్టోగా సిద్ధం చేశారు. గ్రామాభివృద్ధి కోసం అందరు కలసికట్టుగా పనిచేయాల్సిన పనులు, పెండింగ్ పనులను అందులో పొందుపర్చారు. గ్రామసభ నిర్వహణ, సేంద్రీయ వ్యవసాయం, స్వయం ఉపాధి పనులు, యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, వైద్య శిబిరాల నిర్వహణ, స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశాల నిర్వహణ వంటి వాటికోసం వేదికల నిర్మాణం, పశువైద్యశాల, ఫంక్షన్‌హాల్, అతిథి గృహం, గ్రౌండ్ ఏర్పాటుతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కారం, ప్రజల డిమాండ్లు ఇందులో పొందుపర్చారు. ఈ అంశాలన్నింటిపై హామీ ఇస్తూ సర్పంచ్ అభ్యర్థులు రూ.100 బాండ్ పేపర్ మీద ఒప్పంద పత్రం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను గ్రామంలో ప్రతి ఇంటికి అందేలా చేస్తున్నారు.



కోహ్లీ @1

పుజారా @3 పంత్ @ 21

ఐసీసీ తాజా టెస్ట్ ర్యాంకింగ్స్ వెల్లడి





దుబాయ్: ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో విజయ కేతనం ఎగురవేసిన భారత జట్టు ఆటగాళ్లు అటు ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకింగుల్లో కూడా దుమ్ము రేపారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ నెంబర్ 1 బ్యాట్స్‌మన్ ర్యాంక్‌లోనే కొనసాగుతుండగా... సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన చటేశ్వర్ పుజారా ఒక స్థానం మెరుగుపడి 3వ స్థానంలోకి చేరగా, చివరి టెస్ట్‌లో సెంచరీతో కదం తొక్కిన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఏకంగా 21 స్థానాలు మెరుగుపడి 17కు చేరాడు. 1973లో మాజీ వికెట్ కీపర్ ఫారూఖ్ ఇంజనీర్ ఈ ర్యాంకును చేరాడు. కాగా కెప్టెన్, వికెట్ కీపర్‌గానేకాక, విజయవంతమైన బ్యాట్స్‌మన్‌గా పేరుపొందిన ఎంఎస్ ధోనీ తన కెరియర్ బెస్ట్‌గా సాధించినది 19వ ర్యాంకే. పంత్ 2016 ఐసీసీ అండర్ 19 క్రికెట్ వరల్డ్ కప్‌లో స్టార్‌గా మెరిశాడు. నేపాల్‌పై 18 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన పంత్ తన కెరియర్లో తొమ్మిదో టెస్ట్‌ను మాత్రమే ఆడుతూ 159 పరుగులు చేసి టాప్ 20లోకి అడుగు పెట్టాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ప్రారంభంలో పంత్ ఐసీసీ ర్యాంకుల్లో 59వ స్థానంలో ఉన్నాడు. ఒక సిరీస్‌లో 350 పరుగులు చేసి 20 క్యాచులు పట్టి వేగంగా మెరుగుపడ్డాడు.

3వ ర్యాంకులో పుజారా

ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో 521 పరుగులు చేసి ఇరుజట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచిన పుజారా భారత్ చారిత్రాత్మక సిరిస్ గెలుపుకు తోడ్పడ్డాడు. ఈ పర్యటనలో రాణించి తాజా ర్యాంకింగుల్లో మెరుగుపడ్డ మరో బ్యాట్స్‌మన్‌గా పుజారా నిలిచాడు.పుజారా ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకులోకి చేరుకున్నాడు. రవీంద్ర జడేజా బ్యాటింగ్‌లో ఆరు స్థానాలు ఎగబాకి 57కు చేరగా, కొత్తగా టెస్టుల్లోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ ఐదు స్థానాలు ఎగబాకి 62కు చేరాడు. ఈ ర్యాంకింగ్స్ ఇవ్వడానికి కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ ఆడిన రెండో టెస్ట్‌ను కూడా ఐసీసీ పరిగణనలోకి తీసుకుంది.

బౌలర్లలో..

స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆస్ట్రేలియా చివరి టెస్ట్‌లో ఆడి తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి, ఏడు స్థానాలు మెరుగుపడి తన కెరియర్ బెస్ట్ 45కు చేరాడు. జస్ప్రీత్ బుమ్రా మునపటి 16వ స్థానంలోనే కొనసాగుతుండగా, మహ్మద్ షమీ ఒక స్థానం మెరుగుపడి 22కు చేరగా, జడేజా ఒక స్థానం మెరుగుపడి ఐదో స్థానంలో ఉన్నాడు. ఆల్ రౌండర్‌గా జడేజా ఒక స్థానం మెరుగు పడి రెండో స్థానంకు చేరాడు. రెండో స్థానంలో ఉన్న వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ మూడో స్థానానికి దిగజారాడు.

టాప్‌లో భారత్

టెస్టుల్లో భారత జట్టు అగ్ర స్థానం లో కొనసాగుతుండగా, ఆస్ట్రేలియా జట్టు ఒక పాయింట్‌ను కోల్పోయి నప్ప టికి మునప టి ఐదో స్థానంలోనే ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఎడెన్ మర్‌క్రమ్ కేప్‌టౌన్ టెస్ట్ లో పాకిస్తాన్‌తో ఆడుతూ 78 పరుగులు చేసి ఏడు స్థానాలు మెరుగుపడి తిరిగి 10వ స్థానానికి చేరాడు. దక్షిణాఫ్రికాకే చెందిన టెంబా బావుమా టాప్ 30లోకి ప్రవేశించాడు. పాక్‌తో ఆడిన టెస్ట్‌లో 75 పరుగులు చేయడంతో ఐదు స్థానాలు మెరుగుపడి 26కు చేరాడు. కెప్టెన్ డు ప్లెస్సిస్ పాక్‌తో రెండో టెస్ట్‌లో సెంచరీ చేయడంతో ఆరు స్థానాలు ఎగబాకి 16కు చేరాడు. దక్షిణాఫ్రికా బౌలర్ల ర్యాంకులను పరిశీలిస్తే.. వెర్నన్ ఫిలాం డర్ ఒక స్థానం మెరు గుపడి మూడో స్థానా నికి చేరుకున్నాడు. డుయన్నె అలివర్ 36 నుంచి 32కు చేరాడు.

క్రీడాప్రభ

బుమ్రాకు విశ్రాంతి

- ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో ఆడే మ్యాచుల్లో బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్‌కు చోటు
- ఒత్తిడి తగ్గించేందుకే ఈ మార్పు: బీసీసీఐ



సిడ్నీ: త్వరలో ఆస్ట్రేలియాతో, న్యూజిలాండ్‌తో భారత్ ఆడే వన్డే సిరీస్‌లకు భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి నిచ్చారు. బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్‌కు చోటు కల్పించారు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్ట్ సిరీస్‌లో బుమ్రా 21 వికెట్లను తన ఖాతాలో వేసుకోవడమేకాక, సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్‌గా ఆసీస్ బౌలర్ నాథన్ లియాన్‌తో కలిసి అగ్రభాగాన నిలిచాడు. ఈ రెండు సిరీస్‌ల్లో పాల్గొనే జట్లను డిసెంబర్‌లోనే ప్రకటించారు. వాటిల్లో బుమ్రాను చేర్చారు. ప్రపంచకప్ దృష్ట్యా బుమ్రాపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ మార్పు చేసినట్లు బీసీసీఐ పేర్కొంది. 'బౌలర్‌పై మితిమీరిన ఒత్తిడిని తగ్గించేందుకు తగిన విశ్రాంతి ఇవ్వాలని మేము భావిస్తున్నాము. ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్‌తో బుమ్రా తన ప్రతిభను చాటి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో భారత్ ఆడే జట్టుకు మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేశాము' అని మంగళవారం బీసీసీఐ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. న్యూజిలాండ్‌తో ఆడే మూడు టీ20 మ్యాచుల సిరీస్‌కు పంజాబ్ పేసర్ సిద్దార్థ్ కౌల్‌కు అవకామిచ్చాము అని బీసీసీఐ తెలిపింది. వన్డేలు, టీ20ల్లో విశేషంగా రాణిస్తున్న బుమ్రా 12 నెలల క్రితం టెస్టుల్లోకి ప్రవేశించి తన సత్తా చాటి ఫార్మాట్ ఏదైనా తన జోరు తగ్గదని నిరూపించాడు. బుమ్రా, మహ్మద్ షమీ, ఉమేష్ యాదవ్, భువనేశ్వర్ క ుమార్, ఇశాంత్ శర్మ బౌలింగ్ విభాగం అత్యుత్తమంగా రాణించి ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర నిర్వహించింది. బుమ్రాకు విశ్రాంతి కల్పించాలన్న నిర్ణయానికి కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా మద్దతు పలికాడు. టీం మేనేజ్‌మెంట్ తరపున కోహ్లీ ఒక ప్రకటన చేస్తూ.. 'మా బౌలర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మితి మీరిన ఆట వల్ల వారు ఒత్తిడిలో పడిపోతారు. కీలక మ్యాచుల్లో రాణించకపోతే జట్టుకే నష్టం. వారిపై ఒత్తిడి తగ్గించేందుకే.. విశ్రాంతి నిస్తున్నాము. అంతేకాక, మరో ముగ్గురు కొత్త బౌలర్లను వెలికి తీసేందుకు కూడా ప్రక్రియ ప్రారంభించాము' అని కోహ్లీ అన్నాడు. న్యూజిలాండ్ పర్యటనకు ముందు భారత్ ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు ఆడనుంది. అనంతరం జనవరి 23న న్యూజిలాండ్‌లో భారత పర్యటన ప్రారంభమవుతుంది. ఈ పర్యటనలో భారత్ ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచులు ఆడనుంది.

భారత క్రికెటర్లకు బీసీసీఐ నగదు నజరానా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియా ను 71 ఏళ్ల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత ఓడించి టెస్ట్ సిరీస్‌ను గెలిచిన భారత క్రికెట్ జట్టు ఆటగా ళ్లకు భారతీ య క్రికెట్ నియం త్రణ మండలి (బీసీసీఐ) నగదు నజరానలను ప్రకటించింది. విరాట్ కోహ్లీ నేతృ త్వంలోని జట్టు ఆస్ట్రేలి యాను 2-1 తేడాతో ఓడించి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుం ది. ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ... ఈ పర్యటనకు ఎంపికైన జట్టులోనిఅందరు ఆటగా ళ్లకు(రిజర్వ్ ఆటగా ళ్లు,సహాయ సిబ్బందికి కలిపి) నగదు పురస్కా రాలను ప్రకటించింది. బోన స్‌లు మ్యాచ్ ఫీగా చెల్లించే అసలు మొత్తానికి సమానంగా ఉంటుంది. చివరి 11మం దిలో ఉన్న ఆటగాళ్లకు ఒక్కొక్కరికి ఒక్కో మ్యాచ్ కు బోనస్ రూపేణ రూ. 15 లక్షలు రిజర్వ్ ఆటగాడికి రూ.7.5 లక్షలు వస్తాయి అని బీసీ సీఐ మంగ ళవారం ఒక ప్రకటన చేసింది. ఈ లెక్కన ఒక్కో ఆటగాడు నాలుగు టెస్టులకు రూ.60 లక్షలు పొంద నుండగా, రిజర్వ్ ఆట గాడు రూ.30ల క్షలు పొం దనున్నా డు. కాగా కోచ్‌లకు తలా రూ. 25 లక్షలు, అందించ నుంది. కోచిం గేతర సిబ్బం దికి వారు పనిచేసిన సమ యాన్ని బట్టి ఇవ్వనున్నట్లు బీసీసీఐ పేర్కొంది. ఆస్ట్రేలియాలో భారత్ ఆడిన తొలి టెస్ట్‌లో గెలు పొందగా, రెండో టెస్ట్‌లో ఆసీస్ గెలి చింది. మూడో టెస్టు ను భారత్ సొం తం చేసుకోగా, చివరి టెస్ట్ డ్రాగా ముగి సింది. ఫలితం గా భారత్ సిరీస్‌ను 2-1 తేడాతో ముగించింది.



కోహ్లీ సేనకు ఇమ్రాన్‌ఖాన్ అభినందనలు



ఇస్లామాబాద్: ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా దేశంగా రికార్డు సృష్టించిన భారత క్రికెట్ జట్టుకు పాకిస్తాన్ ప్రధానమంత్రి, మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ శుభాకాంక్షలు తెలిపాడు. 'విరాట్ కోహ్లీ.. జట్టులోని ఆటగాళ్లకు నా శుభాకాంక్షలు. తొలిసారిగా ఆసీస్ సొంత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచి భారత ఉపఖండం ఘనతను చాటారు. మీకు అభినందనలు. భారత ఉపఖండంలోని ఏజట్టు కూడా ఇప్పటి వరకు ఆస్ట్రేలియాను సొంత గడ్డపై ఓడించలేదు. కోహ్లీసేన ఈ ఘనతను సాధించటం ఉప ఖండానికి గర్వకారణం ' అని ట్వీట్ ఇమ్రాన్ ఖాన్ చేశాడు. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ జట్టు ఆస్ట్రేలియాలో జరిగిన 1992 వన్డే ప్రపంచకప్ సాధించింది. అప్పటినుంచి మళ్లీ పాకిస్తాన్ ప్రపంచకప్‌ను సాధించలేదు. ఇమ్రాన్ 88 టెస్టులు, 175 వన్డేలు ఆడాడు.

56వ ఆలిండియా రైల్వే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

హైదరాబాద్: 56వ ఆలిండియా రైల్వే చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ట్రాక్ అండ్ సైక్లింగ్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి.ఉస్మానియా యూనివర్సిటీలో ఈ పోటీలను దక్షిణ మధ్య రైల్వే ప్రిన్స్‌పల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్ మధుసూధనరావు జెండా ఊపి ప్రారంభించారు. స్క్రాచ్ రేస్ ఈవెంట్లో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన జీత్‌రామ్ గట్, 4కిలో మీటర్ల వ్యక్తిగత పోటీలో దక్షిణ పశ్చిమ రైల్వేకు చెందిన రాజు బటి స్వర్ణాలను గెలుచుకున్నారు.

శ్రీలంకతో వన్డే సిరీస్ న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్

నెల్సన్(న్యూజిలాండ్): శ్రీలంకతో వన్డే సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లో గెలిచిన న్యూజిలాండ్ సిరీస్‌ను ఇప్పటికే గెలుచుకుంది. రాస్ టేలర్ వరుసగా ఆరు వన్డేల్లో 50కి పైగా పరుగులు చేసిన తొలి న్యూజిలాండర్‌గా రికార్డు సృష్టించాడు. భారత్ ఆటగాళ్లు సచిన్ విరాట్‌లు వరుసగా ఐదు వన్డేల్లో 50కి పైగా పరుగులు చేసిన రికార్డును అధిగమించాడు. మియాందాద్(పాక్) వరుసగా 9 వన్డేల్లో 50 ప్లస్ చేసి ప్రపంచ క్రికెటర్లలో ముందున్నాడు. మంగళవారం జరిగిన మూడో వన్డేలో శ్రీలంక టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన కివీస్ జట్టు సెంచరీలతో హోరెత్తించింది. రాస్ టేలర్ 137 (బంతులు 131, ఫోర్లు-9, సిక్స్-4) హెన్రీ నికోలస్ 124 (80బంతులు, ఫోర్లు-12 సిక్స్-3) చేయగా కివీస్ 50 ఓవర్లలో 364/4 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో లంక 41.4 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌట యింది. థిసారా పెరీరా చేసిన 80 పరుగులు చేయగా, మిగతా బ్యాట్స్‌మెన్‌లో ఎవరూ కూడా అర్ధ సెంచ టరీ నమోదు చేయలేదు. కివీస్ బౌలర్లలో ఫెర్గుసన్ 4,ఇష్ సోఢీ3, టిమ్ సౌథీ, నీషమ్‌లు చెరో వికెట్‌ను పడగొట్టారు.

సెమీస్ రేసులో బెంగళూరు

ముంబైపై 5-0తో బెంగళూరు గెలుపు



బెంగళూరు: పీబీఎల్ సీజన్ 4 టోర్నీలో కిదాంబి శ్రీకాంత్ నేతృత్వంలోని బెంగళూరు రాప్టర్స్ జట్టు 5-0 తేడాతో ముంబై రాకెట్స్‌ను ఓడించింది. ఈ గెలుపుతో బెంగళూరు జట్టు సెమీస్ బెర్త్‌ను ఖాయంచేసుకున్నట్లే.. గురువారం చెన్నై స్మాషర్స్‌తో ఆడే చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. టాప్ నాలుగు జట్లలోకి చేరాలంటే బెంగళూరుకు ఇంకా నాలుగు పాయింట్లు కావాల్సి ఉంది. మంగళవారం జరిగిన పోటీలో బెంగళూరు ఆటగాళ్లు వరుసగా నాలుగు మ్యాచుల్లో ముంబైపై గెలిచారు. ఇందులో ట్రంప్‌గా ఆడిన మ్యాచ్‌కూడా ఉంది. మహిళల సింగిల్స్‌లో వు తి ట్రాంగ్ (బెంగళూరు) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి ఎస్ పర్‌దేశి(ముంబై)పై 15-4, 11-15, 15-7తేడాతో ఓడించింది. పురుషుల డబుల్స్‌లో అహసాన్- సటియావాన్(బెంగళూరు) జోడీ 15-11, 15-11 తేడాతో కెజి జంగ్- ఎల్ యాంగ్ దే(ముంబై) జోడీని ఓడించింది. హోరాహోరీగా సాగిన తొలి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 8 కిదాంబి శ్రీకాంత్(బెంగళూరు) 15-14, 15-13 తేడాతో వరల్డ్ నెంబర్ 18 అండర్స్ అంటోన్‌సెన్‌ను ఓడించాడు. రెండో పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ(ముంబై) ట్రంప్ మ్యాచ్‌గా ఆడుతూ బిఎస్ ప్రణీత్(బెంగళూరు) 15-12, 5-15, 13-15 చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎం ఎల్లిస్- ఎల్ స్మిత్ (బెంగళూరు) జోడి 15-13, 15-14 తేడాతో కెజి జంగ్-పీజెడ్ బెర్నాడెత్(ముంబై) జోడీ చేతిలో ఓడింది.

ఐసీసీ 105వ సభ్యదేశంగా యూఎస్ఏ

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య (ఐసీసీ) అమెరికా క్రికెట్‌కు 105వ సభ్యదేశంగా గుర్తింపు నిచ్చింది. ఈ గుర్తింపుతో అమెరికాలో క్రికెట్ అభివృద్ధికి ఐసీసీ నుంచి నిధులను అందుకునేందుకు యూఎస్ఏ క్రికెట్‌కు అర్హత పొందుతుంది. ఈ మేరకు ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ మంగళవారం ఒక ప్రకటన చేశాడు.

ఐపీఎల్ వేదిక మారదు

భారత్‌లోనే టోర్నీ నిర్వహణ: బీసీసీఐ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ భారత్‌లోనే నిర్వహించనున్నట్లు బీసీసీఐ పాలన కమిటీ(సీవోఏ) ప్రకటించింది. మే నెలలో దేశంలో సాధారణ ఎన్నికలు.. మరోవైపు ఇంగ్లండ్‌లో ప్రపంచకప్ మే 30న ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అదే సమయంలో ఐపీఎల్ నిర్వహణ కష్టమని గతంలో అభిప్రాయపడ్డ బీసీసీఐ వేదికను విదేశాలకు మార్చాలని యోచించింది. మంగళవారం జరిగిన సీవోఏ ఛైర్మన్ వినోద్ రాయ్, మాజీ మహిళల కెప్టెన్ సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ సమావేశమై వేదికలు, నిర్వహణ తేదీలపై చర్చించింది. 'కేంద్రం, రాష్ట్రాల ఏజెన్సీలు,అధికారులతో జరిపిన ప్రాథమిక చర్చల అనంతరం.. అత్యంత ప్రజాదరణ పొందుతున్న టీ20 ఫార్మాట్ 12వ ఐపీఎల్ టోర్నీని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించాము' అని బీసీసీఐ ఒక ప్రకటన చేసింది. ఐపీఎల్-2019 టోర్నీ మార్చి 23న ప్రారంభించాలని ప్రతిపాదించాము. పూర్తి షెడ్యూల్‌ను సంబంధిత అధికారులతో చర్చించి ఖరారు చేస్తాము అని బీసీసీఐ పేర్కొంది. 2009 ఎన్నికలప్పుడు ఐపీఎల్ టోర్నీ దక్షిణాఫ్రికాలో జరుగగా, 2014లో యూఏఈలో జరిగింది.

ఆస్ట్రేలియా ఓపెన్ క్వాలిఫయర్ పోటీలు అంకిత, రామ్‌కుమార్ ముందుకు

కర్మన్ కౌర్ ఓటమితో నిష్క్రమణ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ క్వాలిఫైయర్ పోటీల్లో భారత టెన్నిస్ ఆటగాళ్లు రామ్‌కుమార్ రామనాథన్, అంకిత రైనా తమ ప్రత్యర్థులపై వరుస సెట్లలో విజయం సాధించి ముందుకు సాగుతుండగా, కర్మన్ కౌర్ తాండి ఓటమితో నిష్క్రమించింది. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో 21 సీడెడ్ రామ్‌కుమార్ స్పెయిన్‌కు చెందిన సెర్జియో గుటెరెజ్-ఫెర్రోల్‌ను 6-3, 6-2 తేడాతో ఓడించాడు. మ్యాచ్ అనంతరం రామ్‌కుమార్ మాట్లాడుతూ.. పోటీ హోరాహోరీగా సాగింది. నేను సర్వీస్ చేసిన గేమ్‌లో 2-2తో చాలా దీర్ఘమైన ర్యాలీని ఆడాము. చివరికి ఫలితం నావైపే వచ్చింది. కొత్త బంతి వచ్చిన తర్వాత నేను ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశాను. నేను సర్వీస్‌లను భాగా చేశాను. అవి నాకు ఉపకరించాయి అని వివరించాడు. ప్రజ్నేష్ గుణేశ్వరణ్ తన పోటీని బుధవారంనాడు క్రొయేషియా ఆటగాడు విక్టర్ గాలోవిక్‌తో ప్రారంభించనున్నాడు. మూడోసారి తన గ్రాండ్‌స్లామ్ క్వాలిఫైయర్స్‌లో పాల్గొంటున్న 205వ ర్యాంకులో ఉన్న అంకిత రైనా ఫ్రాన్స్‌కు చెందిన 238వ క్రీడాకారిణి మైర్‌టిల్లే జార్జెస్‌ను 6-2, 6-2 తేడాతో ఓడించి తర్వాత రౌండ్‌కు అర్హత సాధించింది. 'గత ఆరు నెలలుగా నా సర్వీసులను మెరుగుపర్చేందుకు శ్రమిస్తున్నాను. ఈ రోజు నాకు ఫలితం వచ్చింది. ఈరోజు నేను చేసిన సర్వీసుల్లో చాలాసార్లు ఫలవంతమైనాయి. అనుకోకుండా జరిగే తప్పిదాలపై నియంత్రణ సాధించాను ' అని అంకిత మ్యాచ్ అనంతరం పేర్కొంది. తర్వాత రౌండ్లో అంకిత స్పెయిన్‌కు చెందిన 140వ ర్యాంక్ క్రీడాకారిణి పౌలా బడోసా గిల్‌బెర్ట్‌తో తలపడనుంది. తొలిసారిగా గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆడుతున్న కర్మన్ కౌర్ తాండి వరల్డ్ నెంబర్ 115 క్రీడాకారిణి జెన్నిఫర్ బ్రాడీతో పోరాడి ఓటమిని పొందింది. కర్మన్ 0-6, 5-7 తేడాతో పరాజయం పాలైంది.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively **I**nteraction **F**or **E**ver
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
బుధవారం 9 జనవరి 2019



వెబ్ సిరీస్ వీరులు

విజయం వైపే... ఈ పరుగు!

సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో మొదటి వెబ్ సిరీస్ విడుదల చేసిన యువబృందం

వెబ్ సిరీస్...ఇప్పుడు యువతని బాగా ఆకట్టుకుంటున్న వినోదమాధ్యమం ఇది. యువత కోసం యువత తీస్తున్న వినూత్న చిత్రాలు ఇవి. నెట్ ఫ్లిక్స్, అమెజాన్, జిఫైవ్ లాంటి సంస్థలు వినోదాన్ని రిటైల్ గా ఇంటింటికీ చేరుస్తున్న నైపథ్యంలో సినిమాల పట్ల ఆసక్తి ఉన్న యువతరం వెబ్ సిరీస్ బాట పడుతున్నారు. ఈ కోవలోనే...యూత్‌కి నచ్చేలా మరో సిరీస్ నిన్ననే జి5 యాప్ (ఓటిటి ప్లాట్ ఫామ్) వేదికగా విడుదలైంది. జి5 యాప్‌లో 'ఎక్కడికీ ఈ పరుగు'తో ఒకేసారి మొదటి సిరీస్‌లోని మొత్తం ఆరు ఎపిసోడ్స్‌ని విడుదల చేశారు. ఈ సిరీస్‌కి జివి అనురాగ్ నిర్మాత కాగా కె. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించారు. తెలుగుసినీ హీరోలు ఆర్యన్ రాజేష్, శశాంక్ ఇందులో హీరోలుగా నటించారు. ఔత్సాహికులైన యువతకు తమ ప్రతిభని నిరూపించుకునేందుకు చక్కని వేదికగా వెబ్ సిరీస్ పేరు తెచ్చుకుంటున్న నేపథ్యంలో... తమ సిరీస్ సైతం ఇంటిల్లిపాదీని ఆకట్టుకుంటుందంటున్నారు...సిరీస్ యూనిట్. వారితో ఆంధ్రప్రభ లైఫ్ జరిపిన చిట్ చాట్ మీకోసం-

'మీడియా ఎన్ని రూపాల్లో జనం మధ్యకు దూసుకువస్తున్నా...సినిమాలదే అగ్రస్థానం'...అనే మాటని నేటితరం తుడిచేసే ప్రయత్నాలు చేస్తున్నది. సినిమా అంటే ప్రేమ, నటన అంటే ప్యాషన్, దర్శకత్వం అంటే ప్రాణం అంటున్న యువతరం...ఇప్పుడు సినిమా అవకాశాలకోసం పడిగాపులు పడే పరిస్థితి లేదు. ప్రతిభని నిరూపించుకునే వేదికలను డిజిటల్ మీడియా విస్తృతంగా అందిస్తోంది. యువతరం దానిని నూటికి నూరుపాళ్లు సద్వినియోగం చేసుకుంటోంది. ఈ క్రమంలో వచ్చిందే 'ఎక్కడికీ ఈ పరుగు'. దీనిని తెలుగుతో పాటు హిందీ, మలయాళం, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళ భాషల్లో సైతం విడుదల చేశారు.

ఆసక్తికరమైన కథ కథనాలు

సిరీస్ మొత్తం ఒక యువతి మిస్సింగ్ చుట్టూ తిరుగుతుందని...ఆ క్రమంలో సస్పెన్స్ థ్రిల్లర్ గా కథ నడుస్తుందని ఇందులో ఒక హీరో అయిన మధుర్ ఆనంద్ పాత్రలో నటించిన శశాంక్ తెలిపారు. ఆర్యన్ రాజేష్ మరో హీరోగా పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. వారిద్దరి మధ్య ఫైట్ ఉంటుందని...చివరివరకు పోలీస్ అధికారి పేరుని వెల్లడించడం లేదని సిరీస్‌ని మంచి కథనంతో...ఆసక్తిగా చూడాలనిపించేలా రూపొందించామని శశాంక్ అన్నారు. ఒక హీరోయిన్‌గా పావని గంగిరెడ్డి నటించగా... మరో హీరోయిన్ కల్పికా గణేష్. కథలో నాలుగు ప్రధాన పాత్రలతో పాటు కిడ్నాప్ గ్యాంగ్ కూడా ఉంటుంది. కథ మూడు ప్రత్యేక విభాగాలుగా సాగుతూ...ఒకదానికి మరొకటి అనుసంధానమై ఉంటుందని శశాంక్ అన్నారు. శశాంక్ పోషించిన మధుర్ ఆనంద్ పాత్ర చెఫ్. కాగా అతని భార్య వైష్ణవి మిస్సింగ్ చుట్టూ కథ తిరుగుతుంది. ప్రతి ఎపిసోడ్‌లో క్యూరియాసిటీ, టెంపో ఉంటాయని, అసలు ఏం జరిగింది... ఎవరు కిడ్నాప్ చేశారు... ఒక అమ్మాయి ఇండిపెండెంట్‌గా బతకాలి అంటే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాలి...అనే అంశాలు...కథను ఉత్సుకత రేకెత్తేలా నడిపిస్తాయని... అంతర్లీనంగా సామాజిక స్పృహ కూడా ఉంటుందని శశాంక్ తెలిపారు.

రానున్నకాలం వెబ్ సిరీస్‌లదే...

మొబైల్స్‌లో అందుబాటులో ఉంటూ యువతని బాగా ఆకట్టుకుంటున్న వెబ్‌సిరీస్...నట్టిళ్లలో రాజ్యమేలుతున్న టివీ సీరియల్స్‌ని డామినేట్ చేయగలవా...అని ప్రశ్నించగా తప్పకుండా చేయగలవన్నారు ఆర్యన్ రాజేష్. ఒక్క ఎపిసోడ్ చూస్తే మొత్తం చూడాలనిపించేత గ్రిప్‌తో తమ సిరీస్ కథనం సాగుతుందని...కథ కథనాలు అంతగా ఆకర్షించడం వల్లనే తాను ఇందులో నటించానని రాజేష్ తెలిపారు. 'ఇండియాలో ఇప్పుడిప్పుడే వెబ్ సిరీస్ ఆరంభం అయ్యాయి. బయట దేశాల్లో ఇవి సినిమాల కన్నా కూడా పాపులర్ అయ్యాయి. ఇది ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్. అంటే ఎదుగుతున్న రంగం ఇది. విదేశాల వెబ్‌సిరీస్‌ల్లో ఎక్కువ థ్రిల్లర్స్ ఉంటాయి. ఎందుకంటే థ్రిల్లర్స్ చూడటానికి అందరూ ఎక్కువ ఇష్టపడతారు.' అని ఆయన అన్నారు. 'ఈ కంటెంట్, ఈ ప్లాట్‌ఫాంలో చాలా బావుంటుందనిపించింది. సస్పెన్స్ కంటెంట్ ఉన్నపుడు సక్సెస్ అయిన సందర్భాలున్నాయి. యువతే కాకుండా మా సిరీస్ అందరికీ నచ్చుతుంది' అన్నారు రాజేష్. ఇప్పటి వరకు వెబ్ సిరీస్ రూపకల్పనలో ఎలాంటి ప్రభుత్వపరమైన నియంత్రణలు లేవని ఆయన అన్నారు.

ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసి...

అభిలాష్ అనురాగ్ ఇద్దరూ ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేశారు. అభిలాష్ మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ కూడా పూర్తి చేశాడు. ఇంతకుముందు అభిలాష్ యధార్థం అనే షార్ట్ ఫిలిం తీశాడు. ఒక గంట నిడివి ఉన్న ఈ చిత్రాన్ని క్రౌడ్ ఫండింగ్‌తో చేసినట్టుగా అతను చెప్పాడు. ప్రొడ్యూసర్ అనురాగ్.... బి.కామ్ గ్రాడ్యుయేట్. ఫిలింమేకింగ్‌తో పాటు థియేటర్ కోర్సు చేశాడు. సినీ రంగంలో కొత్త జనరేషన్ అయిన మీరు ఎలాంటి కొత్తదనం తేవాలనుకుంటున్నారు...అని అడిగినప్పుడు...ఇవాళ రేపు డిజిటల్ మీడియా... ప్రజలను ఎక్కువగా చేరుతోందని...అయితే కేవలం సామాజిక స్పృహ మాత్రమే చూపిస్తామంటే ఎవరూ చూడరని ఈ యువకులు అభిప్రాయపడ్డారు.

- వడ్లమూడి దుర్గాంబ
శ్రీదేవి కవికొండల

కథను చెప్పడానికి ఇదో మార్గం

వెబ్‌సిరీస్‌లు సమాజానికి దగ్గరగా సజీవమైన పాత్రలతో వస్తున్నాయి. అవి జనాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటివరకు వెబ్‌సిరీస్‌గా వచ్చినవన్నీ ఎక్కువగా కామెడీ కుటుంబపరమైన కథనాలే. మేము వినూత్నంగా సస్పెన్స్ థ్రిల్లర్‌తో వచ్చాం. కథ అందరికీ నచ్చుతుందనే ఈ ప్రయత్నం చేశాం. ఒక కథని చెప్పాలని అనుకున్నపుడు దానిని ఏ ఫార్మాట్‌లో నైనా చెప్పవచ్చు...మేము వెబ్ సిరీస్ విధానాన్ని ఎంపిక చేసుకున్నాం. కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. సస్పెన్స్‌తో పాటు ఇందులో ఎమోషనల్ డ్రామా ఉంది.



-అభిలాష్

ప్యాషన్‌తో వచ్చా!

సినిమాల మీద ప్యాషన్‌తోనే ఈ రంగంలోకి వచ్చాను. కథ నచ్చడం వల్లనే క్రౌన్ నెట్‌వర్క్‌బ్యానర్ తో దీని నిర్మాతగా వ్యవహరించాను. డిజిటల్ మీడియా వచ్చాక సినిమా రంగంలో తమని తాము నిరూపించుకోవాలనుకునే మాలాంటివారికి ఒక మంచి వేదిక దొరికింది. అవకాశాలను సృష్టించుకునే అవకాశం ఇప్పుడు మా చేతుల్లో ఉన్నట్టయింది. ప్రతిభని నిరూపించుకునేందుకు పడిగాపులు పడాల్సిన అవసరం లేకపోవటం... ఒక మంచి పరిణామం.



-అనురాగ్

వీటిని ఇప్పుడు బాగా చూస్తున్నారు

వెబ్ సిరీస్ ఒక ప్రత్యేక ఫార్మాట్. సినిమాకు దీనికి చాలా తేడా ఉంది. తెలుగులో వెబ్ సిరీస్ పూర్తిస్థాయి థ్రిల్లర్ కథాంశంతో రాలేదు. కామెడీ, డ్రామా, లవ్ ఎక్కువగా తీశారు. ముద్దపప్పు ఆవకాయ... మొదటి వెబ్‌సిరీస్. యుట్యూబ్‌లో వచ్చింది. అప్పుడు ఒటిటి ప్లాట్‌ఫాంలు ఏం లేవు. మా 'ఎక్కడికీ ఈ పరుగు'...అందిస్తున్న జి5కూడా...అమెజాన్ నెట్‌ఫ్లిక్స్ తరహాలో జనంలోకి వెళుతోంది. పిల్ల, ముద్దపప్పు ఆవకాయ, గ్యాంగ్‌స్టార్, మన ముగ్గురి లవ్‌స్టోరి లాంటివన్నీ వెబ్ సిరీస్‌ల పట్ల జనంలో ఆసక్తిని పెంచాయి. మనవాళ్లు వీటిని చూడటానికి అలవాటు పడుతున్నారు. మన కుటుంబాలకు దగ్గరగా, సమాజంలో పాత్రల్లాగే అనిపించే కథలు వెబ్ సిరీస్‌ని ఆసక్తికరంగా మార్చేస్తున్నాయి



-శశాంక్

ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు మంచి అవకాశం

ఈ స్క్రిప్ట్ బాగా నచ్చింది నాకు. నా క్యారక్టర్ కూడా నచ్చింది. నాకు శశాంక్ బాగా పరిచయం. తన ద్వారా డైరక్టర్ అండ్ టీమ్ పరిచయం అయ్యారు. దేనికైనా కథే ప్రధానం. కంటెంట్ నచ్చడం వల్లనే వెబ్ సిరీస్ చేశాను. కొత్త డైరెక్టర్, కొత్త ప్రొడ్యూసర్, అసలు ఎలా చేస్తారో...అనే అనుమానం ఉండేది. కానీ సిరీస్ మేకింగ్ గురించి వాళ్లు చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పడం వలన... ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రేక్షకులకు తిరిగి దగ్గరయ్యేందుకు ఇది మంచి మార్గంలా అనిపించింది. సినిమాకు వచ్చి మూడుగంటలు కూర్చునే పనిలేకుండా ఎప్పుడుకావాలంటే అప్పుడు చూసి వినోదాన్ని పొందగల అవకాశం ఇలాంటి సిరీస్‌లు అందిస్తున్నాయి. కాలపరిమితి చూడకుండా కథలను సమగ్రంగా చెప్పే అవకాశం ఈ విధానంలో ఉంది.



- ఆర్యన్ రాజేష్

* రంగవల్లిక *




13 చుక్కలు
7 వరుసలు 7 వరకు
సరిచుక్క

ఆర్. హేమలత సురేఖ
విజయవాడ
కృష్ణాజిల్లా




వి. బిజవ్వ
8వ తరగతి
బైంసా





ఐ.సత్య
తాండూరు

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు సరిచుక్క



19 చుక్కలు
1 వరకు
సరిచుక్క

కవితా ప్రసాద్
నారాయణపేట



మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ C/O ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75,
ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

బాధకు కారణం ఏమిటి?

చింతన

ఎన్ని సమస్యలు ఉన్నా ఎవరికైతే గురువు దయ ఉంటుందో వారికి ధైర్యం సడలిపోదు. ఎన్ని బాధలు కలిగినా నేను వీటన్నిటికీ అతీతమైన ఆత్మ స్వరూపాన్నన్నే జ్ఞానం మాత్రం అలాగే నిలిచి ఉంటుంది. ఎప్పుడు దుఃఖం కలిగినా అది మనసుకేనని, ఆత్మకు కాదని అసలు నేనంటే ఏమిటనే మంత్రాన్ని పదేపదే విచారించడం వల్ల మనసు తేలికపడుతుంది.

మనిషన్నాక సుఖదుఃఖాలు, బాధలు, ఆనందం వంటివి ఉంటాయి. 'నాకే బాధలూ లేవు' అంటుంటారు. అలా అనుకునే వారికి ఒక నమస్కారం. 'నాకెప్పుడూ బాధలే' అని కాని, అప్పుడప్పుడూ ఏవో బాధలు వస్తుంటాయని కాని అనిపిస్తూ ఉండేవారు ఉంటారు. వారి కోసమే ఈ విషయాలు.

ఏదైనా బాధ వచ్చినపుడు 'నన్ను బాధపెట్టేదెవ్వరు? అని ప్రశ్నించుకోవాలి. ఏమి సమాధానం వస్తుందో పరిశీలించాలి. ఆ సమాధానం అనేక రకాలుగా ఉండవచ్చు. బాధలకు కొన్ని కారణాలు ఈ కింద ఉన్నాయి. మన బాధకు వాటిలో ఏవి కారణమో ఆలోచించాలి.

వ్యక్తులు, పరిస్థితులు

ఉదాహరణ: భార్య, భర్త, పిల్లలు, అత్త, కోడలు, దాయాదులు, ఇరుగు పొరుగు, స్నేహితులు, పై అధికారులు, కింద పనిచేసేవారు, అప్పిచ్చినవారు, అప్పు తీసుకున్నవారు, మోసం చేసినవారు, ప్రభుత్వోద్యోగులు, అనారోగ్యం, డాక్టర్, మన ఊరు, మన దేశం, దేశాన్ని నడిపేవారు, వాతావరణం, అతివృష్టి అనావృష్టి, అధర్మం, అవినీతి, దేశ ఆర్థిక పరిస్థితులు, చుట్టూ ఉన్న సంఘం, గురువు, శిష్యులు, ఇల్లు, పొలం, ఆస్తిపాస్తులు , పశువులు వగైరా.

నేను

అసమర్థత, తెలివితక్కువ తనం, గుడ్డిగా నమ్మటం, జాలి, అనారోగ్యం, దురదృష్ట జాతకం, పూర్వ జన్మ పాపం, ఇలా తనను తాను నిందించుకోవడం.

దేవుడు లేదా గ్రహాలు


వాస్తు, ముహూర్తం, శాపం, చేతబడి వంటివి. పూజలు, మొక్కులు వ్యర్థమయ్యాయి, అసలు దేవుడు ఇంత ఘోరమైన ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడోవంటి భావాలు.

ప్రారబ్ధం

అనుభవించక తప్పదు, ఇప్పుడు మంచి చేస్తే ముందైనా సుఖం ఉంటుంది అనే భావన.

మనస్సు

సంకల్పాలు, వాసనలు, ప్రపంచం, వ్యక్తులు, పరిస్థితులు ఎలా ఉంటే ఏమిటని చూసే పద్ధతిలో మార్పు వస్తే బాధ ఉండదు. రాగద్వేషాలు, సుఖ దుఃఖాలు, బాధలు, అన్నింటికి కారణం మనస్సే.



జన్మ

శరీరాన్ని ధరించటం లేదా అజ్ఞానం అంటే తాను సచ్చిదానంద సాక్షి స్వరూపాన్ని తెలుసుకోకపోవడం.

దుఃఖము లేదా దుఃఖ కారణమూ లేదు. దుఃఖాన్ని అనుభవించే భోక్త లేడు. అన్నీ తెరమీది బొమ్మలు లాగా జరుగుతున్నాయి.

వీటిలో మీ బాధలు దేని వల్ల కలుగుతున్నాయి. వాటి పరిష్కారానికి ఎటువంటి మార్పులు అవసరమో ఆలోచించుకోవాలి.

బాధలకు నివారణా మార్గాలు

ఎన్ని సమస్యలు ఉన్నా ఎవరికైతే గురువు దయ ఉంటుందో వారికి ధైర్యం సడలిపోదు. ఎన్ని బాధలు కలిగినా నేను వీటన్నిటికీ అతీతమైన ఆత్మ స్వరూపాన్ననే జ్ఞానం మాత్రం అలాగే నిలిచి ఉంటుంది.

ఎప్పుడు దుఃఖం కలిగినా అది మనసుకేనని, ఆత్మకు కాదని అసలు నేనంటే ఏమిటనే మంత్రాన్ని పదేపదే విచారించడం వల్ల మనసు తేలికపడుతుంది. గురుబోధ వంటివి చదివితే దానిలోని విషయాలు గుర్తుకు వస్తాయి. వాటి వల్ల సాంత్వన లభిస్తుంది. భగవద్గీతను అర్థం తెలుసుకుని చదివితే ఉత్సాహం ధైర్యం వస్తాయి. కర్మను కూడా యోగముగా చూడమంటుంది గీత,

అన్నిటిని సాక్షి భావంతో చూడడం

ప్రపంచానికి సాక్షి, శరీరానికి సాక్షి, సంకల్పాలకు (భావాలు వికారాలకు) సాక్షి, అహంకారానికి సాక్షి, ప్రపంచం నుంచి అహంకారం వరకు అన్నింటినీ కలిపి ఒకే బొమ్మగా చూచే అఖండ సాక్షి. ఇందువల్ల భావాతీత క్రమంలో పరిపూర్ణత సిద్ధిస్తుంది.

సానుకూల దృక్పథం

ఇక సానుకూల దృక్పథంతో చూడడం (ఇది మనస్సుకు సంబంధించినది) కొంతవరకూ బాధల నుంచి నివారణకు తోడ్పడుతుంది.

కొన్ని బాధల నివారణ మన చేతిలోనే ఉంటుంది. ఉదా: అనారోగ్యం బాధను వైద్య చికిత్స వంటివాటి ద్వారా నివారించుకోవచ్చు. అందుకే బాధ ఎవరి వల్ల వస్తోందో గ్రహించాలి. మన ప్రవర్తనలో లోపాలుంటే మార్చుకోవడం ద్వారా కొన్ని బాధలను నివారించు కోవచ్చు. అందుకే బాధ ఎవరి వల్ల వస్తోందో పరిశీలించాలి.

సర్వేజనాస్సుఖినో భవంతు

- కోసూరు హయగ్రీవరావు
9949514583


తిరుప్పావై

పాశురం 25

ఒరుత్తి మగనాయ్ పిఱన్దు, ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగి త్తాన్ తీఙ్గు నినైన్ద
కరుత్తై ప్పిళ్ళైప్పిత్తు క్కఞ్జన్ వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱనెడు మాలే! యున్నై
అరుత్తిత్తు వన్దోమ్; పఱై తరుతియాకిల్,
తిరుత్తక్కశెల్వముమ్ శేవకముమ్ యామ్పాడి
వరుత్తముమ్ తీర్న్దు మగిళ్ న్దేలో రెమ్బావాయ్

తాత్పర్యం

తనను చతుర్బాహు స్వరూపంతో కుమారునిగ కనవలెనని కోరిన సాటిలేని దేవకీ దేవికి ఒక రాత్రి కుమారుడై పుట్టి, అదే రాత్రి బాల చేష్టలను కనవలెనని తపమాచరించిన మరొక అద్వితీయమైన యశోదమ్మ ముద్దు బిడ్డవై రహస్యముగ పెరుగుచుండ, ఆ వార్తను విని కంసుడు సహించలేక నీకు అపకారము చేయ తల్చగనే అతని అభిప్రాయము వ్యర్థమగునట్లు చేసి ఆ కంసుని కడుపులో నీవే కారుచిచ్చువలె అయి అతనిని సంహరించి, నిన్ను మాకనుగ్రహించిన మాపై దీర్ఘ వ్యామోహము కల వాడా! నిన్నే మేము యాచింపవచ్చినాము. పఱై అను వాయిద్య విశేషమున్ను ఇచ్చినచో శ్రీలక్ష్మీదేవి కూడ అభిమానించు నీ ఐశ్వర్యమును, అమె వినగోరు నీవీరచరితము లనేకములను మేము పాడి, నిన్ను పొందుటకై యింతవరకు పడిన శ్రమలన్నిటిని మరచి ఆనందింతుము.



పాశురం 26

మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్;
మేలైయార్ శెయ్వనగళ్ ;వేణ్డువనకేట్టియేల్ ;
ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్జ శన్నియమే
పోల్వన శఙ్గఙ్గళ్ , పోయ్ప్పాడు డైయనవే,
శాల ప్పెరుమ్ పఱైయే,పల్లాణ్డిశైప్పారే,
కోలవిళక్కే, కొడియే, వితానమే,
ఆలినిలై యాయ్! అరుళేలో రెమ్బావాయ్.


తాత్పర్యం

ఆశ్రితులయందత్యంత వ్యామోహము కలవాడా! ఇంద్రనీల మాణిక్య వర్ణుడా! మార్గశీర్ష మాసమున స్నానవ్రతమాచరించదలచితిమి. మా పూర్వులున్నూ ఈ స్నానవ్రతమాచరించి యున్నారు. వారాచరించిన విధానమును, అందులకవసరమగు పరికరములను నీవు దయ చేసి వినునట్లయితే తెలిపెదము. భూమండలమునంతయు వణికింపజేయునంత పెద్ద ధ్వనినిచ్చు, పాలవలె స్వచ్ఛమై, తెల్లనైన రంగు కల నీ పాంచజన్య శంఖమునే పోలిన అనేక శంఖములు కావలయును. ఒక మంగళ దీపము కావలయును. పెద్ద గరుడ ధ్వజము కావలయును. విశాలమైన చాందినీలున్నూ కావలెను. యివన్నియు నీవివ్వ గలిగినవే. లోకములను బొజ్జలో దాల్చి ఒక లేత మఱ్ఱి యాకుపై పవ్వళించిన నీకు చేత కానిదేమి ఉన్నది తండ్రీ! కరుణించుమా!



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

కర్ణునికి పరశురాముని శాపం



భారతంలో కర్ణుని గురించి తెలియనివారుండరు. అతను ఎన్నో శాపాలకు గురైనవాడు. క్షాత్ర విద్యల నిమిత్తం పరశురాముని వద్ద శిష్యునిగా చేరాడు. పరశురాముడు అన్ని విద్యలూ నేర్పాడు. ఒక రోజు పరశురాముడు కర్ణుని ఒడిలో తలపెట్టుకుని నిద్రకుపక్రమించాడు. కర్ణుడు దివ్యాస్త్రాలు ఉపదేశం పొందితే అర్జునునికి కష్టమని, లోకం అనుకుంటున్నట్టుగా అతను సూతుడనే విషయం బయటపెట్టాలని ఆలోచించి ఇంద్రుడు పథకం పన్నాడు. ఒక కందిరీగ రూపం ధరించి పరశురాముడు తలపెట్టుకున్న వైపున కర్ణుడి తొడను కుట్టటం ప్రారంభించాడు. అయితే గురువుకు నిద్రాభంగం కలిగితే తనను శపిస్తాడని పంటి బిగువున బాధను అదిమి పెట్టుకున్నాడు. కొంత సేపటికి కందిరీగ కుట్టిన చోట నుంచి వచ్చిన రక్తం పరశురాముని తలకు తగిలింది. ఆ తడికి ఆయనకు మెలకువ వచ్చి లేచాడు. కర్ణుని తొడ నుంచి కారుతున్న రక్తాన్ని చూశాడు. వెంటనే ఆయన ఆలోచించాడు. క్షత్రియుడైనవాడు ఇటువంటి బాధకు కారణమైన వారిని ఒదిలిపెట్టడు. వారికి సహనం తక్కువ అని ఆలోచించాడు. నీవు క్షత్రియుడివి కాదు. నాతో అబద్ధం చెప్పావు. అందువల్ల ఆ విధంగా నా వద్ద నేర్చిన విద్య నీకు ఉపయోగపడదు అని శపించాడు. అయితే గురు శాపంతో కర్ణుడు డీలా పడిపోలేదు. దుర్యోధనుని పంచన చేరాడు. రాజయ్యాడు. దాన కర్ణుడిగా, శూరునిగా పేరొందాడు. ఐతే కర్ణుణ్ణి భూమాత, ద్రోణుడు, కృపాచార్యుడు, ఒక బ్రాహ్మణుడు శపించాడనే కథలున్నాయి. 'అరయుంగా కర్ణుడీల్లై ఆర్పురి చేతన్' అనే నానుడి పుట్టింది.

శాపగ్రస్తుల కథా కమామిషు-13

అర్జునునికి

పాండవుల వనవాసం పన్నెండేళ్లు ముగిసింది. అర్జునుడు ఇంద్రలోకం సందర్శించి ఇంద్రునిచే సన్మానాలూ, సత్కారాలూ పొందాడు. అక్కడ ఉన్నప్పుడు ఇంద్ర సభలో నాట్యం చేసే ఊర్వశి అర్జునుని ఏకాంతంగా చూసి అతని చేయి పట్టుకుంది. 'నీవు నాకు తల్లితో సమానం. నేనూ, శ్రీహరి నరనారాయణులుగా తపస్సు చేస్తున్న పుడు నీవు నారాయణుని ఊరువుల నుంచి జన్మించి ఊర్వశివయ్యావు. అందునా నీపై నాకా దృష్టిలేదు' అని అన్నాడు. అయితే ఊర్వశి 'ఇది దేవేంద్ర లోకం, ఇక్కడ అటువంటి బంధాలుం డవ'ని మళ్లీ అతనిని సమీపించింది. దానితో అర్జునుడు ఆమెను విదిలించుకుని దూరం జరిగాడు. ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 'ఇక్కడున్న నలుగురు అప్సరసల్లోనూ మిన్న అయిన నన్ను నీవు తిరస్క రిస్తున్నావు నీవు నపుంసకుడిగా బతుకు' అని శపించింది. అర్జునుడు కంగారు పడ్డాడు. అయితే ఇంద్రుడు ఈ విషయం తెలుసుకుని ఊర్వశి ఇచ్చిన శాపం మునుముందు అజ్ఞాతవాసంలో ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందని తెలిపాడు. ఆ శాపం అర్జునునికి ఏ విధంగా ఉపయోగపడిందీ విరాట పర్వం చదవితే అర్థమవుతుంది.

ధర్మ దేవతకు

మాండవ్య మహర్షిని ప్రాణాలు వదిలే స్థితి వరకూ పరీక్షించింది ధర్మ దేవత. మహర్షి ఓర్చుకుని తనను అంతగా ఇబ్బంది పెట్టడానికి కారణం అడిగాడు. 'నీలో సహనం ఎంత ఉందో పరీక్షించడానికే' అని సమాధానం ఇచ్చింది దేవత. నా సహనాన్ని ఇంతవరకూ పరీక్షించావు కనుక నీవు ద్వాపర యుగాన సహనం తో ఉండే దాసీ పుత్రునిగా జన్మించు అని మహర్షి శపించాడు. అతడే విదురుడు. దాసీ పుత్రునిగా పుట్టి ధృతరాష్ట్రునికి ఎప్పటికప్పుడు ధర్మబోధలు చేస్తూ వచ్చాడు. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక ధృతరాష్ట్రుడు గాంధారి, కుంతిలతో వానప్రస్థాశ్రమం వెళ్లి అక్కడే శేష జీవితం గడుపుతూ నిర్యాణం చెందాడు.

దుర్యోధనునికి

మహాభారతంలో దుర్యోధనుని పాత్ర అందరికీ తెలిసిందే. పాండవులతో ధర్మంగా మెలగమని ఎందరో అతనికి ధర్మబోధ చేశారు. అతను ఎవరి మాటనూ లక్ష్యపెట్టలేదు. ఒక పర్యాయం మైత్రేయ మహర్షి వచ్చి సభలో అందరూ కొలువుతీరి ఉండగానే దుర్యోధనునికి తనూ హితవు చెప్పాడు ఎంతో నిదానంగా, అనునయంగా. అయితే దుర్యోధనుడు పెడసరంగా, మొండిగా, మూర్ఖుడై, ముసిముసిగా నవ్వుతూ తన కాలిబొటనవేలు నేల రాస్తూ, మధ్య మధ్య తన చేత్తో తొడల మీద తాళం వేస్తూ అహంభావంతో కూర్చున్నాడు. మైత్రేయ మహర్షికి ఒళ్ళు మండింది. 'ఈ అహంభావానికి ప్రతిఫలం అనుభవిస్తావు. యుద్ధంలో భీముడు నీ తొడలు విరగ్గొడతాడు అప్పుడు నీకు మరణం కలుగుతుంది' అని కటువుగా శపించాడు. దుర్యోధనుని పక్షాన ధృతరాష్ట్రుడు ఆయనను శాంతపరచి, క్షమాపణలు కోరి శాప విమోచనం అడిగాడు. 'నీ కొడుకు పాండవులతో స్నేహం చేసుకుంటే నా శాపం ఏమీ తగలదు, లేకపోతే నా శాపానికి తిరుగులేదు' అన్నాడు మహర్షి. దుర్యోధనుడు ఆ శాపాన్ని లెక్క చేయలేదు. కురుక్షేత్ర యుద్ధంలో భీముడు దుర్యోధనుడి తొడలు విరగ్గొట్టాడు.


- డాక్టర్ దేశిరాజు లక్ష్మీ నరసింహారావు
9985844558

కాళికాదేవి

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

1949లో భగవాను చేతికి నాలుగో ఆపరేషను గూడ అయిన వెనుక ప్రస్తుతం నిర్వాణ రూం అని చెప్పబడుతూ వున్న ఆ చిన్న గదికి భగవాను మకాం మార్చారు. అట్లా మార్చిన వెనుక భగవాను సన్నిధిలో ఎక్కువసేపు కూర్చునే అవకాశము లేక నా బసకు, ఆశ్రమానికీ చాలాసార్లు తిరుగుతూ వుండేదాన్ని. భగవానుకు ఎల్లా గున్నదో ఏమోనన్న భయంతో, ఆ తిరగటంలో ఒకనాటి మధ్యాహ్నం, నా బసకు, ఆశ్రమానికి మధ్యలో రోడ్డు నానుకొని వున్న కాళికాదేవి కోవెలలో నేను ఆశ్రమానికి వెళ్లేముందే ఏదో కోలాహలంగా వున్నది. ఏదో పూజ జరుగుతున్నది గాబోలనుకున్నాను.

ఆ వెనుక మేక యొక్క ఆర్తనాదమూ వినిపించింది. ఓహో! బలి జరుగుతూ వున్నది గాబోలనుకున్నాను. అలా ఆర్తనాదాలు నా బసలో వున్నప్పుడున్నూ అప్పుడప్పుడు వినిపించేవే గాని నేనంతగా దానియందు లక్ష్యం పెట్టలేదు. ఇప్పుడు భగవాను శరీరం బాగుండనందువల్ల ఆశ్రమ సమీపంలో ఈ బలులేవూ? అని అనిపించింది. సరే, ఆశ్రమంలో వున్న భక్తులతో భగవాన్ ఆరోగ్యమును గురించి ప్రశ్నించి తెలుసుకొని తిరిగి బసకు బయలుదేరి వస్తూ వుంటే కాళికాదేవి కెదుటనున్న వధ్యశిల మీద రక్తంచిమ్మబడి బీభత్సంగా వున్నది. జనం ఎవ్వరూ లేరు. ఆ రక్తం చూడగానే నా శరీరం కంపించి చెమటలు పోసినవి. అయ్యో? భగవంతుడా! జనమధ్యంలో ఈ బలులేమి? భగవాను శరీరం బాగుండనప్పుడు ఆశ్రమసమీపంలో ఈ మూఢాచారం జరగవచ్చునా? ఎలాగైనా ఇది ఆపాలని గట్టిగా తోచింది. ఆ సాయంత్రమే రమణనగరంలో నివసించే భక్తులలో కొందర్ని కలుసుకొని "అన్నా! ఇదేమి అన్యాయం, ఆశ్రమ సమీపంలో ఈ రక్తపాతమేమి? కూడదని వారించరాదా?"అన్నాను. "అమ్మా వాళ్లు క్షుద్రమంత్రవేత్తలు. మనం ఏదన్నా అంటే మనమీద ప్రయోగం చేస్తారేమోనమ్మా. ఈ విషయంలో మనము కల్పించుకోటం కష్టం"అని ఎవరూ ఆ పనికి నిలబడలేదు. రెండు మూడు రోజులు చూచాను. లాభం లేకపోయింది. బలులా అంత కంతకూ అధికం అవుతున్నవి. ఆ రక్తపాతం, ఆ నోరులేని జంతువుల ఆర్తనాదం చూడలేకా, వినలేకా ఈ విషయంలో భగవాను సూచన ఎలాగుంటుందో చూద్దామని ఒక రోజున సాహసించి సమీపవర్తులగు కృష్ణస్వామి వాళ్లతో చెప్పి మధ్యాహ్నం మూడు గంటల వేళ ఎవరూ లేకుండా చూచి భగవాన్ సన్నిధికి వెళ్లి నమస్కరించి లేవగానే "ఏమి?" అన్నట్లు చూచారు భగవాన్. నేను చేతులు నలుపుకుంటూ "ఇక్కడ కాళికా దేవాలయంలో ఘోరంగా బలులు జరుగుతూ వున్నవి. ఇదివరకంతగా లేదు. ఇప్పుడు మరీ ఎక్కువైనవి. భగవాన్ వున్న ఈ గదికి కూడా ఆ పశువుల ఆర్తనాదం వినబడవచ్చును. ఆ రక్తపాతం చూడలేకుండా వున్నానే?" అన్నాను. భగవాన్ దయాపూర్ణ దృష్టితో చూస్తూ "అవును. వినబడుతూనే వున్నవి. కానీ ఎవరూ అది పట్టించుకోరు. ఏం జేసేదీ?"అన్నారు.



(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దిన ఫలాలు

మేష రాశి: కోర్టు సంబంధిత వ్యవహారాలలో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగు తాయి. ప్రయాణాల విష యంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కా రాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవు తాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్య క్రమాలు కలసి వస్తాయి. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతం లోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నా లతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయా ణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగి స్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటా యి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొం టారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విష యాల్లో సులువుగా అవకాశాలు లభి స్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పను లలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరో గ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదా యంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనం దాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యా లలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అను కూల/ ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసు కోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగ లుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పని సరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.


మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటు ంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఆంధ్రప్రభ నాయిక

సాహసం



కెమెరా కంట కన్నీరు!

వీడియాలో రిపోర్టింగ్ విభాగంలో పనిచేయాలంటే సాహసం, తెగువ ఉండాలి. హఠాత్పరిణామాలు ఎదురైనప్పుడు భయపడి బేలముఖంతో నిలబడిపోకుండా ధైర్యంగా ముందుకు సాగిపోవాలి. అప్పుడే వారు తమ విధి నిర్వహణలో రాణించగలుగుతారు. అలాంటి విపత్కరపరిస్థితుల్లో తన కర్తవ్యాన్ని వీడకుండా ధైర్యంగా తన విధులను నిర్వహించి సోషల్ మీడియాలో హల్ చల్ సృష్టిస్తోంది. ఆమే కెమెరా ఉమెన్ షాజిలా అబ్దుల్ రహ్మాన్.

షాజిలా అబ్దుల్ రహ్మాన్ కైరాలి టీవీలో కెమెరా ఉమెన్‌గా పనిచేస్తుంది. శబరిమలలో జరుగుతున్న నిరసన ఉద్యమాల దృశ్యాలను చిత్రీకరించే బాధ్యత ఆ టీవీ యాజమాన్యం ఆమెకు అప్పగించింది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ కొన్ని గ్రూపులు నిరసన ప్రదర్శనలను కేరళలోని తిరువనంతపురంలో చేపట్టారు. ఆ దృశ్యాలను షాజిలా చిత్రీకరించడం చూసిన నిరసనకారులు ఆమె దగ్గరకు వచ్చి కెమెరాషూట్ చేయడం ఆపివేయమని బెదిరించారు. భౌతిక దాడి కూడా చేశారు. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. వారి బెదిరింపులకు ఒకవైపు బాధపడుతూనే కెమెరాను ఆఫ్ చేయకుండా అక్కడి సన్నివేశాలను ధైర్యంగా చిత్రీకరించింది. నిరసనకారులు ఆమెతో ప్రవర్తించిన తీరుకు ఆమె చాలా



బాధపడింది. కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. అలా కన్నీళ్లతోనే కెమెరా షూట్‌చేస్తుండడం ఇంకో కెమెరామెన్ చూసాడు. ఆమె ఎదుర్కొన్న సంఘటనను, ఆమె పడిన బాధను వివరిస్తూ ఫొటోలను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దానికి చాలా మంచి స్పందన వచ్చింది. చాలామంది ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ మెసేజ్‌లు పెట్టారు.

తమ టివికి స్పెషల్ న్యూస్ కోసం ఆమె ఎంతో ధైర్యంగా వ్యవహరించింది. శబరిమల ఆలయంలో ఇద్దరుమహిళలు ప్రవేశించడాన్ని నిరసిస్తూ కేరళ వ్యాప్తంగా అల్లర్లు జరిగాయి. ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు మహిళలు అయ్యప్పను దర్శించుకున్నారు. 10 నుంచి 50 యేళ్ల లోపు మధ్య వయస్సున్న ఆడవాళ్లకు అయ్యప్ప ఆలయ ప్రవేశం నిషిద్ధమన్న విషయం తెలిసిందే. అయితే, అయ్యప్పను దర్శించుకునే హక్కు మహిళలకూ ఉందని, అందుకు అనుమతించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆ మధ్య తీర్పు ఇచ్చింది. దీంతో కొంతమంది మహిళలు ఆలయ ప్రవేశానికి ప్రయత్నించారు. హిందూసంఘం, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దీనిని అడ్డుకోవడంతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రప్రభుత్వం 2వతేదీన పోలీసు సిబ్బందిని రక్షణగా ఇచ్చి ఆ ఇద్దరు మహిళలను ఆలయంలోకి పంపించింది. వారిద్దరూ 40 ఏళ్ల లోపువారే. దీంతో తిరువనంతపురంలో చెలరేగిన అల్లర్లను చిత్రీకరించడానికి షాజిల్లా వెళ్లింది. ఆమె వెంట ఉన్న మీడియా మిత్రులు చాలామంది ఆలయ నిరసనకారుల నుంచి దాడులను ఎదుర్కొన్నారు. ఆమె కూడా చాలా సవాళ్లను ఎదుర్కొంది. అయినా ఆమె భయపడలేదు. మొత్తం సన్నివేశాలను చిత్రీకరిస్తూనే ఉంది. నిరసనకారులు ఆమె దగ్గరనుంచి కెమెరా తీసుకోవడానికి కూడా ప్రయత్నించారు. అయినా ఆమె వారి నుంచి తప్పించుకోగలిగింది. ఆ సంఘటనలో ఆమెకు గాయాలై ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. మెడకు నెక్ బెల్ట్‌పెట్టుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

''నిరసనకారులలో ఐదారుగురు నన్ను చుట్టిముట్టి, నా కెమెరాను లాక్కొని నన్ను క్రిందపడవేశారు. అంతమందిని నేను ఎలా ప్రతిఘటించగలను? నేను వారికి భయపడి ఏడవలేదు. నా కెమెరా లాక్కున్నందుకు ఏడ్చాను. నానిస్సహాయతకు ఏడుపు వచ్చింది. అప్పటి వరకు నేను తీసిన ఎన్నో సన్నివేశాలు మిస్సయిపోతాయేమోనని భయంతో ఏడ్చాను. నాకెమెరా నాకు దక్కగానే ముందుగా దానిలో అన్నీ ఉన్నాయో లేదోనని చెక్ చేసుకున్నాను. నా బాధ ఎవరికీ కనబడకూడదనే నేను కెమెరాను నా ముఖానికి అడ్డుగా పెట్టుకున్నాను. అయినా ఎవరో నా సంఘటనను షూట్‌చేసి సోషల్‌మీడియాలో పెట్టారు''అని షాజిదా చెప్పింది.

సోషల్‌మీడియాలో ఆమె ఫొటోలను, సంఘటనను చదివి తెలుసుకున్న ప్రతి ఒక్కరూ వృత్తిపట్ల ఆమెకున్న అంకితభావాన్ని, ఆమెలోని సాహసాన్ని మెచ్చుకుంటూ ప్రశంసలు అందజేశారు.

గిరిజన గూడెంలో 'ఉషో'దయం

ప్రయాణాలు చేయాలంటే కొంతమందికి ఎక్కడలేని నీరసం వస్తుంది. అలాంటి వారు ఒకరోజు ప్రయాణం చేస్తే వారం రోజులు విశ్రాంతి తీసుకుంటారు. కాని ఆమెకు ప్రయాణమే జీవితం. ఈ ప్రయాణం కూడా రైల్లో, బస్సో అని అనుకుంటే పొరబాటు పడ్డట్టే. ఆమె రోజూ పడవలో ప్రయాణం చేసి నదులు దాటి, కొండలెక్కి పర్వతాల మీద ఉన్న గిరిజన పిల్లలకు విద్యాభ్యాసాలు నేర్పుతుంది. ఆమే ఉషాకుమారి. కేవలం విద్య మాత్రమే కాకుండా వారిని మంచి సంస్కారవంతులుగా తయారుచేయాలన్నదే తన ఆశయమని చెబుతుంది. అడవుల్లోకి వెళ్లి ఈవిధమైన బాధ్యతాయుతమైన విధులు ఎలా నిర్వహించాల్సి వచ్చిందనే వివరాలు తెలుసుకుందాం.

ఆదర్శం

ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమానం. ఇంట్లో తల్లిదండ్రులు మంచి అలవాట్లు నేర్పిస్తే. స్కూల్లో టీచర్లు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పి సమాజానికి మంచి పౌరులను అందజేస్తారు. వీరిద్దరి పాత్ర చాలా కీలకమైనది. వారు గనుక తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోతే పిల్లల భవిష్యత్ అంధకారమే. కాని కె.ఆర్.ఉషాకుమారి అటు తల్లిదండ్రుల బాధ్యతను, ఉపాధ్యాయుల విధులను రెండింటిని సక్రమంగా నిర్వర్తిస్తుంది. ఆమెతిరువనంతపురం జిల్లాలోని అంబూరి గ్రామానికి చెందినది. గిరిజన పిల్లలకు విద్యాభ్యాసాలు నేర్పించడానికి ఆమె ప్రతీరోజూ నదులు దాటి, కొండలెక్కి సరైన సమయానికి స్కూల్‌కి వెళ్లి వారికి పాఠాలు నేర్పిస్తుంది. ఈ విధంగా ఆమె 16సంవత్సరాల నుంచి తమ విధులను క్రమం తప్పకుండా నిర్వర్తిస్తుంది. ఆమె ప్రయాణం ఉదయం 7.30ని.లకు ప్రారంభమవుతుంది. తన స్కూటీమీద కుంబిక్కల్ నుంచి కడవు వరకు వెళుతుంది. అక్కడ బండిని పార్కింగ్ చేసి, పడవ మీద అవతలి ఒడ్డుకు ప్రయాణిస్తుంది. అక్కడ దిగి కాలినడకన కొన్ని గుట్టలు ఎక్కుతుంది. అలా కొన్ని కిలోమీటర్లు ప్రయాణించాక చాలా దట్టమైన అటవీ ప్రాంతం వస్తుంది. చుట్టు పక్కల మనుషులెవరూ కనబడరు. అటువంటి ప్రాంతంలో కూడా ఆమె ధైర్యంగా నడుచుకుంటూ వెళుతుంది. ఆ ప్రాంతంలో ఎక్కువగా ఏనుగులు, చిరుతపులులు ఉంటాయి. వీటన్నింటిని తరమడానికని ఆమె ఒక కర్రను చేత్తో పట్టుకుని నడుస్తుంది. వెళ్తున్న దారిలో స్కూల్‌కి వచ్చే పిల్లల ఇళ్లు ఉంటే వారిని తనతో పాటు తీసుకుని వెళుతుంది. ఆ పిల్లలందరూ కున్నతులలోని కన్ని



ట్రైబల్ జాతికి చెందినవారు. స్కూల్ పేరు అగస్త్య ఇగ అధ్యాపక విద్యాలయ. ఈ స్కూల్ అగస్త్యర్‌కూడమ్ ప్రాంతానికి 1868మీటర్ల (6,129అడుగుల) ఎత్తులో ఉంది. అలా ఆమె రోజూ నడుచుకుంటూ రెండు గంటలు ప్రయాణించాక వారి గమ్యం వస్తుంది. ఆవిధంగా ఆమె పదహారు సంవత్సరాల నుంచి ఈ ప్రయాణాన్ని చేస్తుంది. ఏ ఒక్క రోజు కూడా స్కూల్ సమయానికి ఆలస్యంగా వెళ్లలేదని ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉషాకుమారి చెప్పింది. స్కూల్ సమయం ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు. ఆమె ఒక్కరే ఉపాధ్యాయిని. అన్ని భాషల్లో అన్ని సబ్జెక్టులను బోధిస్తుంది. లెక్కలు, విజ్ఞానశాస్త్రం, తెలుగు భాష అన్నింటిని నేర్పుతుంది. క్లాస్ 1 నుంచి క్లాస్ 4 వరకు మొత్తం పద్నాలుగు మంది పిల్లలకు నేర్పుతుంది.

తిరువనంతపురం ట్రైబల్ ప్రాంతాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. 1999 నుంచి ప్రారంభమయ్యాయి. అంతకుముందు నుంచే మలప్పురం వంటి ప్రాంతాల్లో అమలులో ఉంది. ఆమె కేవలం టీచర్‌గా విద్యను చెప్పడమే కాకుండా, స్కూల్‌కి కావలసినవి, పిల్లలకు కావలసిన అవసరాలను తెలుసుకుని తీర్చుతుంది. వారికి మధ్యాహ్నం పోషకాహారంతో భోజనాన్ని పెట్టిస్తుంది. పాలు, గుడ్లు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఆమె రాని సమయంలో ఇవన్నీ నిర్వహించడానికి ఒక కేర్‌టేకర్‌ను కూడా నియమించింది. ఆమె ఈ విధి నిర్వహణను ఒక ఛాలెంజింగ్‌గా తీసుకుని నిర్వహిస్తుంది. తనకు ఒక్కోసారి జీతం పంపించ డానికి చాలా సమయం పడుతుంది. అయినా పిల్లలకు ఎటువంటి లోటు రాకుండా చూసు కుంటుంది. ప్రభుత్వం నిధులు పంపించలేనప్పుడు తన పాకెట్‌మనీతో వారికి తిండి పెట్టిస్తుంది. ఇప్పుడు పాఠశాల బిల్డింగ్‌ను కొత్తపద్ధతిలో నిర్మించాలని అనుకుంటుంది. దీనికి ప్రభుత్వ సాయాన్ని కోరు తుంది. దీనికోసం కొద్దిరోజులు వారుచెట్ల కింద రాళ్లమీద కూర్చుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఉంది. స్కూల్‌కోసం ఎన్ని బాధలలైనా భరిస్తామని ఆమె చెబుతుంది. ఆమె చిత్తశుద్ధితో చేస్తున్న కృషిని గుర్తించిన సేవాసంస్థలు ఎన్నో అవార్డులను అందజేశాయి. అందులో సాక్షరత పురస్కార్, కన్‌ఫెడ్ (కేరళ అసోసియేషన్ ఫర్ నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్) అవార్డు ముఖ్యమైనవి. ఆమె నేర్పిన విద్యతో పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి తమ జీవితాలను ప్రగతిపథంలో నడిచేలా మార్చు కోవడమే తనకు అసలైన అవార్డు అని, నా లక్ష్యం సాధించేవరకు నా ప్రయాణం ఆగదని ఎంతో ఆనందంగా ఉషాకుమారి చెబుతుంది.

వైకల్యం శరీరానికే గాని మనసుకు కాదని ఆమెలోని పట్టుదలను చూస్తే అర్థమవుతుంది. ప్రమాదంలో కాలు కోల్పోయినా తన లక్ష్యసాధనకోసం కృత్రిమకాలును ఏర్పాటుచేసుకుని ముందుకు సాగి విజయం సాధించింది. ఆమే అరుణిమా సిన్హా.

ఆమెకు తలవంచిన 'శిఖరం'

స్ఫూర్తి





2013సం.లో 30యేళ్ల వయసులో ఆమె మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన మొట్ట మొదటి దివ్యాంగురాలిగా పేరు సంపాదించుకున్నారు. ఈసందర్భంగా భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆమె లక్ష్యం అక్కడితో ఆగిపోలేదు. ఇంకా ఏదో సాధించాలనే తపన ఆమెలో ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఆ తపనతోనే అంటార్కిటికాలో ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించి మరో రికార్డును సృష్టించింది. వైకల్యం అనేది శరీరానికే గాని మనసుకు కాదని, లక్ష్యసాధన దృఢంగా ఉంటే ఎంతటి శిఖారాలనైనా అధిరోహించవచ్చని నిరూపించింది. అరుణిమా సిన్హా. కొన్ని సంవత్సరాల క్రితం 2011స.ంలో జరిగిన ఒక ప్రమాదంలో ఆమె తన కాలును పోగొట్టుకుంది. ఆమె రైలులో ప్రయాణిస్తున్నప్పుడు దోపిడీదొంగలు ఆ రైలులో ప్రవేశించారు. ఆమె వారిని అడ్డుకోవడంతో రైలులో నుంచి తోసివేశారు. ఆ సమయంలో ఆమె కాలును కోల్పోయింది. ఆమెను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో జాయిన్ చేశారు. అప్పటికే ఆమె పర్వతారోహకురాలిగా పేరు తెచ్చుకుంది. ఆమెకు ఇటువంటిప్రమాదం జరగటం వల్ల అందరూ ఆమెవైపు జాలిగా చూసేవారు. ఆ జాలిచూపులు ఆమెను మరింత బాధపెట్టేవి. ఆ బాధనుంచే పట్టుదల పెరిగింది. ఎలాగైనా తన లక్ష్యాలనుచేరుకోవాలని ఆ క్షణమే నిర్ణయించుకుంది. తన లక్ష్యసాధనకోసం ఏంచేయాలా అని ఆలోచించడం మొదలుపెట్టి మనోధైర్యంతో ముందుకు సాగింది. ఆ మనోధైర్యమే ఆమెను విజయపథంలో నడిపించాయి. మొట్టమొదటిసారి ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన దివ్యాంగురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. ఈమధ్యనే అంటార్కిటికాలో ఉన్న మౌంట్ విన్సన్ పర్వతాన్ని అధిరోహించి మరోసారి తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుంది. ఆమె సాధించిన ఈ విజయాన్ని గుర్తించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆమె ధైర్యసాహసాలను అభినందించి పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. ''అత్యున్నత శిఖరాలను అధిరోహించిన అరుణిమా సిన్హాకి అభినందనలు. ఆమె భారతదేశానికి గర్వకారణం. తన అకుంఠిత శ్రమతో అనుకున్న లక్ష్యాలను సాధించారు. ఆమె భవిష్యత్ మరింత ప్రకాశవంతంగా ఉండాలని, మరెన్నో లక్ష్యాలను సాధించాలని ఆశిస్తున్నాను'' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు.

ఆమె భారతీయ పర్వతారోహకురాలే కాకుండా జాతీయస్థాయి వాలీబాల్ ప్లేయర్. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన దివ్యాంగురాలిగా ఆమె రికార్డు సృష్టించారు. అదేకాకుండా ఆఫ్రికాలోని కిలిమంజారో, ఆస్ట్రేలియాలోని మౌంట్ కొసియస్కో, యూరోప్‌లోని మౌంట్ ఎల్బ్రస్, సౌత్ అమెరికాలోని మౌంట్ అకాన్‌కాంగ్వా కూడా అధిరోహించారు. తనకు జరిగిన ప్రమాదం వల్ల తన కాలులో రాడ్, ఒక ప్లేట్‌ను అమర్చారని, దీనివల్ల పర్వతాలు ఎక్కేటప్పుడు కొంచెం బాధ అనిపిస్తుందని, కాని లక్ష్యసాధన కోసం ఎంతటి బాధనైనా భరిస్తానని, ఆరు ఖండాలలోని ఆరు పర్వతాలను అధిరోహించడమే తన ఆశయం''అని అరుణిమా సిన్హా చెబుతుంది.

సప్తసముద్రాలు జయించిన బుల

ప్రత్యేకం

సముద్రపు నీరంటేనే ఆమెకు అలెర్జీ. కాని స్విమ్మింగ్ చేయాలనే బలమైన కోరిక ఉండేది. తన కోరిక తీరడం కోసం అలెర్జీని కూడా లక్ష్యపెట్టకుండా ఏడు సముద్రాలను దిగ్విజయంగా స్విమ్ చేసిన మహిళగా గుర్తింపు పొందారు బుల చౌదరి. స్విమ్మింగ్‌వైపు ఆమె పయనమెలా సాగిందో తెలుసుకుందాం.

మనకు సరిపడలేదని దేనినైనా వదలిపెట్టడం తేలికైన పనే. కాని అందులో పట్టుదలతో రాణిస్తే కోరుకున్న విజయాలను సులువుగా చేరగలము, అలా ఆమెకు నచ్చిన స్విమ్మింగ్‌లో రాణించగలిగింది బుల చౌదరి. ఆమె సముద్రంలో దిగితే శరీరమంతా మంటలు మాత్రమే కాదు దురద కూడా మొదలవుతుంది. అయినా తన లక్ష్యసాధనకోసం వాటిని లక్ష్యపెట్టకుండా ఇంగ్లీష్ ఛానెల్ మొత్తం స్విమ్మింగ్ చేసింది. ఆమె వయసు 48 సంవత్సరాలు. మూడు సంవత్సరాల వయసు నుంచే ఆమె స్విమ్మింగ్ చేయడం మొదలుపెట్టింది. స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. కాని మొదట్లో స్విమ్మింగ్ చేయడమంటే చాలా భయం ఉండేది. వాళ్ల ఇంటికి దగ్గరలో ఉన్న చెరువు దగ్గరకు తండ్రి తీసుకువెళ్లినప్పుడు అక్కడ స్విమ్మింగ్‌చేసే వాళ్లని చాలా ఆసక్తితో చూస్తూ కూర్చునేది. ఒకరోజు అకస్మాత్తుగా బుల నీటిలో పడిపోయింది. స్విమ్ చేయడం తెలీదు కాబట్టే రక్షించండి అని అరవడం మొదలుపెట్టింది. ఒక ధైర్యవంతుడు ఆమెను కాపాడాడు. ఆరోజే ఆమె తండ్రి కూతురికి ఇటువంటి పరిస్థితి మళ్లీ ఎదురైతే ఏం జరుగుతుందోననే భయంతో స్విమ్మింగ్ నేర్పించాలనే నిర్ణయాన్ని తీసుకున్నాడు. తండ్రి కోరిక నెరవేర్చాలని ఆమె కూడా నిర్ణయించుకుని స్విమ్మింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఒక సంవత్సరం స్విమ్మింగ్ నేర్చుకున్న తర్వాత ఎక్కడ నేర్చుకుందో అదే క్లబ్‌లో స్విమ్మింగ్ నేర్పే శిక్షకురాలిగా చేరింది.

ఆమె పశ్చిమబెంగాల్‌లోని చిన్న నగరానికి చెందినది. స్విమ్‌సూట్ ఏవిధంగా ఉంటుందనే అవగాహన కూడా లేని ప్రాంతంలో పెరిగింది. ఫ్రాక్ వేసుకునే స్విమ్మింగ్ నేర్చుకునేది. ఒకరోజు తల్లి ఒక షాపులో స్విమ్‌సూట్‌ని చూసి ఆవిధంగా కూతురు కోసం ఒక సూట్‌ని కుట్టించింది. ఆర్థికంగా కుటుంబ పరిస్థితి బాగోక పోయినా అమ్మాయికోసం ఆమె మంచి కాటన్ క్లాత్‌తో ఒక సూట్ తయారుచేసింది.

కాని బులకి దాని నాణ్యత గురించి తెలీకపోవడంతో అది వేసుకుని చాలా నిర్లక్ష్యంగా స్విమ్మింగ్ చేసేది. ఆమెకు స్విమ్మింగ్ అంటే ప్రాణమని ఆమెను నేర్పించిన వారందరూ ఆమెలోని నైపుణ్యాన్ని గుర్తించారు.

''నా క్యాంప్‌లో ఉన్న మిగతా 14మంది బాలికలలో బుల ప్రత్యేకమైనది. చాలా శక్తిసామర్థ్యాలు కలది. ఆమె చాలా చిన్నవయసులోనే స్విమ్మింగ్‌లోకి ప్రవేశించింది. దానివల్ల ఆమె స్విమ్మింగ్‌లోని టెక్నిక్స్ ఎన్నింటినో సులువుగానే నేర్చుకుంది'' అని 1982సం.లో ఆమె కోచ్ బెర్నార్డ్ జాన్స్ అన్నారు.

పన్నెండు సంవత్సరాల వయసులో బుల నాలుగు అడుగుల ఐదు అంగుళాల పొడవు, 34 కేజీలు బరువు ఉండేది. కాని నీటిలో చేపపిల్లలా చాలా వేగంగా ఈత కొట్టేది. యువ స్విమ్మర్‌గా అప్పటివరకు ఉన్న చాలా రికార్డులను ఆమె తిరగరాయడమే కాకుండా తిరుగులేని రికార్డులను సృష్టించింది. ఆమె కామన్‌వెల్త్ గేమ్స్ నుంచి ఏసియన్ ఛాంపియన్‌షిప్‌స్థాయి వరకు పోటీలలో పాల్గొనేది. కాలం గడిచిన కొద్దీ స్విమ్మింగ్ పూల్ బులకి చిన్నదవడం మొదలైంది. ఆమె దృష్టిసముద్రం మీద పడింది. 1989లో ఆమె ఇంగ్లీష్ ఛానెల్‌లో స్విమ్ చేయడానికి శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. అప్పుడే ఆమెకు సముద్రపు నీటితో అలెర్జీ వస్తుందని తెలిసింది. కాని అక్కడితో ఆమె ఆగిపోలేదు. స్విమ్ చేశాక రాత్రంతా మంటతో బాధపడేది. ఇలాంటి చిన్నచిన్న అవాంతరాలు లక్ష్యపెట్టలేదు. ప్రొఫెషనల్ స్విమ్మర్ కావాలన్నదే ఆమె కోరిక. 1989సం.నాటికి ఆమె వయస్సు 19 సంవత్సరాలు. ఆమె మొదటి డ్రైవ్‌ను ఇంగ్లీష్ ఛానెల్‌లో మొదలుపెట్టింది. తిరిగి పది సంవత్సరాల తరువాత కూడా అందులోనే చేసింది. 2004లో ఆమె ప్రపంచ రికార్డును సృష్టించింది. ఏడు సముద్రాలను దాటిన మొట్టమొదటి మహిళగా ఆమె పేరు సంపాదించు కుంది. శ్రీలంకలోని తలైమన్నార్ పాక్ జలసంధి నుంచి భారతదేశంలోని తమిళనాడు వరకు వచ్చింది. 2005లో ఐదు విభాగాల నుంచి సముద్ర ఛానెల్స్‌లో స్విమ్ చేసిన మొట్టమొదటి మహిళగా పేరు తెచ్చుకుంది. 30కిలోమీటర్ల ట్రాక్‌ను మూడు గంటల 36 నిమిషాల్లో పూర్తిచేసి రికార్డు సృష్టించింది. సౌత్ ఏసియన్ ఫెడరేషన్ గేమ్స్‌లో విజేత, వరల్డ్ రికార్డ్ గ్రహీత కూడా. ఆమె అర్జున అవార్డు, పద్మశ్రీ అవార్డును కూడా పొందింది. భారతదేశ ప్రతిష్ఠాత్మకమైన నాలుగు అవార్డులను ఆమె దక్కించుకుంది.

''నీరే జీవితమని చెప్పారు. అది నా జీవితంలో ముమ్మాటికీ నిజం అయ్యింది. కొన్ని రోజులు డే జాబ్స్ చేశాను. కాని వాటిమీద శ్రద్ధ పెట్టలేకపోయాను. ఒక్క స్విమ్మింగ్ మీదనే నా శ్రద్ధంతా ఉందని గ్రహించాను. అప్పటినుంచి నా దృష్టంతా దానిపైనే పెట్టాను. ఆర్థిక ఇబ్బందులు, అలర్జీలు వంటివి నాలక్ష్యసాధనకు అడ్డంకులుగా మారనివ్వలేదు'' అని బులచౌదరి చెబుతుంది.

ప్రస్తుతం బెంగాల్‌లో స్విమ్మింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించి విజయవంతంగా నడుపుతుంది. అందులో తనలాంటి ఎంతోమంది స్విమ్మర్‌లను తయారుచేస్తుంది.



టాలీవుడ్‌లో తగ్గాయి... కోలీవుడ్‌లో పెరిగాయి



రకుల్ ప్రీత్‌సింగ్

కళాకారులకు భాషతో నిమిత్తం లేదంటారు. కెరీర్ పరంగా ఎప్పుడూ బిజీగా ఉండటం కోసం ఎక్కడ అవకాశాలు లభిస్తే అక్కడికి పరుగులు తీయడం చూస్తున్నదే. ఒకప్పటితో పోల్చుకుంటే ఇలా పలు భాషల్లో నటించడం అన్నది గత కొన్నేళ్లుగా ఊపందుకుంది. ఈ కోవలో టాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన కొందరు హీరోయిన్లకు ఇక్కడ అవకాశాలు సన్నగిల్లడంతో ఇప్పుడు వారు తమిళంలో బిజీ బిజీగా ఉన్నారు. వాస్తవానికి వారు తెలుగు, తమిళ భాషల సినిమాలు మొదట్నుంచి చేస్తూ వచ్చినప్పటికీ వారి చేతిలో ఇప్పుడు తమిళ సినిమాలే అధికంగా ఉండటం గమనార్హం. అలాగని అడపాదడపా తెలుగులో వచ్చిన అవకాశాలను వదిలిపెట్టకుండానే సంఖ్యాపరంగా తమిళ సినిమాలను అధికంగా చేసేందుకు పచ్చజెండా ఊపుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే...

తెలుగు సినీరంగంలో పలువురు ప్రముఖ హీరోల సరసన నటించడంతో పాటు పలు విజయాలను సొంతం చేసుకున్న రకుల్‌ప్రీత్‌సింగ్‌కు స్పైడర్ చిత్రం తర్వాత అవకాశాలు సన్నగిల్లాయి. ఫెయిల్యూర్లు రావడం వల్లే ఆమెకు అలాంటి పరిస్థితి ఎదురైందని అంటున్నారు. దాంతో కొంతకాలంగా ఆమె తమిళ సినీరంగంపై దృష్టినిలిపింది. తెలుగులో ఎన్.టి.ఆర్. కథానాయకుడు చిత్రంలో శ్రీదేవి పాత్రలోను, వెంకీ మామ చిత్రంలో నాగచైతన్య సరసన నటిస్తున్న ఆమె చేతిలో మూడు తమిళ చిత్రాలున్నాయి సూర్య సరసన ఎన్.జి.కె., కార్తి సరసన దేవ్, శివకార్తికేయన్ సరసన ఓ చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. ఇక అచ్చ తెలుగు భామ అంజలి విషయానికి వస్తే...చిత్రాంగధ చిత్రం తర్వాత తెలుగులో అవకాశాలు రాకపోవడంతో తమిళ సినిమారంగంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ప్రస్తుతం తమిళంలో ఆమె నటిస్తున్న లిసా చిత్రాన్ని తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే ఓ అనే తమిళ చిత్రంతో పాటు విజయ్ సేతుపతి నటిస్తున్న వేరొక చిత్రంలోనూ అంజలి మెరవబోతోంది. తెలుగులో తన కెరీర్ మళ్లీ ఎప్పుడు మలుపు తిరుగుతుందోనని ఆమె కోటి ఆశలతో ఎదురు చూస్తోంది. మరో అందాల భామ కాజల్ అగర్వాల్ సైతం తెలుగులో అడపాదడపా సినిమాలు చేస్తూనే ఉన్నా తమిళంలో మరిన్ని ఎక్కువ అవకాశాలు లభిస్తుండటంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది.తెలుగులో కవచం ఫెయిల్యూర్ తర్వాత ఇప్పుడామె బెల్లంకొండ శ్రీనివాస్ సరసనే తేజ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తోంది. తమిళంలో మాత్రం మూడు అవకాశాలు ఇప్పుడామె చేతిలో ఉన్నాయి. పారిస్ పారిస్, కోమలి వంటి తమిళ చిత్రాలు చేస్తున్న ఆమెకు కమల్‌హాసన్ వంటి జాతీయస్థాయి నటుడి చిత్రంలో నటించే అవకాశం లభించింది. ప్రధానంగా ఈ చిత్రం తమిళంలో రూపుదిద్దుకోనున్నప్పటికీ తెలుగు వంటి ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. ఈ క్రమంలోనే రాశిఖన్నా కూడా తెలుగు చిత్రాలకు మంచి ప్రాధాన్యమిస్తూ రావడమే కాదు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటోంది. శ్రీనివాస కల్యాణం తర్వాత తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన క్రాంతిమాధవ్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్ నిర్మిస్తున్న చిత్రంలో ఆమె నటిస్తోంది. తమిళంలో ఇప్పటికే ఆమె నటించిన రెండు సినిమాలు విజయం సాధించడంతో ఇప్పుడు పలు అవకాశాలు వెతుక్కుంటూ వస్తుండటంతో ఆమె రాశి బావుందని వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా విశాల్ సరసన అయోగ్య చిత్రంలోనూ, సిద్ధార్థ్ సరసన సైతాన్ కా బచ్చా చిత్రంలోనూ నటిస్తోంది. హీరో విజయ్, దర్శకుడు అట్లీ కాంబినేషన్ అంటే తనకు చాలా ఇష్టమని ఆమె చెబుతోంది. వారి కలయికలో వచ్చిన తెరి, మెర్సల్ చిత్రాలు చూశానని...వారి కాంబినేషన్ అంత గొప్పగా ఉంటుందని...అందుకే వారిద్దరూ చేసే చిత్రంలో నటించాలని తానెంతో కోరుకుంటున్నానని ఆమె చెప్పుకొచ్చింది. ఇక ఇంకో అందాల భామ రెజీనా కాసండ్రకు కూడా తెలుగులో అవకాశాలు లేకుండా పోయాయి. ఆ మధ్య వరుసగా వచ్చిన ఫెయిల్యూర్లు ఆమెకు టాలీవుడ్‌లో క్రేజ్‌ను తగ్గించేశాయి. దాంతో ఆమె కూడా తమిళ సినిమాలను చేస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్‌లో ఎస్.జె.సూర్య కథానాయకుడిగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలోనూ, ఇంకా జై కథానాయకుడిగా రూపొందుతున్న పార్టీ చిత్రంలోనూ రెజీనా నటిస్తోంది. అర్జున్‌రెడ్డి ఫేమ్ షాలినిపాండే కి కూడా తెలుగుతో పోల్చుకుంటే తమిళంలోనే అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అర్జున్‌రెడ్డి వంటి సూపర్‌డూపర్ హిట్ చిత్రం తర్వాత తమిళంలో మంచి అవకాశాలు రావడంతో అక్కడి సినిమాలను అంగీకరించినట్లు ఆమె చెబుతోంది. జి.వి.ప్రకాష్ సరసన 100 పర్సంట్ కాదల్, జీవా సరసన గొరిల్లా, విజయ్ అంటోని సరసన అగ్నిసిరగుగళ్ వంటి తమిళ సినిమాలలో ఆమె నటిస్తోంది. అంజలిలానే మరో అచ్చ తెలుగమ్మాయి ఆనందికి కూడా తెలుగులో కంటే తమిళంలోనే వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ఈరోజుల్లో, బస్టాప్, గ్రీన్‌సిగ్నల్ వంటి సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఆమె సుపరిచితమే. ప్రస్తుతం తెలుగులో ఆమెకు అవకాశాలు లేకపోయినా తమిళంలో మాత్రం టైటానిక్ అనే చిత్రంలో నటిస్తోంది. ఇలా ఈ భామలంతా కోలీవుడ్ సినిమాలతో కెరీర్‌ను నెట్టుకొస్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తే నటించడానికి ఎప్పుడూ సిద్ధమేనని అంటున్నారు.



షాలినిపాండే



కాజల్ అగర్వాల్



రెజీనా



అంజలి



రాశిఖన్నా

ప్రతీ ఇంట్లో ఇలాంటి వాడు ఉండాలనుకునే పాత్ర

- రామ్ చరణ్



నాన్నగారి స్ఫూర్తితో ఒక నటుడిగా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నాను. కేవలం ఒక తరహా చిత్రాలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. ఆ కోవలోనే రంగస్థలం చిత్రం తర్వాత దానికి భిన్నమైన వినయ విధేయ రామ చిత్రం చేశాను అని హీరో రామ్‌చరణ్ అన్నారు. రామ్‌చరణ్, కైరా అద్వాని నాయకానాయికలుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో రామ్‌చరణ్ కొద్దిసేపు ముచ్చటించారు.

వినయ విధేయ రామ కథాకమామీషు ఏంటి?

బోయపాటి జోనర్‌లో ఉంటుంది. అన్ని అంశాలకు సమాన ప్రాధాన్యం ఉంది. ఈ సంక్రాంతికి రాదగ్గ చక్కటి కథాచిత్రం. మాస్ అంశాలతో పాటు ఫ్యామిలీ ప్రేక్షకులు మెచ్చే అంశాలున్నాయి. కథకు సరిపోయే మంచి టైటిల్ కుదిరింది. గతంలో బోయపాటి దర్శకత్వం వహించిన జయ జానకి నాయక చిత్రం టైటిల్ కూడా అప్పట్లో నన్నెంతో ఆకట్టుకుంది. అలానే ఈ టైటిల్ కూడా సినిమాకు అంతబాగా సరిపోయింది.

ఇందులో మీ పాత్ర స్వభావం ఎలా ఉంటుంది?

ఈ సినిమాలో రామ్ పాత్రలో నటించాను. ప్రతీ ఇంట్లో ఇలాంటి వాడు ఒకడు ఉండాలని అనుకునే పాత్ర నాది. రాముడులా వినయంగా ఉంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించేలా ఉంటుంది. అంతమాత్రాన యాక్షన్ అంశాలు ఎక్కువగా ఉండవు. కాకపోతే యాక్షన్ ఓ అంశంగా హైలైట్‌గా ఉంటుంది. భద్ర సినిమా మొదలుకుని సరైనోడు చిత్రం వరకు బోయపాటి సినిమాలను చూస్తే...కేవలం యాక్షన్ అంశాలే కాకుండా మంచి ఫ్యామిలీ డ్రామాతో పాటు లవ్ అంశాలకు ఎంత ప్రాధాన్యమిచ్చారో తెలియంది కాదు. దానివల్లే ఆయనకు ఒక బ్రాండ్ ఇమేజ్ వచ్చింది.



రంగస్థలం తర్వాత ఈ తరహా చిత్రం చేయడానికి కారణం?

ప్రతీ సినిమాను రంగస్థలం మాదిరిగా చేయాలనుకోవడం కరెక్ట్ కాదు. ఒకనటుడిగా ఒకే తరహా చిత్రాలకు పరిమితం కాకుండా అన్ని జోనర్ చిత్రాలు చేయాలన్నదే నా ఉద్దేశ్యం. 1980లో నాన్నగారు కూడా అన్ని తరహా సినిమాలు చేశారు. ఆ స్ఫూర్తితోనే ఒక సెన్సిబుల్ చిత్రం సినిమా చేయాలనుకున్నాను. అదే ఈ చిత్రం చేయడానికి కారణమైంది.

ఓ నటుడిగా ఈ పాత్రలో మారడానికి కష్టమనిపించలేదా?

వాస్తవానికి రంగస్థలం తర్వాత ఈ చిత్రం చేసేందుకు ముందు ఇంకాస్త సమయం ఉంటే బావుండేదనిపించింది. కానీ రంగస్థలం షూటింగ్ అయిపోయిన 15 రోజుల గ్యాప్‌లోనే ఈ చిత్రాన్ని మొదలుపెట్టడం తప్పనిసరి అయింది. ఎందుకంటే బోయపాటికి, అలాగే నాకు ఉన్న వేరే కమిట్‌మెంట్స్ వల్ల తొందరగా మొదలు పెట్టాల్సి వచ్చింది. అయితే దర్శకుడిగా బోయపాటికి ఉన్న స్పష్టత వల్ల నాకు ఈ చిత్రంలోని రామ్ పాత్ర చేయడం పెద్ద కష్టమేమీ అనిపించలేదు.

సినిమా కోసం పాటించే ఆహార నియమాలను ఎప్పుడూ కొనసాగిస్తుంటారా?

ఈ సినిమా కోసం బాడీ వర్క్‌వుట్స్ కోసం కొన్ని ఆహార నియమాలను పాటించాను. కానీ ఎప్పుడూ అలాంటి ఆహార నియమాలనే పాటించాలంటే కష్టమౌతుంది. సినిమా కోసం ఒకటీ, రెండు నెలలు అలా పాటిస్తాను. మిగతా టైమ్‌లో ఆహారం మామూలుగానే తీసుకుంటాను.

ఆర్‌ఆర్‌ఆర్‌లో మీ పాత్ర గురించి?

రాజమౌళి మళ్లీ డీ గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర ప్రేక్షకులకు చాలాబాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ ఏడాది మొత్తం ఈ సినిమాకే కేటాయించాను.

ఆర్‌ఆర్‌ఆర్‌లో ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎలా ఉంది?

ఎన్టీఆర్ నాకు ఎప్పట్నుంచో సన్నిహితంగా ఉండే మంచి మిత్రుడు. ఈ చిత్రంలో మా ఇద్దరి కాంబినేషన్ సీన్లు చాలాబాగా వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేస్తుండటం ఆనందంగా ఉంది.

మీ బేనర్‌లో వేరే హీరోలతో కూడా సినిమాలను నిర్మిస్తారా?

లేదండి. అది కేవలం నాన్నగారి సినిమాల కోసమే పెట్టాం. అందులో నేను హీరోగా కూడా సినిమాలు చేయను. నాకు చాలా మంచి నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతానికైతే వేరే హీరోలతో సినిమాలను నిర్మించే ఆలోచన లేదు.

సైరా...చిత్రం సంగతులు?

సైరా నరసింహారెడ్డి చిత్రం అనుకున్న దానికంటే షూటింగ్ కొంత ఆలస్యమైంది. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. వేసవిలో విడుదల చేయాలన్న లక్ష్యాన్ని అనుకున్నాం కానీ అది వాయిదా పడింది. రీ షూటింగ్ జరుగుతున్నాయన్న వార్తలలో నిజం లేదు. మరో రెండు నెలల్లో ఈ చిత్రం షూటింగ్ పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్మాణానంతర పనులను పూర్తిచేసి..దసరా సీజన్‌లో సినిమాను విడుదల చేయనున్నాం. సైరా...చిత్రానికి ఉన్న స్థాయిని దృష్టిలో పెట్టుకుని హిందీ భాషలో కూడా విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. దీనివల్ల ఈ చిత్రం జాతీయ స్థాయి చిత్రమైంది. తప్పకుండా ఈ చిత్రం దేశవ్యాప్త ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

సైరా బడ్జెట్ ఎంత?

నాన్నగారితో పాటు అమితాబ్‌బచ్చన్, సుదీప్, విజయ్ సేతుపతి వంటి ప్రముఖ నటులతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం బడ్జెట్ పరిమితి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. నాన్న చేస్తున్న ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం ఎంత ఖర్చయినా ఫర్వాలేదనుకున్నాం. కానీ సినిమా స్థాయి గురించి చెప్పడం కోసం 200 కోట్ల పైనే బడ్జెట్ ఉంటుందని చెప్పవలసి వస్తోంది.

సైరా...కోసం మీ నాన్నకు ఎంత పారితోషికం ఇస్తున్నారు? ఆయన తదుపరి సినిమాలేంటి?

అత్యధికంగా పారితోషికం తీసుకునే హీరో ఆయన. ఆ స్థాయికి తగ్గకుండానే భారీ పారితోషికమే ఇస్తున్నాను. కావాలంటే ఆయననే అడగండి. అలాగే ఈ చిత్రం తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో నాన్నగారు నటించే సినిమా వేసవి కాలంలో మొదలవుతుంది. ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో నాన్నగారు నటిస్తారు అంటూ ఇంటర్వ్యూ ముగించారు.

ఆర్ ఆర్ ఆర్ తర్వాత..?



ఎన్టీఆర్

అరవింద సమేత తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. రాజమౌళి దర్శకుడు. ఇందులో రామ్ చరణ్ మరో హీరో. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్ నటించే సినిమాపై ఇంకా క్లారిటీ లేదు. అయినప్పటికీ సందీప్ రెడ్డి దర్శకత్వంలో నటించేందుకు ఆయన అంగీకరించారని సమాచారం. అర్జున్ రెడ్డి సినిమాతో వెలుగులోకి వచ్చిన సందీప్ తన తదుపరి చిత్రం ఎవరితో అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. అర్జున్ రెడ్డి చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నారు. తెలుగులో మహేష్‌బాబుతో కలిసి చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు ఎన్టీఆర్, సందీప్ కాంబినేషన్ సినిమా ఉంటుందని తెలిసింది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

నిర్మాతగా అల్లు అర్జున్!

అల్లు అర్జున్ నిర్మాతగా మారనున్నారని తెలిసింది. సొంత నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఉన్నప్పటికీ, తనకంటూ సొంతంగా నిర్మాణ సంస్థను నెలకొల్పాలనే యోచనతో ఉన్నట్టు తెలిసింది. అయితే నిర్మాతగా మారుతోంది టీవీ కోసం అని అంటున్నారు. సొంతంగా రియాలిటీ షోలు నిర్వహించాలనే ఉద్దేశం ఉందని సన్నిహితులు అంటున్నారు.

హీరోగా మంచి క్రేజ్ ఉన్న అల్లు అర్జున్ ఇటీవల లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. నా పేరు సూర్య సినిమా తర్వాత ఆయన మరే చిత్రం అంగీకరించలేదు. ఇటీవలే త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించేందుకు అంగీకరించారు.



రజనీ కొత్త సినిమా



తమిళ సూపర్‌స్టార్ రజనీ కాంత్ వరుసగా కొత్త సినిమాలు అంగీకరిస్తున్నా రు. ఇప్పటికే ఆయన రాజకీయ ప్రవేశం చేయనున్నట్టు ప్రకటించి ఉన్నారు. తమిళ నాడులో ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున, ఈ లోపు సినిమాలు కమిట్ అవుతున్నారు. ఇటీవలే రజనీ నటించిన కాలా రిలీజైంది. ఆ తర్వాత 2.ఓ సినిమా సైతం ప్రేక్షకుల ముందుకువచ్చింది. సంక్రాంతికి పేట విడుదలకానుంది. ఈ సినిమాలన్నీ తక్కువ వ్యవధిలోనే ఆయన పూర్తిచేశారు. తాజాగా మురుగదాస్ దర్శకత్వంలో నటించేందుకు అంగీకరించినట్టు తెలిసింది. ఈ చిత్రానికి నర్కాలి తెలుగులో కుర్చీ అని అర్థం. రజనీ రాజకీయ ప్రవేశం దృష్టితోనే ఈ సినిమాకు నర్కాలి అని టైటిల్ నిర్ణయించినట్టు అభిమానులు భావిస్తు న్నారు. మురుగదాస్ దర్శకత్వం వహిం చగా ఇటీవలే వచ్చిన సర్కార్ సినిమా ఓటు ప్రాముఖ్యతను తెలిపే కథాంశంతో తీసిన సంగతి తెలిసిందే.